ISSN 0971-278X


# ప్రజాసాహితి

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

సంచిక : 453

వెల : రూ.25/-

డిసెంబర్ 2022




జనసాహితి ప్రచురణ

కవిత

# సముద్రపుటంచు జీవితంలోకి

- క్రాంతి

అప్పుడప్పుడు
సముద్రపు జీవితాలను
తొంగి చూడాలి.
కడలి స్నేహంలో హాయిగా తేలియాడే
పల్లెకారుల ఆత్మీయత
రుచి చూసి వస్తే బాగుంటుంది.
ఇప్పటి వారి జీవితాలనూ
ఎప్పుడూ కలలుగనే
నిరంతర స్వప్నాలనూ
బేరీజు వేసుకునే వారి మనస్సుల్లోని
ఆశలను విశ్వప్రేమను
మనమెప్పుడైనా కనుగొన్నామా?!
వేకువనే వేటకు పోయేవారి
ఖాళీ కడుపులను గ్రహిస్తేనే
వేటాధార జీవన తాత్వికత
బోధపడుతుంది.
అస్థిరత్వప్రాయమైన ఆ కడలి కడుపుల
స్తబ్ధ కోరికలు, వేల ఆశలు
ఒక్కసారైనా
మనకు కానవచ్చాయా?!
ప్రమాదపు మాటుజామున
వారి నడక సుదీర్ఘంగా...
అలల మాటున నిశీధమాధ్యంలో
మొదలగును.
"చేప కూడుంది తినేసి పోవయ్యా!"
అని పిలిచే అభిమానం
రుచి యిచ్చే సంతృప్తి జీవితకాలం
సంతోషంగా గడపడానికి కావలసిన
విశ్వప్రేమను పొందడానికి
నీకంటూ ఒకరోజుండాలి.
అలల జోలాలి నడుమ సాగే
గంగమ్మ పొత్తిళ్ల నిదురలో
కంటుంటారు ఎన్నో కలలు...
కడలి కెరటాల తాకిడిలేని రోజు
వాడిపోయిన కలువకన్నులను
మీరెప్పుడైనా గమనించారా
సముద్రాన్ని ఏకగ్రీవంగా ఏ
మహారాజు మత్స్యకారుడు
ధీరుల్లాగ నడిచి వస్తున్న తీరుని
మీరింతకు మునుపెప్పుడూ
యెక్కడా చూసుండరు
అదృష్టం తట్టి వచ్చిన వేళ
సకలజనుల బంధు
బెస్తవారి ఆత్మీయత
అందుకోక తప్పవు.
సంద్రంలో సన్నకారు వేటగాళ్ల వేట
గంగమ్మతల్లి ఒడిలో
పసిపిల్లలు ఆడే ఆట...
ఈత వేట నడుమ పాడే పాట
గంగమ్మకు హాయినిచ్చి
నిదురబుచ్చే లాలిపాట.
వాళ్లు పట్టిన చేప
వాసన చూసావా
మనిషి వాసన వేస్తుంది
వాసనంటే శ్రమ సౌందర్యమే!
చెమట చుక్కలు వర్తమానందాకా
అలల వంతెనలు నిర్మించాలి
అలల వంతెనలంటే మానవ అనుబంధాలే!
కొత్త సందర్భాన్ని గుర్తించి
సరికొత్త 'విలువ'ల్ని 'మేలు' కొలపాలి
శక్తివంతమైన తోడ్పాటునివ్వాలి.
తీరం వెంబడి సాగిలబడిన
అనురాగాలను మనమెప్పుడైనా
చవిచూడాలి....
ప్రమాదపుటంచు పలకరింపు
మళ్లీ వినాలి
సముద్రపుటంచు జీవితంలోకి
వెళ్లి రావాలి.

46 ఏళ్ళుగా నిరంతరాయంగా ప్రచురింపబడుతున్న

# ప్రజాసాహితి

453

సాహిత్య సాంస్కృతికోద్యమ మాసపత్రిక

జనసాహితి ప్రచురణ

సంపుటి : 46

సంచిక : 5

డిసెంబర్ 2022

website : www.prajaasaahithi.com

## ఈ సంచికలో...


| | | | |
|---|---|---|---|
| ✦ ముఖచిత్రం | : కార్టూన్ – అంతర్జాలం నుండి | | .....01 |
| ✦ రెండవ అట్ట | : సముద్రపుటంచు జీవితంలోకి (కవిత) | – క్రాంతి | .....02 |
| ✦ మూడవ అట్ట | : వెంటాడే అశ్రువొక్కటి (కవిత) – మహెజబీన్; రంగువెలసిన చిత్రం – శీలా సుభద్రాదేవి | | .....35 |
| ✦ నాల్గవ అట్ట | : చిత్రం – అంతర్జాలం నుండి | | .....36 |
| ✦ సంపాదకీయం | : లేని ఉద్యోగాలను పంచే సరికొత్త రిజర్వేషన్లు! | | .....05 |
| ✦ కథ | : అసంపూర్ణం – సచ్చిదానందన్ | తెలుగు : ఎల్.ఆర్. స్వామి | .....07 |
| ✦ వ్యాసాలు | : 75 సం॥ల 'స్వాతంత్ర్యం' అడవులపై ఆదివాసుల హక్కులను సాధించగలిగిందా? | – అరుణ | .....10 |
| | : పర్యావరణ పరిరక్షణ : పిల్లిమెడలో గంట | – ఓ.వీ.వీ.యస్ | .....32 |
| ✦ సినిమా సమీక్ష | : 'దొస్తోజీ (2021)' | – బాలాజీ (కోల్‌కతా) | .....18 |
| ✦ స్పందన | : హిజాబ్, మహిళలు – మతము – మతతత్త్వము | – బి. సూర్యసాగర్ | .....16 |
| ✦ ధారావాహికలు | : వ్యాసం – దేశ విభజన వస్తువుగా సాహిత్యం (4) భాస్వతీ ఘోష్ నవల 'విక్టరీ కాలనీ 1950' | – కొత్తపల్లి రవిబాబు | .....08 |
| ✦ జాతీయ అక్షరయోధులు | : అయ్యప్ప పణికర్ | – సింగంపల్లి అశోక్‌కుమార్ | .....31 |
| ✦ పుస్తక పరిచయం | : 'గోల్డ్‌బరో' – స్టెఫాన్ హైమ్ | పరిచయం – జి.వి. భద్రం | .....21 |
| ✦ వివిధ | : టెమ్‌సులా ఆవ్ మరణం (15); 2022 నోబెల్ సాహిత్య బహుమతి అందుకున్న ఆనీ ఎర్నౌ (20); చైతన్యవాహిని (30); ముప్పై ఏళ్ళ క్రితం 'ప్రజాసాహితి' (09); ఈ పుస్తకాలు అందాయి (34) | | |
| ✦ సంతాపాలు | : నార్ల చంద్రశేఖరరావు, సిహెచ్.ఎల్. కాంతారావు (04); వణుకూరి చెంచారావు (06); పి. శివయ్య (07); ఎం.వి. భద్రం (33); | | |


ప్రధాన సంపాదకుడు : **కొత్తపల్లి రవిబాబు** ఫోన్ : 9490196890 E-mail : ravibabujs@yahoo.co.in

*చందాలు పంపవలసిన చిరునామా :*

**డా॥ బి. అరుణ,** జనసాహితి ప్రధాన కార్యదర్శి

జనసాహితి కార్యాలయం : ప్రజాసాహితి

30–7–6, అనపర్తివారివీధి, అన్నదాన సమాజం రోడ్డు,

దుర్గాఅగ్రహారం, విజయవాడ – 520002.

ఫోన్ : 7075957010 prajasahithi1977@gmail.com

*రచనలు, పుస్తకాలు పంపవలసిన చిరునామా :*

**పి.ఎస్.నాగరాజు,** సంపాదకుడు, ప్రజాసాహితి

ప్లాట్ నెం. 59, రాధాక్రిష్ణ నగర్ కాలనీ

ఆర్మీ క్యాంటీన్ దగ్గర, డగ్లస్ స్కూల్ ఎదురు వీధి,

శ్రీకాకుళం – 532001

ఫోన్ : 78936 97469 prajasahithi1977@gmail.com

ISSN 0971-278X

LCCN 94903393

'ప్రజాసాహితి'

కెనరాబ్యాంకు అకౌంటు వివరాలు

"అకౌంట్ నెం.

**0680101004936**

**IFSC No. CNRB0000680**

**ఫోన్ : 94901 96890**

| | |
|---|---|
| వ్యక్తులకు సం॥ చందా | రు. 300-00 |
| ఐదేళ్లకు చందా | రు. 1300-00 |
| సంస్థలకు సం॥ చందా | రు. 500-00 |

**చందాలు, విరాళాలు**

మనియార్డరు, డి.డి.ల. ద్వారా పంపండి.
చిరునామా స్పష్టంగా తెలియ జేయాలి.
డి.డి.లపై 'ప్రజాసాహితి, విజయవాడ' అని రాయండి

## ప్రజాసాహితి ప్రకటనల ధరలు

1/4 డెమ్మీ పరిమాణం

| | |
|---|---|
| 2వ, 3వ అట్ట మల్టీకలర్ | రు. 20,000 |
| లోపలి పూర్తి పేజి | రు. 15,000 |
| లోపలి అరపేజి | రు. 7,000 |

ప్రజాసాహితి పాఠకులు, అభిమానులు తమతమ ప్రాంతాల నుండి (దేవుళ్ళు, సినిమాలు, వైన్‌షాపులు లాంటివి తప్ప) ప్రకటనలు సేకరించి పంపించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం

## చందాదారులకు విజ్ఞప్తి

1. మీ చిరునామా పైన మీ చందా ప్రారంభమైన నెల, సంవత్సరం - చందా పూర్తయ్యే నెల, సంవత్సరం వివరాలు పోస్టల్ శాఖవారి ఆదేశాల ప్రకారం ముద్రించటంలేదు. ప్రజాసాహితి కార్యాలయం నుండి చందా పూర్తికాకమునుపే మీకు సమాచారం పంపుతాము. వెంటనే చందా పంపిస్తే, పత్రిక ఆగకుండా మీకు చేరుతుంది.
2. ప్రతినెల పత్రిక మొదటివారంలో పోస్టు చేస్తున్నాం. 10వ తేదీ లోపు మీకు పత్రిక రాకపోతే పోస్టుమాన్‌ని వాకబు చేయండి. కార్యాలయానికి ఫోన్‌చేసి తెలియచేయండి.
3. చందా పూర్తయి కొన్ని సంవత్సరాలు దాటినా కొందరికి పత్రిక పంపిస్తున్నాము. ఇకముందు చందా పూర్తికాగానే, ఆపై నెల వచ్చే సంచిక నుండీ ఆపేస్తాము.
4. మీ మిత్రుల చేత, సన్నిహితుల చేత 'ప్రజాసాహితి'కి చందాలు, విరాళాలు సేకరించండి.

– సంపాదకవర్గం

# విద్యావేత్త నార్ల చంద్రశేఖరరావు మరణం




**సమసమాజాన్ని** ఆకాంక్షించిన విద్యావేత్త ఎన్.సి.ఎస్.రావుగా పరిచయమున్న నార్ల చంద్రశేఖరరావు 30 అక్టోబర్ 2022న గుంటూరుజిల్లా రేపల్లె తాలూకా మైనేనివారిపాలెంలో మరణించారు. నాగభూషణం, సీతమ్మ దంపతులకు 27 మార్చి 1933న మైనేనివారిపాలెంలోనే జన్మించారు.

ఆయన ఎం.ఏ. ఆర్థికశాస్త్రం చదివి, ఆ తర్వాత బి.ఇడి. చేశారు. వివిధ విద్యాలయాల్లో ఉపాధ్యాయునిగానూ, ప్రిన్సిపల్‌గానూ, విద్యాలయ పరిపాలనాధికారిగానూ పనిచేశారు. శ్రీశ్రీ షష్టిపూర్తి సభ నాటినుండీ ఆయనకి సాహిత్య ప్రపంచంతో సాన్నిహిత్యం వుంది. గత 45 ఏళ్ళుగా జనసాహితీ సంస్థకూ జనసాహితి నిర్వహిస్తున్న 'ప్రజాసాహితి' పత్రికకూ ఆయన సన్నిహితులు. పత్రికను ఆయన క్రమం తప్పకుండా చదివేవారు. ఇతరులచేతా చదివించేవారు. పత్రికలో వచ్చిన అంశాల గురించి చర్చించేవారు. గతకాలపు ఉద్యమ అనుభవాలను, ప్రస్తుత సాహిత్యోద్యమ కర్తవ్యాల గురించి, ఇతర భాషల్లో వస్తున్న సాహిత్యం గురించీ కలబోసుకునేవారు.

ప్రజాసాహిత్యానికి అండదండగా వుండే చిరకాల మిత్రులు, నిగర్వి, నిరాడంబరుడు ఎన్.సి.రావుగారికి 'ప్రజాసాహితి' సంతాపం తెలియచేస్తుంది. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తుంది.

# సామ్యవాది, ప్రముఖ న్యాయవాది సిహెచ్.ఎల్. కాంతారావు మృతి



**చేకూరి** లక్ష్మీకాంతరావు నరసరావుపేటలో ప్రముఖ పేదల లాయరు. తన 91వ యేట నరసరావుపేటలో 13-11-2022న మరణించారు. ఖమ్మంజిల్లా ఇల్లెందులపాడుకు చెందిన కాంతారావు 1931లో జన్మించారు.

ఆయన విద్యాభ్యాసం మధిర, ఖమ్మం, హైదరాబాదులో జరగ్గా, మదరాసు లా కళాశాలలో చదివి 1962లో నరసరావుపేటలో లాయర్ వృత్తిలో ప్రవేశించారు. హైదరాబాదులో విద్యార్థిగా వున్నపుడు నైజాం పాలనను వ్యతిరేకిస్తూ ఏఐఎస్ఎఫ్ తరపున పనిచేశారు. 'తెలుగువీణ' పత్రిక నడిపారు.

నరసరావుపేటలో ఉమ్మడి కమ్యూనిస్టుపార్టీ నాయకునిగా పనిచేశారు. ఆరు, ఏడు కార్మికసంఘాలకు వ్యవస్థాపక అధ్యక్షులుగా వున్నారు. ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యమంలో పాల్గొన్నారు. 1981-85లలో పురపాలక కౌన్సిలర్‌గా వున్నారు. 1985-90లలో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. భూసంస్కరణ చట్టం వచ్చినపుడు భూస్వాముల కేసులను వాదించటానికి నిరాకరించారు. శేషేంద్రశర్మ 'కామోత్సవ్' నవలపై అశ్లీలతా ప్రతిఘటన వేదిక చేసిన న్యాయ పోరాటానికి అండగా నిలిచి, ఆ కేసులలో వాదించారు. ప్రజాపక్ష న్యాయవాదిగా పేరు గడించారు. వారు ప్రముఖ భాషావేత్త చేకూరి రామారావు సోదరులు. ఇద్దరు సోదరులూ 'ప్రజాసాహితి'కి సన్నిహితులు.

వారి మరణానికి 'ప్రజాసాహితి' సంతాపాన్ని ప్రకటిస్తోంది.

## సంపాదకీయం

# లేని ఉద్యోగాలను పంచే సరికొత్త రిజర్వేషన్లు!
# నిరుద్యోగుల నడుమ ఘర్షణలు పెంచే ఎత్తులు జిత్తులు!!

**"దేశాన్ని** అమావాస్య ఆవహించింది.

అధికారం అవినీతికి దారి తీసింది.

హద్దు పద్దు లేని నిరంకుశాధికారం" – అంటూ వ్యవస్థపై ....... నిప్పులు చెరిగిన ధిక్కార కవి సివి చెప్పినట్లు అంతు పొంతులేని పదవీ వ్యాపారం దేశాన్ని విద్వేషాల, విచ్ఛిన్నాల అగ్నిగుండంగా మార్చేసింది. అబద్ధాలను, మోసాలను అన్నిసార్లూ, అందరూ నమ్ముతారు అనుకోవడం ఒక చారిత్రక అహంకారం.

2019 జనవరిలో అత్యంత వేగంగా జరిగిన పరిణామాల్లో 124వ రాజ్యాంగ సవరణ బిల్లు, జనవరి 12 నాటికి 103వ రాజ్యాంగ సవరణ చట్టమైంది. దీని ప్రకారం ఇప్పటికే రిజర్వేషన్లు ఉన్నవారికి కాకుండా, ఆర్థికంగా వెనుకబడ్డవారికి 10 శాతం రిజర్వేషన్లు ఉన్నత విద్యలోనూ, ప్రభుత్వ ఉద్యోగావకాశాలలోను కల్గించారు. దీనిని సుప్రీంకోర్టు కూడా ఆమోదిస్తూ ఇటీవల నవంబర్ 7న తీర్పునిచ్చింది.

ఇప్పుడు మనకు కొన్ని మౌలిక ప్రశ్నలు తలెత్తుతాయి.

- ★ దేశంలో రిజర్వేషన్లు అనేవి ఉద్యోగ అవకాశాలను పెంచుతాయా? పంచుతాయా?
- ★ నిరుద్యోగానికి మూల కారణమైన వ్యవసాయ పారిశ్రామిక రంగాల సంక్షోభాన్ని పరిష్కరించకుండా రిజర్వేషన్ల వల్ల ఎవరికి ఎంత ప్రయోజనం?
- ★ నిజానికి పెంచాల్సింది ఉద్యోగ అవకాశాలనా? లేక పరిమిత అవకాశాల అపరిమిత పంపిణీనా?
- ★ ప్రభుత్వరంగ సంస్థలలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల బదులుగా ఈ రిజర్వేషన్స్‌తో పర్మినెంట్ ఉద్యోగాలను అందిస్తాయా??
- ★ కులాలవారీగా, మతాలవారీగా నిరుద్యోగ యువతలో పరస్పర విద్వేషాలను పెంచి పోషించడానికి కాకపోతే దీనివల్ల మరో ప్రయోజనం ఏముంది??
- ★ భారత యువత పోరాడాల్సింది ఉద్యోగ అవకాశాల పెంపుదలకోసమా? రిజర్వేషన్ల పేరిట లేని ఉద్యోగాల కోసం తమలో తాము సంఘర్షించుకోవటమా?
- ★ బి.సి. కులాలకూ, మత మైనారిటీలకు వారి వారి జనాభా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి కదా!

దేశంలో ఆర్థిక వెనుకబాటుతనానికి ఈ చట్టం ప్రాతిపదికగా : కుటుంబ వార్షిక ఆదాయం 8 లక్షల లోపు ఉండాలి. అంటే నెలకి 66 వేల 666 రూ. మించకూడదు. దాని అర్థం ఏంటంటే రోజు వారి ఆదాయం 2200 రూపాయలు మించకూడదు. ఈ లెక్కన చూస్తే దేశం జనాభాలో 96% ప్రజలు ఈ రిజర్వేషన్ పరిధిలోకి వస్తారు. అంటే దేశం ఆజాదీకా అమృతం గ్రోలుతున్న సందర్భంగా సాధించిన అభివృద్ధి ఏమిటి అంటే నూటికి 96 మంది ఆర్థికంగా వెనుకబడి వుండటం! నిజం ఇంత చేదు విషంగా ఉన్నదన్నమాట.

దేశంలోని నిరుద్యోగ స్థితిని పరిశీలిస్తే ఈ 2022లో 8.3 శాతానికి పెరిగింది. ఇది 2017లో కంటే రెండు పాయింట్ మూడు శాతం ఎక్కువ. ఇందులో పట్టణ నిరుద్యోగ రేటు పోగా గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పనుల నేపథ్యంలో ఈ నిరుద్యోగ రేటు 8.04% ఉంది. అందులో మన ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగిత రేటు 4.8 శాతంగా ఉన్నట్టు ఓ.ఈ.సి.డి(ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోపరేషన్ అండ్ డెవలప్మెంట్) అనే సంస్థ అంచనాగా విడుదలైంది. రాబోయే నాలుగు సంవత్సరాలలో భారతదేశ నిరుద్యోగ సైన్యంలో మరో కోటిమంది చేరుతారు అని పై సంస్థ అంటుంది. అంటే అప్పటికి మన దేశ నిరుద్యోగ యువత 22 కోట్లమంది అవుతారు. 2018–2022 మధ్య కాలంలో దాదాపు పాతిక వేలమంది నిరుద్యోగ యువత దిక్కుతోచక ఆత్మహత్యల పాలయింది. ఈ బలవంతపు మరణాలన్నీ వ్యవస్థీకృత హత్యలే.

8 ఏళ్ల మోడీ ప్రభుత్వం ఇచ్చిన రెండు కోట్ల ఉద్యోగాల కల్పన హామీ ఎండమావిగానే మిగిలింది. ఇది చాలదు అన్నట్టు ఇప్పుడు ఈ మోడీ ప్రభుత్వమే పది లక్షల ఉద్యోగాలను నింపడం కోసం మిషన్ మోడీ అంటూ మరో 18 నెలలు వాయిదా వేస్తున్నారు. వ్యవసాయ రంగాన్ని, ఉత్పత్తి రంగాలను చాపగా చుట్టేసి అటకెక్కించేసారు. ఉపాధిరహిత అభివృద్ధికి దారులు వేశారు. ఇప్పుడు సమస్యను పక్కదారులు పట్టించే ఎత్తుగడగా యువతలో మరో కొత్త ఎండమావినీ, అంతః సంఘర్షణనూ రేకెత్తిస్తున్నారు.

అసలు ప్రభుత్వరంగ ఉద్యోగాలు ఉన్నట్టా? లేనట్టా? ఉండి లేనట్టా? నేటికీ భారతదేశంలో ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగాల ఖాళీలపై అఖిలభారత రాష్ట్రీయ ఉద్యోగుల సమాఖ్య జరిపిన సర్వేను ఒక్కసారి పరిశీలిద్దాం. కేంద్ర మంత్రిత్వ శాఖలలోనే 9.10 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఐఐటి, త్రిబుల్ ఐటీ, ఐ ఐ ఎం ఎస్, నిట్, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాలు మొదలైన సంస్థల్లో 37 వేల ఉద్యోగాలు ఇవాల్టికీ ఖాళీగా ఉన్నాయి. పాఠశాల విద్యారంగాలలోనూ 8.53 లక్షల పోస్టులు ఖాళీగా పడి ఉన్నాయి. ప్రజారోగ్య వ్యవస్థలో 1 లక్షా 68 వేల పోస్టులు మంచం పట్టాయి. అంగన్వాడి వ్యవస్థలో 1 లక్షా 76 వేల ఖాళీలు అలాగే ఉన్నాయి. పబ్లిక్ బ్యాంకింగ్ వ్యవస్థలో రెండు లక్షల పోస్టులు యువత కోసం ఎదురు చూస్తున్నాయి. అంతేకాదు ఇండియన్ ఆర్మీలో లక్షల ఉద్యోగాలు, సీఏపీఎఫ్ (సెంట్రల్ ఆర్మ్

పోలీస్ ఫోర్స్) శాఖలో 92 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. న్యాయవ్యవస్థలో ఐదు లక్షల 35 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి కనుకనే సుమారు 60 లక్షల కేసులు భారతదేశంలో వాయిదా పద్ధతుల మీద పరిష్కారం కాకుండా చెక్కర్లు కొడుతున్నాయి. ఇది మన నిరుద్యోగ భారతం విశ్వ కురూపం.

ప్రతి ఒక్కరూ తినే నోటితోనే కాదు పనిచేసే రెండు చేతులతో కూడా పుడతారు అంటాడు కారల్‌మార్క్స్. కానీ మన ముప్పాతికేళ్ల స్వతంత్ర భారతంలో పని చేసే హక్కు ప్రాథమిక హక్కు కాకపోయింది. కులాలను, మతాలను, ప్రాంతాలను, జండర్లను వాడుకొని రకరకాలుగా చీలికలు తీసుకొచ్చేలా రాజకీయాలు చేయడం, ప్రజల్ని సంఘటితం కాకుండా జాగ్రత్త పడడం, తద్వారా తమ స్వార్థ సంకుచిత ప్రయోజనాలకు అనుగుణంగా దళారీ పదవీ వ్యాపారాలను రాజకీయాలుగా చలామణి చేయడం ఇక్కడ పెత్తందారీ వర్గాలకు డబ్బుతో పెట్టిన విద్యగా మారిపోయింది. అందులో భాగంగానే చారిత్రకంగా, సామాజికంగా, సాంస్కృతికంగా వేల ఏళ్ళు అణచివేతకు పీడనకు గురైన వెనకబడిన వర్గాల ప్రయోజనాల కోసం, జరిపిన అనేక సాంఘిక పోరాట ఉద్యమాలకు తోడు, ఒక శతాబ్దపు కాలపు దేశ ఆర్థిక రాజకీయ సామాజిక సాంస్కృతిక విముక్తి కోసం శ్రామికవర్గ సంఘర్షణ జరుగుతున్నది. 75 ఏళ్లుగా రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషనులు పొందుతున్నవారి జీవితాలలో వచ్చిన మార్పులు ఏమీ లేవు. నిజానికి రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కొన్ని రిజర్వేషన్లను కేవలం 10 సంవత్సరాల వరకే అనుకుని ప్రవేశపెట్టారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించటం అనే సాకుతో, కులవ్యవస్థను అడ్డుపెట్టుకుని దాన్ని పెంచి పోషిస్తూ ప్రజలను ఐక్యం కాకుండా గొడవలు పెట్టటానికి, ఎన్నికలలో ఓట్లు దండుకోవటానికి ఈనాటికీ కొనసాగిస్తున్నారు.

పీడితవర్గం అభివృద్ధి చెందడానికి రిజర్వేషన్లు ఉపశమనంగా తప్ప ఉపయోగపడటం లేదనేది వాస్తవం. ఒకవేళ ఉపయోగపడినా, దాని పరిమితి దానికుంది. వర్గమూ, కులమూ కలగలసి వున్న మన సమాజంలో కులవ్యవస్థకు పునాదిగా వున్న ఆర్థిక అసమానతలు తొలగకుండా, శ్రమ విముక్తి సాధ్యం కాదనే సామాజిక వాస్తవికతను ఈ రిజర్వేషన్ల పరిస్థితి తెలియచేస్తూంది. ఈరోజు దేశమంతా ప్రైవేటైజేషన్ పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను పరిశ్రమలను సర్వస్వాన్ని కార్పొరేట్ పెట్టుబడిదారీ వర్గాలకు ధారపోస్తున్నారు. ప్రభుత్వరంగ సంస్థలే లేనప్పుడు ఇక రిజర్వేషన్లు ఎక్కడ అమలుచేస్తారు? అనే ప్రశ్నను ప్రజల మెదళ్ళలోకి రానీయకుండా వారిని పక్కదోవ పట్టిస్తున్నారు. కుల ప్రాతిపదికన జనగణన జరగాలని, రిజర్వేషన్లు 50 శాతం గరిష్ఠ పరిమితిని ఎత్తివేయాలని, పేద ప్రజలలో 81.5 శాతంగా వున్న ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలు ఉన్నారని వీరికి కూడా 10% ఇ.డబ్ల్యు.ఎస్ రిజర్వేషన్లు కల్పించకుండా ఎందుకు మినహాయించారనే ప్రశ్నలు, సందేహాలు మనముందు పరచుకుంటున్నాయి.

అన్ని రాష్ట్రాలలోనూ ఒకేలా ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలకు రిజర్వేషన్లు కొనసాగించమన్న 'మండల్ కమీషన్' నివేదిక వచ్చినప్పుడు కూడా ఇలాగే ప్రభుత్వాలు తమ రాజకీయ కుట్రల కోసం విద్యార్థుల మధ్య, ఉద్యోగుల మధ్య గొడవలు పెట్టారు. ఇక ఇప్పుడు ప్రవేశపెట్టిన 10% ఇ.డబ్ల్యు.ఎస్. రిజర్వేషన్లు కేవలం ఎన్నికల కోసమేననీ, ప్రజల మధ్య చీలికలకేనన్నది నిర్వివాదాంశం. 2014 ఎన్నికలలో రాజస్థాన్, గుజరాత్‌లలో గుజ్జర్లకు బిజెపి ప్రభుత్వాలు రిజర్వేషన్లు కల్పించింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత మహారాష్ట్రలో బిజెపి ప్రభుత్వం మరాఠాలకు రిజర్వేషన్లు ప్రకటించింది. మన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇ.డబ్ల్యు.ఎస్. 10% రిజర్వేషన్లలో 5 శాతం కాపులకు కేటాయిస్తున్నట్లు ప్రకటించింది. రేపు రాబోయే ఎన్నికల నాటికి ఇంకెన్ని ఎన్నికల తాయిలాలు తయారవుతాయో ఇలా. దేశం ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక అసమానతలతో సంక్షోభం నుండి సంక్షోభానికి ప్రయాణిస్తోంది.

గిడసబారిపోతున్న సామాజిక వ్యవస్థ 75 ఏళ్ళు గడిచినా రిజర్వేషన్ అనే ఉపశమనానికి అంగలార్చాల్సిన స్థితిలోనే వుంది. దీన్ని పోషిస్తున్న దళారీ పాలకవర్గాల మోసకారితనాన్ని ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. ఈ నిప్పు దావనలంలా వ్యాపించే రోజు దగ్గర్లోనే ఉంది. అప్పుడు ఒక ప్రజాతంత్ర చైతన్య అగ్నిధారలో..... "హమ్ దేఖేంగే"లో ఫైజ్ అహ్మద్ ఫైజ్ చెప్పినట్టు...

క్రూరత్వం, అణచివేతల శిఖరాలు
దూదిపింజల్లా తేలిపోతాయి!!
అణచివేత పాదాల క్రింద
భూమి శబ్దంతో కంపించి!!
నియంతల శిరస్సుల మీద
ఉరుములు బద్దలవుతాయి!!!
సింహాసనాలు తలకిందులు అవుతాయి!!
రాజ్యభవనాలు కూలదోయబడతాయి!!!

29-11-2022

# సాహిత్యాభిలాషి వణుకూరి చెంచారావు మరణం



**సాహిత్య** విమర్శకుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు వణుకూరి చెంచారావు తన 85వ ఏట 18-11-2022న హైదరాబాదులో మరణించారు. ఆయన కృష్ణాజిల్లా ఉయ్యూరులో 15-7-1938న జన్మించారు. ఉయ్యూరులో ప్రాథమిక విద్యాభ్యాసం, గుంటూరు, వరంగల్లులలో ఉన్నత విద్యాభ్యాసం చేశారు. ఖమ్మంజిల్లాలో సైన్స్ టీచర్‌గా 1966 చేరి, కృష్ణాజిల్లా వివిధ పాఠశాలల్లో పనిచేసి, గొడవర్రులో ప్రధానోపాధ్యాయునిగా రిటైరయ్యారు.

ఆయన 'ప్రజాసాహితి' అభిమాని. ఆర్థికంగా తరచు సహకరించేవారు. వారి మరణానికి 'ప్రజాసాహితి' సంతాపం తెలియచేస్తోంది. వారి భార్య కస్తూరి, కుమారుడు శ్రీధర్, కుమార్తె సుధలకు సానుభూతి తెలియచేస్తోంది.
**ఈ సంచిక ప్రచురణకు చెంచారావుగారి కుటుంబసభ్యులు విరాళమిచ్చారు. వారికి ధన్యవాదములు.**

కథ

# అసంపూర్ణం

మలయాళ మూలం : **సచ్చిదానందన్**

తెలుగు సేత : **ఎల్.ఆర్.స్వామి**

**దాబా** మీద కూర్చుని ఒక చిత్రం గీస్తున్నాడు అతడు. కాని, దాబా కానీ దాబా మీదకి చొచ్చుకు వచ్చిన వేప కొమ్మ కానీ, ఆ కొమ్మ మీద వాలిన పిట్ట కానీ, ఆ పైన ఆకాశంలోని రంగులు మారే ఆకారాలు కానీ, అంతెందుకు ఆకాశమే లేదు ఆ చిత్రంలో. ఆ చిత్రం అసంపూర్ణం – అంటే అసంపూర్ణతకి సంపూర్ణత ప్రసాదించే ఒక చిత్రం, అది.

సంపూర్ణతని పూర్తిగా పగులుగొట్టాలంటే తన కాన్వాస్‌ని పూర్తిగా మంట పెట్టవలసిందేగా అనే బాధాకరమైన వాస్తవం గుర్తుకొచ్చింది అతనికి. అలా చేసినా, మూర్తీభవించిన బూడిద మిగులుతుంది కదా. అది ఎగిరి మట్టిలోకి రాలి మొక్కలూ, పూలూ ఎదగడానికి ఎరువుగా మారుతుంది కదా !

ఆ ఆలోచన, అతన్ని పిచ్చివాడ్ని చేసింది, ఆకాశం వైపు తిప్పి వుంచిన ఒక పెద్ద అద్దంలా. శూన్యాన్ని ప్రతిబింబించాలనే కోరిక ఆకాశానికీ వుండేదేమో!. అయినా అప్పుడప్పుడు ఆకులు తుమ్మెదలు పిట్టలు కూడా ఆ వైశాల్యంలో ఎగరటం వల్ల హరివిల్లు రంగులు పలు రసాలు వల్లే అందులో నిండుతున్నాయి.

అలా ఆలోచిస్తూ కూర్చున్నాడు, చిత్రకారుడు. అప్పుడు చిత్రకారుని ప్రియతమ – శాలిని – పట్టుచీర తాలూకు కాగితపు పుటలు కదులుతున్నటువంటి సవ్వడి చేస్తూ మెట్లు ఎక్కి వచ్చింది, దాబా మీదకి. ఆమె వెనుక కొడుకు ప్రశాంత్ కూడా. అస్తమించడానికి తయారవుతున్నాడు, సూర్యుడు అప్పుడు. అస్తమయ రంగులను చీల్చి, బెల్లు మ్రోగిస్తూ ఒక సైకిల్ వెళ్లింది రోడ్డు మీద. దాని మీద ఉన్నదీ తనేనా అనే అనుమానం చిత్రకారునికి కలగకముందే ఒక కప్పు వేడివేడి టీ అందించి, అతను గీస్తున్న చిత్రం వైపు చూసింది శాలిని, ఒక చిరునవ్వుతో.

“నా కొత్త చీర రంగులో ఉందే ఈ చిత్రం. పల్లు మాత్రం అదిగో క్రింద కనబడే నలుపు రంగులో ఉంది. ఆ ఆకుపచ్చని రంగు నా జాకెట్‌దే”

ఆమె అందించిన టీ కప్పు విసరి పారేయాలని తోచింది అతనికి. తన భావుకత్వపు అస్పష్ట రంగులను జ్ఞానహీన ఐన ఆ యువతి – తన ప్రియతమ – ఇలా అవమానించటం ఏమిటీ? కోపాన్ని అణచివేసి ఎగతాళి చేస్తున్నట్లు అన్నాడు అతడు – “ఇవి మన జాతీయ జెండాలోని రంగులు నీకు ఆ మాత్రం తెలియదా?”

సూక్ష్మంగా చూసింది శాలిని – అది నిజమే అని ఆమె ఒప్పుకుంది – “కానీ ఆ పసుపు రంగు ఏమిటి?” ఆమె అడిగింది. మెల్లగా కుంచె తీసి సూర్యకాంతి రంగు గీసాడు చిత్రకారుడు.

దాని క్రింద వున్న నల్లటి గీతలు ఇంకా కనబడటం ప్రశాంత్ దృష్టిలో పడింది, ఆగకుండా నడిచి నడిచి వెళ్ళే అభయార్తుల పాదాలు వలె –

## ప్రజాన్యాయవాది సి. శివయ్య మరణం



**ప్రజాన్యాయవాది,** ప్రజాఉద్యమ పక్షపాతి సి. శివయ్యగారు 11 నవంబర్ 2022న మరణించారు. ఆయన అనంతపురంలో జన్మించారు. విద్యాభ్యాసం పూర్తి అయ్యాక భాగవతుల చారిటబుల్ ట్రస్ట్‌లో కొంతకాలం టీచర్‌గా పనిచేశారు. ఆ తరువాత అనకాపల్లిలో న్యాయవాద వృత్తిని చేపట్టారు.

ఆయన సాహిత్యాభిమాని, ‘ప్రజాసాహితి’ని క్రమంతప్పకుండా చదివి తన అభిప్రాయాలు పంచుకునేవారు. అంతేకాక వస్తున్న సాహిత్యాన్ని, ధోరణులను లోతుగా పరిశీలించి విశ్లేషించేవారు.

అనకాపల్లిలో జనసాహితి ఆధ్వర్యంలో జరిపే అనేక సభలకు వక్తగా వచ్చేవారు. అక్టోబర్ నెలలో తుంపాలలో జరిగిన రావిశాస్త్రి శతజయంతి సభకు ఆరోగ్యం సహకరించకపోయినా వచ్చి రావిశాస్త్రిగారితో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు.

వామపక్ష ఉద్యమాలకు వెన్నుదన్నుగా వుండి సలహాలు సూచనలు అందించారు. ఈ ప్రాంతాలలో క్వారీ కార్మికుల హక్కులకు భంగం కలిగినపుడు, యాజమాన్యాలు వారిని అణిచివేయ బూనుకున్నప్పుడు ఆయన న్యాయపరంగా ఉచిత సేవలు అందించారు.

టిఎన్ మెమోరియల్ ట్రస్ట్ ప్రచురించిన, న్యాయ సిద్ధాంత నిపుణులు ‘జస్టిస్ ఓ.చిన్నపరెడ్డి ఉపన్యాసాలు, వ్యాసాలు’ పుస్తకంలోని చాలా వ్యాసాలను ఆయన ఇంగ్లీషు నుండి తెలుగులోకి అనువాదం చేశారు.

ఆయన మృతికి ‘ప్రజాసాహితి’ సంతాపాన్ని తెలియజేస్తుంది. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూంది.

**ధారావాహిక**

# దేశ విభజన వస్తువుగా సాహిత్యం-4

## భాస్వతీ ఘోష్ నవల 'విక్టరీ కాలనీ 1950'

- కొత్తపల్లి రవిబాబు

**కెనడా** దేశంలోని ఆంటోరియా రాష్ట్రంలో నివసిస్తున్న భాస్వతీ ఘోష్ ఇంగ్లీషులో రాసిన నవల 'విక్టరీ కాలనీ – 1950', కరోనా కాలంలో ఆగస్టు 2020న విడుదల అయింది. భాస్వతి అమ్మమ్మ అమియాసేన్ గుప్తా కథారచయిత్రి. వీరి కుటుంబం తూర్పు బెంగాల్‌లోని బారిసాల్ నుండి దేశ విభజన కాలంలో ఢిల్లీకి 1950లో వలస వచ్చిన కుటుంబాలలో ఒకటి. ఆ కుటుంబాలవారికి లోధీ కాలనీలోని రెండంతస్తుల ఇల్లు నివాసం. నిజానికి ఆ ఇల్లు బ్రహ్మచారులైన బ్రిటీష్ సైనికుల భోజనశాల. 1947 ఆగస్టు 15 తర్వాత అది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాసంగా మారింది.

అమియాసేన్ కుటుంబ బాధ్యతలు చూసుకుంటూనే కుట్టుమిషన్‌పై దుస్తులు కుట్టేవారు. గృహిణిగా ఎడతెగని పనులు చేస్తూ ప్రైవేటుగా మెట్రిక్, ఇంటర్, బి.ఏ., బెంగాలీ సాహిత్యంలో ఎం.ఏ. చదివారు. తన జీవితపు చివరి అంకంలో ప్రభుత్వ ఉద్యోగం చేశారు. వీటన్నిటి మధ్యా కథలు రాశారు. ఆమె పెద్ద కూతురు గీత, విడాకులు తీసుకుని పుట్టింటికి రాగా, భాస్వతి అమ్మమ్మ దగ్గర పెరిగారు. విభజన కాలంలో ప్రజలు – ఎదుర్కొన్న కష్టాలను, అనుభవాలను అమ్మమ్మ చెప్పగా విన్నారు. తూర్పు బెంగాల్ నుండి హిందూ శరణార్థులు పశ్చిమబెంగాల్‌కు వెళ్ళిన ఉదంతాలు ఆమె బెంగాలీలో రాసిన కథల్లో భాస్వతి చదివారు. అమియాసేన్ ఆనాటి శరణార్థుల సహాయం కోసం ఏర్పాటైన సంస్థలలో కార్యకర్తగా కూడా పనిచేశారు. ఆమె వారి గురించి రాసిన కథలన్నీ విషాదాంతాలే.

విభజన సమయంలో పశ్చిమ పంజాబ్‌లో జరిగిన రక్తపాతం, భయభ్రాంత వాతావరణం తూర్పు బెంగాల్‌లో అంతగా లేదు. అత్యధికులు అక్కడి ఆస్తులు వదిలేసి, వట్టి చేతులతో పశ్చిమబెంగాల్‌కు వలస వచ్చారు. అలా వలస వచ్చిన అమల, కార్తీక్ (అక్క, తమ్ముడు)లు కేంద్రంగా ఈ నవల సాగుతుంది. ఈ పిల్లల తల్లిదండ్రులను తూర్పు బెంగాల్‌లో వారుంటున్న ఊరిలో మత అల్లర్లలో హత్యచేస్తారు. వారి పిల్లలైన అమల, కార్తీక్‌లను ఒక ముస్లిం కుటుంబం దాచిపెట్టి రక్షిస్తుంది. ఈ పిల్లలిద్దరూ ఆ తర్వాత ఇతర శరణార్థులతోపాటు కలకత్తాలోని సీల్దా రైల్వేస్టేషన్‌కు చేరతారు. ఆ నగరమంతా అలా పారిపోయి వచ్చినవారితో నిండివుంది. వాళ్ళు తమతో తెచ్చుకున్న గుడ్డల మూట దగ్గర తమ్ముడిని కూర్చోబెట్టి, ఏదైనా తినడానికి దొరుకుతుందేమోనని వెళ్ళిన అమలకు తిరిగి వచ్చేటప్పటికి తమ్ముడు అక్కడ వుండడు. పిల్లలను ఎత్తుకొనిపోయేవారు ఎత్తుకుపోయారు. ఒంటరిగా వున్న అమలను పోలీసుల వేధింపుల నుండి రక్షించి శరణార్థుల శిబిరంలో స్వచ్ఛంద సేవచేస్తున్న యువకుడు మానస్ దత్తా, నగరంలో దక్షిణ ప్రాంతంలో వున్న శరణార్థుల శిబిరంలో చేరుస్తాడు.

గరియాహట్ అనే ప్రాంతంలో వున్న ఈ శిబిరం గురించి ఎంత తక్కువ చెబితే అంత మంచిది. అది ఒక మురికి కూపం. చుట్టూ పేరుకుపోయిన చెత్త. కుళ్ళిన దుర్వాసన ముక్కులు బద్దలు కొడుతుంటుంది. అయిష్టంగానే ఈ శిబిరంలో అమల చేరుతుంది. ఈ శిబిరంలో ప్రభుత్వాధికారులకూ, శరణార్థులకు మధ్య ఘర్షణలు జరుగుతాయి. ప్రజలు ఎక్కువమంది కావటంతో స్థలం ఇరుకైపోయింది. తగిన ఆహార సరఫరా లేదు. త్రాగడానికి మంచినీళ్ళు లేక లభించిన నీళ్ళు త్రాగి వ్యాధిగ్రస్తులైనవారున్నారు. వీరందరిచేత ఉత్పాదిక శ్రమ చేయించాలని అధికారులు వృధా ప్రయత్నాలు చేస్తారు. అకస్మాత్తుగా సొంత ఇళ్ళులేనివారిగా, అస్తిత్వం లేనివారిగా అనాథలుగా మారిన ఒకప్పటి గౌరవనీయమైన కుటుంబాలకు చెందినవారి మానసిక గాయాలు, వారి మానసిక స్థితి ఆ అధికారులు పట్టించుకోరు.

ఈ మతకలహాలలో తన భర్తను పోగొట్టుకున్న ఊర్మిళ అనే యువతి వాలంటీర్ల చేతిలో కత్తెర చూసి స్పృహ కోల్పోతుంది. తన పసిబిడ్డను పెంచుకోడానికి ఇష్టపడదు. శరణార్థులు తమ గతం గుర్తు తెచ్చుకుని, తమ ఆత్మీయుల హత్యలు కళ్ళతో చూచినవాటిని గుర్తు తెచ్చుకొని భావోద్రేకాలతో నిండి వున్నవారి చిత్రీకరణ నవలలో చూస్తాం.

అకస్మాత్తుగా శరణార్థులతో నిండిపోయిన కలకత్తా ఈ నవలలో ఒక పాత్రగా కనిపిస్తుంది. స్థానికులకూ, తూర్పు బెంగాల్ నుంచి కొత్తగా వలస వచ్చినవారి మధ్య ఘర్షణలు జరుగుతుంటాయి. ఈ నవలలోని పాత్రలతోపాటు పాఠకుడు ఉత్తరాన ఉల్టాదంగా నుండి దక్షిణాన ధక్కూరియా వరకు కలకత్తా మహానగరంలో ప్రయాణం చేస్తాడు. 1950లలో బెంగాల్‌లోని వివిధ ప్రాంతాలు, వారి ఆహారపుటలవాట్లు, ఆనాటి ప్రయాణ సౌకర్యాలు ప్రజల వ్యక్తిత్వాలు ఇలా పలు విషయాలు పాఠకుల కళ్ళముందు నిలుస్తాయి.

శరణార్థులు గొప్ప మానసిక ధైర్యంతో అకస్మాత్తుగా తమకు తగిలిన గాయాలతో నిరాశకు లోనుగాకుండా, ఓటమిని అంగీకరించకుండా ఒక ప్రత్యేకమైన కాలనీని నిర్మించుకుంటారు. దానికి విజయ్‌నగర్ అని పేరు పెట్టుకుంటారు. ఇంగ్లీషులో ఈ నవల శీర్షిక 'విక్టరీ కాలనీ 1950'. శరణార్థి శిబిరంలో స్వచ్ఛంద సేవకుడైన మానస్ ఒక ధనిక కుటుంబానికి చెందినవాడు.

మానస్ తల్లి మృణ్మయి. ఆమె కొడుకు భవిష్యత్తు గురించీ గ్రాడ్యుయేషన్ పూర్తిచేయటం గురించీ, ఉద్యోగం చేయడం గురించి ఆందోళన చెందుతూ వుంటుంది. మానస్ ఒక జమిందారు మనవడు.

బోలెడంత ఆర్థిక సంపత్తి వున్నవాడు. మానస్ మిత్రుడు మానిక్ అనే అతను, మానస్‌కు పిల్లలు లేని ఒక వితంతువు చిత్రని పరిచయం చేస్తాడు. కలకత్తాలోని ధకూరియా ప్రాంతంలో విశ్రాంత జీవితం గడుపుతున్న చిత్ర, మానస్‌తో కలిసి మహిళా శరణార్థులకు కుట్టుపని, చదువు నేర్పుతుంటారు. ఆ శిబిరంలోని మహిళలు చేతివృత్తుల ద్వారా కాగితపు సంచులు, బీడీలు తయారుచేసి అమ్మేవారు. ఎంబ్రాయిడరీ, కుట్టుపని చేసేవారు.

మానస్, అమలను ప్రేమిస్తాడు. అమలతో తన ప్రేమ గురించి చిత్రతోనూ, తాతతోనూ మానస్ చెప్తాడు. వీరిద్దరి పెళ్ళి జరిగిందా, మానస్ డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగంలో చేరాడా లాంటి ప్రశ్నలు పాఠకులకు వదిలేశారు. ఊర్మిళ ఈ విషయం గమనిస్తుంది. మృణ్మయికి అమలంటే ఇష్టంలేదు. తూర్పుబెంగాల్ నుండి వచ్చిన జాలర్ల కుటుంబానికి చెందిన శరణార్థి గనుక. అయితే మానస్ తాత హరిప్రసాద్ మానస్‌ను అర్థం చేసుకుంటాడు.

శరణార్థులు పాత గాయాలను తలచుకుంటూనే, నిరాశకు లోనుగాకుండా ఒక స్థితప్రజ్ఞతతో తమకు తామే మానస్, చిత్రలు సమకూర్చిన ఆర్థికంతో కాలనీ నిర్మించుకుంటారు. వారి ఆశావహ దృక్పథం తాము అనుభవించిన దారుణాలు, దారిద్ర్యం, హత్యలు మొదలైనవాటిని వెనక్కి నెట్టివేసింది. సిల్వార్‌లో ఖాళీగా వున్న ఒక జమీందారు స్థలం ఆక్రమించి వారు కాలనీ నిర్మించుకుంటారు. వామపక్షవాదులు వారికి అండగా వుంటారు. దానికే 'విక్టరీ కాలనీ – 1950' అని పేరు పెట్టుకున్నారు.

రచయిత్రి ఈ నవలలో బెంగాలీ పదాలు, జాతీయాలు విరివిగా వాడారు. బెంగాలీ ఆహారపుటలవాట్లు చిత్రించారు. స్థానికులకూ, శరణార్థులకూ మధ్య జరిగిన సంఘర్షణలను ఏ కారణం చేతనో నవలలో చిత్రించలేదు.

మన దేశ విభజన సందర్భంగా జరిగిన ఈ విషాద సన్నివేశాలు చదువుతుంటే, సమకాలికంగా ఈనాడు మన కళ్ళముందు జరుగుతున్నవి గుర్తురాక తప్పదు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా పౌరసత్వ సవరణ చట్టం (CAA) అంటూ ప్రవేశపెట్టి దేశంలో స్థిరపడిన ఒక వర్గం వారి పౌరసత్వాన్ని గుర్తించకుండా వారికోసం ఏర్పరచిన శిబిరాలలోకి పంపించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అలాగే రోహింగ్యాలను కొన్ని దేశాలవారు గుర్తింపని కారణంగా ఆదేశ సరిహద్దులు దాటి బంగ్లాదేశ్‌లోని శిబిరాలలో కాలం గడుపుతున్న వాస్తవం మన కళ్ళముందు వుంది. అలాగే కుర్దులకు, ఇరాన్, సిరియాల మధ్య చెలరేగిన వివాదంలో ఎందరో కుర్దులు సముద్ర ప్రయాణాలలో చనిపోవడం, 3 ఏళ్ళ కుర్దు బాలుడి శవం సముద్రపు ఒడ్డుకు కొట్టుకువచ్చిన ఫోటో ఆలోచనా పరులందర్నీ ఆందోళనకు గురిచేసింది.

దేశ విభజన అంటే ఒక దేశ పటం మీద – మన దేశం గురించి ఏమీ తెలియని రాడ్‌క్లిఫ్ గీసినట్లు ఒక గీత గీయడం వెనుక అక్కడి ప్రజల సమాజం, కుటుంబం, సంస్కృతి, అస్తిత్వం ఆస్తుల నుంచి విడదీయడమన్న వాస్తవం మన రాజకీయ నాయకుల హ్రస్వ దృష్టికి ఏమాత్రం తెలియదు.

**(వచ్చేసంచికలో : దేశ విభజనపై ఖుర్రతులైన్ హైదర్ రచనలు)**

## ముప్పై ఏళ్ళ క్రితం ప్రజాసాహితి

### సంపుటి : 16 సంచిక : 2 డిసెంబరు 1992

**'హిందూ** మతోన్మాదం ముసుగులో అగ్రవర్ణ దోపిడీ పాలకవర్గ శక్తులు తమ చర్యల యొక్క విష స్వభావాన్ని డిసెంబరు 6న నగ్నంగా బయటపెట్టుకున్నాయి. భిన్న సాంస్కృతిక, మత, సాంప్రదాయాలతో జీవించే ప్రజల మధ్య గల శాంతి సామరస్యాలను భగ్నం చేశాయి. 463 సంవత్సరాలనాటి బాబ్రీ మసీదును నేలమట్టం చేసి, మత విద్వేష రాజకీయాలకు మానవ నాగరికతనే యజ్ఞ పశువుగా మార్చేశాయి" – అంటూ బాబ్రీ మసీదు కూల్చివేత, దాని వెనుకనున్న మతోన్మాద రాజకీయాల గురించి చర్చిస్తూ 'పడగ విప్పిన ఫాసిజం!' అనే సంపాదకీయం రాశారు. ఈ సందర్భానికి తగినట్లుగానే "కుత్రపన్ని / పాశవికంగా / హత్యచేసి...." ముఖచిత్రాన్ని ముద్రించారు. రెండవ అట్టమీద వి.రాగి రాసిన 'అస్త్ర చికిత్స' కవిత, మూడవ అట్టమీద ఎం. నిరంజన్ రాసిన "పెకలించండి మతోన్మాదుల పునాదులను" కవితనూ నాలుగవ అట్టమీద కరీంనగర్ జిల్లా బద్దేపల్లి గ్రామంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన కామ్రేడ్ సర్దారన్న మరియు ఇతర ఐదుగురు అమరుల స్మృతిలో ఆర్వీ రాసిన 'మా కోసం మీరు' కవితనూ ప్రచురించారు.

ఖాదర్ మొహియుద్దీన్ రాసిన 'పుట్టుమచ్చ', చిన్ని రాసిన 'రాముడు, రాయి ఏదైతేనేం....", అఫ్సర్ రాసిన 'కొత్త జాతీయ గీతం కావాలి', అప్పన్నగారి గోపాలరావు రాసిన 'గాజు గ్లాసు', అద్దేపల్లి రామ్మోహన్ బూటకపు ఎన్‌కౌంటర్లో చనిపోయిన పాత్రికేయుడు గులాం రసూల్ మొదటి వర్ధంతి సందర్భంగా రాసిన "మరణంలేని అక్షరం", నిఖిలేశ్వర్ రాసిన 'కటాక్షం!' నిశితాసి రాసిన 'రామ్‌కానామ్', కొండేపూడి నిర్మల కవిత 'హృదయానికి బహువచనం' చదివిన తర్వాత కలిగిన స్పందనగా పి.ఎస్. రమ రాసిన 'చెప్పాల్సింది చాలానే వుంది', కవితలనూ, ఎం. సంతోష్ రాసిన 'మతోన్మాదులను తరిమి కొడదాం', ఎం.జి.ఎం. రాసిన 'ఓరి మతోన్మాది' – పాటలను ప్రచురించారు.

దివికుమార్ రాసిన 'దోపిడి వ్యవస్థా, అగ్రవర్ణ సంస్కృతిపై పోరాడండి!', శ్రీకాంత్ రాసిన "మతతత్త్వవాదం – ఒక పరిశీలన", పరజ రాసిన "ప్రజాకవిత్వానికి గీటురాయి సారళ్యతే", బ్రౌన్ వర్ధంతి సందర్భంగా ఛాయరాజ్ రాసిన "చార్లెస్ ఫిలిప్ బ్రౌన్" (1798–1884) వ్యాసాలను ప్రచురించారు. ధారావాహికగా ప్రచురిస్తున్న "సంస్కృతీ : ప్రజాసాహితీ సాంస్కృతికోద్యమం – భూస్వామ్య సంస్కృతీ రూపాలు" వ్యాసాన్నీ, మహమ్మదాలి రాసిన 'తీర్పు', శ్రీకృష్ణ రాసిన 'నూతన ఆర్థిక విధానం' గల్పికలను, రాజ్ శ్రీనివాస్ రాసిన 'కష్టజీవులు' కథనూ ప్రచురించారు. పి. చంద్రశేఖర్ అజాద్ నిర్వహిస్తున్న పిల్లల ప్రపంచం శీర్షికలో 'వాయిస్ ఆఫ్ చిన్ని' వివరించిన 'దేవుడున్నాడా?'ను, అందుకున్న పుస్తకాల శీర్షిక 'స్వీకారం', జనసాహితి కార్యక్రమాల రిపోర్టు 'చైతన్యవాహిని'లను ప్రచురించారు.

1/8 డెమ్మీలో 68 పేజీలు. వెల : రూ. 5/-

వ్యాసం

# 75 సం॥ల 'స్వాతంత్ర్యం' అడవులపై ఆదివాసుల హక్కులను సాధించగలిగిందా?

– అరుణ

**అడవుల** మీద, అటవీ సంపదల మీద గుత్తాధిపత్యం చేస్తూన్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా, మైదాన ప్రాంత వడ్డీ వ్యాపారస్థులకూ, భూ దురాక్రమణదారులకు వ్యతిరేకంగా, శిస్తులు సేకరించే రెవెన్యూ యంత్రాంగపు దోపిడీ పద్ధతులకు వ్యతిరేకంగా, తమ అవినీతి చర్యల ద్వారా కోర్టు కేసులతో పీడించే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆదివాసులు వందల సంవత్సరాలుగా అలుపెరగని పోరాటాన్ని చేస్తూనే వున్నారు. మధ్యయుగాల రాచరిక వ్యవస్థలోనూ పోరాడారు. వలసకాలపు పాలకులతోనూ పోరాడారు. 75 సం॥ల 'స్వాతంత్ర్యపు' ఆజాదీకా అమృత మహోత్సవాల వేళా పోరాడుతూనే వున్నారు. తమ సమష్టి జీవన విధానాంలోకి, సంస్కృతిలోకి జొరబడిన వ్యక్తిగత ఆస్థి పద్ధతులకు, కపటత్వపు మోసకారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగిస్తూనే వున్నారు.

"ప్రపంచమంతా వంచకులమయమే!
యజమానులు దోచుకుంటారు
వడ్డీ వ్యాపారస్థులూ దోచుకుంటారు
అసలాదేవుడే నిలువు దోపిడీ చేస్తాడు!!" ('బషాయి టుడు')

స్వాతంత్ర్యం వచ్చిందని చెప్పబడుతున్న 75 సం॥ల తర్వాత, మన దేశ 15వ రాష్ట్రపతిగా ఎన్నిక చేయబడిన ఆదివాసీ మహిళ ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం చేస్తూ "రాష్ట్రపతి పదవి దక్కడం కేవలం నా వ్యక్తిగత విజయం కాదు. ఇది దేశంలోని ప్రతి నిరుపేద సాధించిన ఘనత. అణగారినవర్గాల పేదలు, దళితులు, గిరిజనులు వారి ప్రతిబింబాన్ని నాలో చూసుకోవటం నాకెంతో తృప్తినిస్తుంది. దేశ స్వాతంత్ర్య సమరయోధుల ఆకాంక్షలను నెరవేర్చటం మన బాధ్యత. అందుకే సబ్ కా ప్రయాస్ (అందరి ప్రయత్నం), సబ్ కా కర్తవ్య (అందరి విధి) అనే రెండు పట్టాల మీద దేశం వేగంగా ముందుకెళ్ళాలి.... సంథాల్ విప్లవం, పెయికా, ఖోల్, భిల్ విప్లవాలు స్వాతంత్ర్య సమరంలో గిరిజనుల పాత్రను పటిష్టంగా చూపిస్తాయి. దేశభక్తి, సామాజిక ఉన్నతుల విషయంలో మన 'ధర్తీ ఆబా' బిర్సాముండా నుండి ప్రేరణ పొందాలి....." అంటూ ప్రసంగించారు.

ద్రౌపది ముర్ము బిర్సాముండాను ఆయన నడిపిన ఉల్‌గులాన్ ఉద్యమాన్ని నెమరువేసుకున్నారు.

"బిర్సా ఉల్ గులాన్ విప్లవాగ్నితో అడవి తల్లిని శుద్ధి చేయాలనుకున్నాడు. అగ్నిజ్వాలలు అనేక దిక్కులకు వ్యాపించాయి. ముండాలు, హొలులు, కోలులు, సంథాలులు, ఉరావ్‌లు.... అనేక తెగలకు చెందిన ఆదివాసీలందరూ అడవుల మీద అధికారం మాదే అన్నారు. ఛోటా నాగపూర్, పలామూ, సింహభూమ్, చక్రధరపూర్ అరణ్యాలలో నివసించే ఆదివాసీలందరూ మా అడవుల మీద అధికారం మాకే కావాలన్నారు" ("ఎవరిదీ అడవి")

వేలమంది ఆదివాసులు అప్పటికి తుపాకుల వంటి ఆధునిక యుద్ధ సామాగ్రి లేనివాళ్ళు, సాంప్రదాయక విల్లంబులు, బరిసెలు, కత్తులు చేతబూని భూమికోసం, భుక్తికోసం – మనిషిగా బ్రతకాలంటే యుద్ధం చేయక తప్పదనే కృత నిశ్చయంతో బిర్సా నాయకత్వంలో యుద్ధరంగాన నిలబడ్డారు. వలస పాలకులు 'భూమికి పట్టాలిస్తాము ఉద్యమాన్ని ఆపమంటే' – 'మాకు కావల్సింది భూమికి పట్టాలు కాదు రాణి పాలన అంతమై మా రాజ్యపాలన ఏర్పడాలి' అని ప్రతిఘటించారు.

ఆ బిర్సా నుండి ప్రేరణ పొందాలని, ఆ స్వాతంత్ర్య సమరయోధుల ఆకాంక్షలను ఇంకా నెరవేర్చవలసి వుందని ద్రౌపది ముర్ము ప్రకటించిన వారం రోజుల్లోనే కేంద్ర ప్రభుత్వం 'నూతన అటవీ నియమాలు – 2022' చట్టసవరణను ప్రకటించింది. ఆదివాసీల అంగీకారం లేకుండా అటవీ భూములను అమ్ముకోవటానికి, ఆదివాసీలను అడవుల నుండి 'సగౌరవంగా' గెంటివేయటానికి కేంద్ర ప్రభుత్వం చట్టసవరణను సిద్ధం చేసింది.

1947 ఆగస్టు 15కు ముందు ఆదివాసులు అడవులపై ఏ హక్కుల కోసం పోరాడారో 75 సం॥ల తర్వాత కూడా అదే పోరాటాన్ని చేయాల్సిన అవసరం మన 'స్వాతంత్ర్యపు' స్వరూపాన్ని బట్టబయలు చేస్తుంది. ఆదివాసీలను అడవుల నుండి గెంటివేయటానికి ఆదివాసీ మహిళా రాష్ట్రపతి ముద్ర పాలకులకు, ఆ అడవులను కాజేయచూస్తున్న కార్పొరేట్లకూ అవసరమయ్యిందన్నమాట.

"అడవుల నుంచీ, కొండల నుంచీ, భూముల నుంచీ, ముండాలు పుట్టి పెరిగిన ముండారీ ప్రపంచం నుంచీ ముండాలు గెంటివేయబడుతున్నారు". ("ఎవరిదీ అడవి")

"గూడెంలోని గోండులు, కొలాములు, పండించిన జొన్నలు, కందులు, నువ్వులు.... ఒకటేమిటి అన్నీ ఈ వంకలు తిరిగిన బండ్లబాట మీదనుంచే గుసగుస నడిచిపోతాయి. అతి తక్కువ ధరకు లేదా ఎప్పుడో ఇచ్చిన అప్పుల కింద షావుకార్లు వీటన్నిటినీ దోచుకుపోతారు. పండించిన గోండులకు, కొలామ్‌లకు లెక్కల తిరకాసు అర్థంకాక విస్తుపోతారు. ఆ సంపదని కొల్లగొట్టిన వాళ్ళు జనగామలో మేడలూ, మిద్దెలు కట్టి కులుకుతున్నారు. పట్టణాలలో వ్యాపారం లాభసాటిగా లేదని వ్యాపారస్థులు నైజాంకు నజరానాలు సమర్పించి గూడేలపై పడ్డారు. గంపల్లో సరుకులు పెట్టుకొని గూడెం గూడెం తిరిగి అమ్మారు.

గుంటూరు పొగాకు తాగి చూడమన్నారు. ఛాయ్ పత్తీ దూరదేశాల నుండి తెచ్చినామన్నారు. దీని తీపి చూడండని మట్టలకు బెల్లం రాసి నాకించారు. ఉప్పు మీ బతుకుల్లో రుచి పచీ తెస్తుందన్నారు ..... ఈ వస్తువులు వెల తెలియని అమాయకులైన ఆదివాసీలు వాళ్ల ముందు తమ పంటలను, వస్తువులను కుప్పలు పోశారు. ఆ విధంగా షావుకారుల మాయల్లో ఇరుక్కుపోయారు. అడవి సంపద అంతా ఉప్పు బెల్లాలకే దొర్లిపోయింది. అప్పుల ఊరులొచ్చాయి.... మహారాష్ట్ర నుంచి వచ్చిన అరబ్బులు, మైదాన ప్రాంతాల నుండి వచ్చిన బ్రాహ్మలు, తురకలు, రావులు.... గోండు కొలాముల భూములు లాక్కున్నారు" – ('కొమురం భీము')

ఫ్యూడల్ రాచరిక ప్రభువులకు అడవుల వలన ఉన్న అవసరాలు, ఉపయోగాలు చాలా పరిమితం. సామ్రాజ్యవాదులైన బ్రిటీషువారికి అవసరాలు, ఉపయోగాలే కాదు సంపదనంతా కొల్లగొట్టుకుపోవాలి. అందుకు వారు అడవుల లోపలి వరకు విస్తరించి అడవులలోని కలప నుండీ ఖనిజాల వరకు, రిజర్వుడు ఫారెస్ట్ పేర్లతో అడవిని అంతా కబళించాలనుకున్నారు. అందుకు అడవుల్లో నివసించే ఆదివాసీలను గెంటివెయ్యాలనుకున్నారు. అడవులను వారి ప్రయోజనాల కోసం నరికేస్తూ ఆదివాసీలకు నిలువ నీడ లేకుండా చేశారు, ఈనాటికీ చేస్తున్నారు. అడవిని నరికి రెండు చేతులా డబ్బు సంపాదిస్తున్నవారే అడవిని ఆదివాసీలు ధ్వంసం చేస్తున్నారంటూ ప్రచారం గావిస్తున్నారు. అంతకుముందు వ్యవస్థలలో లేని సెటిల్మెంట్, రెవెన్యూ విధానాలను బ్రిటిష్ వారు ప్రవేశపెట్టారు. నేటికీ అవే విధానాలు కొద్దికొద్ది మార్పులతో కొనసాగుతున్నాయి.

ప్రపంచంలోనే 70 దేశాల్లో 5000 తెగలకు చెందిన 40 కోట్లకు పైగా ఆదివాసీ జనాభా ఉంది. వారంతా 6,700 భాషలను మాట్లాడుతున్నారు. అందులో చాలా భాషలు అంతరించిపోయాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశంలో 5, 6 షెడ్యూల్లో పేర్కొన్న రాష్ట్రాల్లో ఉన్న 705 తెగలకు చెందిన ఆదివాసీల సంఖ్య 12 కోట్ల మంది. మొత్తం జనాభాలో 8.9 శాతం మంది అన్నమాట. వీరంతా 1,45,000 గ్రామాల్లో నివశిస్తున్నప్పటికీ కేవలం 1,17,064 గ్రామాల సమాచారం మాత్రమే అందుబాటులో ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో 30 తెగల ఆదివాసీలు మరో అయిదు తెగల మైదానవాసులు కలిసి 7.9% అంటే 60 లక్షల మంది ఉన్నారు వీరంతా విభిన్న జీవన విధానం, సంస్కృతులను కలిగి ఉన్నారు.

మన రెండు తెలుగు రాష్ట్రాలలో శ్రీకాకుళం నుండి పడమటికి అదిలాబాద్, నిజామాబాద్ దాకా దట్టమైన అడవులు కొండలు ఉన్నాయి. ఈ అడవులలో సవర, జాతాపు, కోయ, కొండ రెడ్డి, నాయకపు, గోండు, కొలాములు; దక్షిణాన రాయలసీమ జిల్లాల్లో తూర్పు కనుమలైన నల్లమల కొండలలోని అడవుల్లో చెంచు, యానాది, ఎరుకల ఆదివాసీలు కనపడతారు. ఒరిస్సాకు దక్షిణ సరిహద్దు అయిన కోరాపుట్‌లో సవర, బోండ్, గదబ తెగలు నివసిస్తున్నాయి. ఒరిస్సాను బీహార్ నుండి వేరుచేసే ఛోటానాగపూర్ పీఠభూమి అడవుల్లో కోవ్, ఒరవాన్, సంథాల్, ముందు తెగలు ఉన్నాయి. తూర్పు – పశ్చిమబెంగాల్ సరిహద్దులోని చిట్టగాంగ్ కొండల్లో చక్మా గిరిజనులు, గుజరాత్ – రాజస్థాన్ రాష్ట్రాల సరిహద్దు పీఠభూమిలో భిల్లులు, మహారాష్ట్ర దక్షిణ సరిహద్దులలో వర్లీలు, తమిళనాడు – కేరళ సరిహద్దులోని పడమటి కనుమలలో పాలియన్‌లు, తమిళనాడు – కర్ణాటక సరిహద్దుల దగ్గరున్న నీలగిరి కొండలలో తోడతెగ ఆదివాసులు, మహారాష్ట్ర – మధ్యప్రదేశ్ సరిహద్దు అడవులైన సిరోంచ, బస్తర్‌లలో గోండులు, కోయలు నివసిస్తున్నారు.

వీరంతా పోడు వ్యవసాయం, వేట, అటవీ ఉత్పత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. అపారమైన అటవీ వనరులు, ఖనిజాలు, ఔషధాలు, జంతుజాలం, జీవన వైవిధ్యాలు, ఆచార సంస్కృతులు ఆదివాసుల సాంప్రదాయక హక్కు. వాటిని ఆదివాసీలకు నిరాకరించటం, వాటి నుండి దూరం చేయాలనుకోవటంతో ఆదివాసులు పోరాట బాట పట్టారు. అడవుల్లో మలేరియా జ్వరాలు, పిల్లలలో పౌష్టికాహార లోపం, గర్భిణీ స్త్రీలలో రక్తహీనత వంటి అనారోగ్యాలు అవిద్య, అంధవిశ్వాసాలుతో పాటు విస్థాపన, సామాజిక వివక్షలను వారు ఎదుర్కొంటున్నారు.

ఆదివాసీల సంస్కృతి విలక్షణమైనది. వారు ప్రకృతిని కొలుస్తారు. వారి సమాధుల మీద మొక్కలు నాటి అడవిని పెంచుతారు. ఏ పనిచేసినా పొలం దున్నినా, అడవి నరికినా, పెళ్ళైనా, చావైనా అన్నీ సమష్టిగానే చేస్తారు. కలిసి పనిచేస్తారు, కలిసి పంచుకుంటారు. మైదాన ప్రాంత వాసులు అడవిలోకి ప్రవేశించిన తర్వాత అక్కడ సంస్కృతిలోనూ మార్పులు తెచ్చారు. మతభావజాలం, అంధవిశ్వాసాలను వ్యాప్తిచేశారు.

"సుస్థిరమైన పరిపాలకులకు వ్యతిరేకంగా ఆదివాసులు తిరుగుబాట్లు చేయడం అనేది పాలకుల పాలితుల మధ్య జరిగే సంఘర్షణలో అత్యంత విషాదకరమైనదిగా భావించాలి. ఈ సంఘర్షణ ఏ విధంగా జరిగినా అంతిమంగా అది హీనులు శక్తివంతులపై జరిపే పోరాటం గాను, సామాన్యులు ఒక శక్తివంతమైన సంస్థతో చేసే పోరాటం గానూ ఉంటాయి" – హేమన్ డార్ఫ్

అడవి పై తమకు గల హక్కు కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం, భూములను గుంజుకుంటున్న బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సంథాల్, ముండాల్, బస్తర్ ఆదివాసీల, గోండుల, సవర్ణల, మన్యం కోయల తిరుగుబాట్లు జరిగాయి. స్వాతంత్ర్యం సిద్ధించాక కూడా అవే లక్ష్యాలతో తెలంగాణ, నక్సల్బరి, శ్రీకాకుళం, గోదావరిలోయ, కొండమొదలు, ఇంద్రవెల్లి, దుగ్గేరు మొదలైన అనేక ఉద్యమాలు జరిగాయి. బ్రిటీష్ పరిపాలనా కాలం నుండి నేటిదాకా మన దేశం సాధించిన 'అభివృద్ధి' వల్ల అత్యధికంగా నష్టపోయింది ఆదివాసులే, అత్యధికంగా తిరుగుబాట్లు చేసింది కూడా ఆదివాసులే.

"అప్పుల్లో అసలు మొత్తం నాలుగు తరాలు దాకా తీరకుండా అలాగే ఉండిపోయింది. వడ్డీ కూడా పేరుకుపోయింది. జగత్తారణ్ తండ్రి కాలం నుంచీ ఈ కూలీల కుటుంబాల వారు వెట్టి కార్మికులుగా పనిచేస్తూ వేలిముద్రలు వేస్తున్నారు. మొట్టమొదట అప్పు తీసుకున్న వాళ్లు ఇప్పుడు బతికి లేరు, ఎప్పుడో చచ్చిపోయారు. వాళ్ల వారసులు ఇప్పుడు వేలిముద్రలు వేస్తున్నారు. అప్పులో అసలు, వడ్డీ తీరిపోయేదాకా వాళ్ళు అలా కూలి లేకుండా నిర్బంధంలో వెట్టి కార్మికులుగా పనిచేస్తూ ఉండాల్సిందే" ('బషాయి టుడు')

1857 ప్రథమ స్వాతంత్ర్య పోరాటానికి ముందు నుండీ ఆదివాసీలు అడవిపై తమ హక్కులను నిరాకరిస్తున్న వారిని ప్రతిఘటిస్తూనే వున్నారు. 1976 చివరకే 36 ఆదివాసి పోరాటాలు జరిగాయి.

బీహార్లో 1778లో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సహోరియా సర్దార్లు తిరుగుబాటు చేశారు. 1795 నుండి 1800 వరకు చౌరీ చోరా ఉద్యమం జరిగింది. 1811, 17, 20లలో ఆదివాసీ రైతాంగ తిరుగుబాట్లు జరిగాయి. 1932, 33లలో భగీరథ్ నాయకత్వాన ఖైర్వార్ తిరుగుబాటు, 1855 నుండి బిర్సా ముండా నాయకత్వాన సంథాలుల తిరుగుబాటు జరిగింది. ఈ ఉల్ గులాన్ ఉద్యమం 1869, 70లలో ఊపందుకొని అనేక ప్రాంతాలకు విస్తరించింది

"బిర్సా ప్రవాహానికి ఎదురీదుతున్నాడు. ప్రవాహాన్ని మరోవైపుకు మరల్చాలనుకుంటున్నాడు. బయట వాళ్ల ప్రభావంతో వచ్చిన పూజలూ, పునస్కారాలూ, ఆచార వ్యవహారాలూ, పూర్వపు అసుర ధర్మంలోని మంత్ర, తంత్రాలు, రక్తోత్సవాలు అన్నీ ఒక్కసారిగా రూపుమాపాలనుకుంటున్నాడు. లేకపోతే ముండాలు వాటి బరువుతో అణగిపోయి బయటపడలేరు, తలపైకెత్తలేరు. అంచేత సహజమైన ధర్మం, అందమైన ధర్మం, కర్మకాండల ఆడంబరం లేని ధర్మం, మూఢవిశ్వాసాలు లేని ధర్మం అవసరం. అందుకే బిర్సా దేవుడై ధర్మంలోనూ విశ్వాసంలోనూ విప్లవాన్ని తీసుకువెళ్లే ప్రయత్నం ప్రారంభించాడు" – ('ఎవరిదీ అడవి')

మహారాష్ట్రలో 1784, 85, 1818లలో కోలీ ప్రజలు ఆందోళనలూ తిరుగుబాట్లు చేశారు. 1842లో ప్రారంభమైన బస్తరగోండ్ల ఆందోళనలు 1911 నాటికి తిరుగుబాటు రూపం తీసుకున్నాయి. 1842లో బస్తర్ గోండ్లు కెప్టెన్ బ్లంట్ సైన్యాలపై దాడి చేసి ఓడించారు. 1910లో గుండాధర్ అనే కోయదొర భూంకార్ దళాన్ని ఏర్పాటు చేశాడు. 1956, 58లలో మహారాష్ట్రలో వర్లీ తిరుగుబాటు జరిగింది.

అస్సాంలో 1828లో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అస్సామీ ఆదివాసుల తొలి తిరుగుబాటు జరిగింది. సింగఫూ జాతి నాయకుడు 300 మంది ఆదివాసీ యోధులతో నదియా పై దాడి చేశాడు. 1829లో ఖాసీ జాతి వారు తిరుగుబాటు చేశారు. ఆదివాసీ నాయకుడు తీరథ్ సింగ్ బ్రిటీష్ జనరల్స్‌నూ, భారతీయ సిపాయిలనూ ఊచకోత కోశాడు. 1831, 32లలో మహత్తర కోల్ విప్లవం జరిగింది.

"1831లో కోల్ జనం తిరుగుబాటు చేసిన తర్వాత ఆ ప్రాంతంలో మళ్లీ కాలు మోపిన హిందూ వర్తకులు ఉత్తమ్‌చంద్ తాత ముత్తాతలే. వాళ్లలో ఒకడు క్రమంగా ఆదివాసుల సారవంతమైన భూములు అన్నీ కొనేశాడు. ఇప్పటిలాగే ఆ రోజులలో కూడా ఆదివాసులను వెళ్ళగొట్టడం చాలా తేలిక. లెక్కలూ, అకౌంట్లు, పట్టాలు, దస్తావేజులు, చట్టాలు మొదలైన వాటి పట్ల ఆదివాసులు ఇప్పుడు ఎంత జాగ్రత్తగా ఉన్నారో అప్పుడు అంతే జాగ్రత్తగా ఉన్నారు. అందువల్ల గతంలో తమ ఆధీనంలో ఏమి ఉన్నదో లేనిదో ఝుంఝుర్ ఆదివాసులకు తెలియదు. తమ కాయకష్టంతో పండించిన పంటను తమ ఇళ్లకు తెచ్చుకోవడం ఏనాటి సంగతో, అది కూడా వాళ్లకు తెలియదు. (– 'రుదాలి' కథ సంకలనంలోని 'ఉప్పు' కథ)

1834–41ల మధ్య బ్రిటీష్ పౌరులపై లూషియాలు (మిజోలు) నేఫాలోని దఫ్లాలు దాడి చేశారు. బ్రిటీష్ వ్యతిరేక కార్యక్రమాలు చేస్తున్నారని జైంటియా పర్వతాల రాజును సింహాసనం నుండి తొలగించారు. 1839–43ల మధ్య జరిగిన కాంప్టీ తిరుగుబాటులో బ్రిటిష్ సైనికులపై దాడిచేసి వారిని చంపారు. 1843 సింగ్‌ఫూ నాయకుడు నిరాంగ్ ఫిదూ నాయకత్వాన బ్రిటీష్ కోటపై దాడి చేసి సైనికులను చంపేశారు. 1844లో మణిపూర్ గ్రామాలపై సైనికులు దాడి చేశారు, 20 మందిని ఊచకోత కోశారు. 1849లో బ్రిటీష్‌వారి గ్రామాలపై కద్మా సింగ్‌ఫూ నాయకత్వంలో దాడి చేశారు. 1854లో ఉత్తర కచ్చారీ పర్వతప్రాంత నాయకుడు బ్రిటీష్ వారికి లొంగిపోయి, తన గ్రామాలను విలీనం చేశాడు. 1857లో మజీరామ్ దివాన్, సారింగ్ రాజాలు తిరుగుబాటు చేశారు, అరెస్టయ్యారు. 1860లో బ్రిటీష్ త్రిపురపై లుషాయి నాయకుడు దాడిచేసి 186 మంది సైనికులను చంపాడు. 1860–62లలో జైంటియా పర్వతప్రాంతాల్లో సింటెంగుల తిరుగుబాటు, 1861లో ఆదివాసీ రైతాంగం పులాగురి జాతుల తిరుగుబాటు, 1879లో నాగాజాతివారు, మిజోజాతివారు, 1932లో నాగా క్రిస్టియనేతరులు తిరుగుబాట్లు చేశారు.

"అయితే దొరలు జయించలేదు ఎప్పుడు, అన్ని పోరాటాలలో సర్దార్లు, కోలులు, ఖారువాలు, సంథాలులే జయించారు. జయించినట్లే, ఎంచేతనంటే జయించిన వాడి పేరు రికార్డ్ అయి ఉంటుందని ప్రతి పరాజయమూ రుజువు చేసింది. పరాజితుని పేరు మనిషి రక్తంలో వెట్టిచాకిరిలో, కరువులో, ఆకలిలో, పీడనలో ధాన్యపు మొక్క లాగా నాటబడి ఉంటుంది. ఆ పేరు నల్లవాడి ప్రతి పాటలో, స్మృతిలో ముడిగింజల చప్పుదనంలో, నగ్నంగా ఉన్న ముండా జాతి శిశువు యొక్క పాలిపోయిన చర్మంలో, ఉబ్బిపోయిన ముండా తల్లి గర్భంలో షావుకారుకు చెందిన ధాన్యపు బస్తాను ఒకసారి మోసిన కాయ కష్టంలో" – ('ఎవరిదీ అడవి')

ఛోటా నాగపూర్‌లో 1789లో తమర్ తిరుగుబాటు జరిగింది. 1794–95లలో 1807–1808 సంవత్సరాలలో దికూ షావుకార్ల దోపిడీకి, పెత్తనానికి వ్యతిరేకంగా తమర్ పోరాటాలు సాగాయి.

ఒరిస్సాలో 1850లలో కోంథ్ జాతి నాయకుడు చక్రాభిసోయి నాయకత్వంలోనూ, 1861 లో జయాంగ్ తిరుగుబాటు, 1842లో కోరాపుట్‌లో లక్ష్మణ నాయక్ నాయకత్వంలోనూ తిరుగుబాట్లు జరిగాయి.

గుజరాత్‌లో 1809–28ల మధ్య భిల్లు జాతి వారి తిరుగుబాట్లు జరిగాయి. 1833లో నాయక్‌లు, 1846లో కువార్ జీవో నాయకత్వంలో భిల్లులు, 1858లో నాయక్ దాస్ నాయకత్వంలోనూ 1857–58లలో భాగోజినాయక్, కజార్‌సింగ్ నాయకత్వాన భిల్లులు, 1868లో జోరియా నాయకత్వాన్న నాయక్‌లు తిరుగుబాట్లు చేశారు.

మద్రాస్ ప్రావెన్సీలో 1803లో తూర్పుగోదావరి ఏజెన్సీ రంప ప్రాంతంలో కోయలు తిరుగుబాటు చేశారు. అలాగే 1862లలోనూ గిరిజన జమీందారులైన ముత్తేదారులకు, వారి బ్రిటిష్ మిత్రులకు వ్యతిరేకంగా ఏజెన్సీలో కోయలు తిరుగుబాటు చేశారు. 1922లో అల్లూరి సీతారామరాజు నాయకత్వాన కోయలు జరిపిన రంప తిరుగుబాటు బ్రిటీష్ సామ్రాజ్యవాదులను గడగడ లాడించింది. 1939లో నైజాం చక్రవర్తి ఆదిలాబాద్ జిల్లాలో గోండులు, కొలామ్‌లు సాగుచేసుకుంటున్న పొలాలను గిరిజనేతరులకు వేలం వేసి గిరిజనులను పోడు భూముల నుండి గెంటివేయచూస్తే కొమురం భీము నాయకత్వాన పోరాటం చేశారు. (– తిరుగుబాట్లు, పోరాటాలకు సంబంధించిన వివరాలు వెన్నెల కంటి రాఘవయ్య రాసిన 'ట్రైబల్ రివోల్ట్స్' నుండి)

"అడవులు నరికి భూములు సాగు చేసుకోకూడదు. ఇంటి చుట్టూ ఉన్న ఖాళీ స్థలంలో కూరగాయలు పండించుకోవాలి. మామిడిచెట్లకు, పనస చెట్లకు, మంచెలు కట్టుకొని పళ్ళు, మొక్కలు అమ్ముకోవాలి. షావుకారి పిలిచినప్పుడు వెళ్లి వెట్టిచాకిరి చేసి రావాలి. బాణాలు, బల్లేలు, బరిసెలు, గొడ్డళ్లు, గండ్ర గొడ్డళ్ళు అవతల పారేయాలి. చట్టబద్ధంగా హక్కుల కోసం పోరాడాలి – ఇదీ శాంతి మార్గం. దిక్కూ (గిరిజనేతరులు) దొరలలో, మిషన్ దొరలలో చాలామంది ముండాలపట్ల సానుభూతి ఉన్నట్లు నటిస్తుంటారు. రాంచీలోనూ చైబాసాలోనూ చాలామంది బాబులు ముండాల కష్టాలు చూసి మొసలి కన్నీళ్లు కారుస్తుంటారు. ముండాల కష్టాలు పోగొట్టడానికి మార్గం ఆలోచిస్తున్నామంటారు. టేబుల్‌కి ఎదురుగా కుర్చీలో కూర్చొని టీ, కాఫీలు త్రాగుతూ ముండాలు అనుభవిస్తున్న కష్టాలు చూసి తమ విచారాన్ని వెలిబుచుతూ ఉంటారు. శాంతి మార్గాన బోతే వాళ్ళు ఎంతో సంతోషిస్తారు..... ఎందుకో ఆలోచించండి" ('ఎవరిదీ అడవి')

అంటూ బిర్సాముండా ఆదివాసీలను పోరాట మార్గాన్ని ఎంచుకోమన్నాడు.

మధ్యయుగాలలోను, రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఆదివాసీల ప్రతిఘటన పోరాటాలు జరిగాయి. మనమంతా ఇప్పుడు చూస్తున్న మేడారంలో జరిగే సమ్మక్క, సారక్క జాతర అలనాటి ఆదివాసీల పోరాట గాథే. క్రీస్తుశకం 13వ శతాబ్దంలో వరంగల్‌ని రాజధానిగా చేసుకొని పరిపాలించిన ప్రతాపరుద్రుడు కరువు వచ్చి కప్పం చెల్లించనందుకు మేడారం రాజ్యంపై దాడి చేశాడు. మేడారం కోయరాజు పగడిద్దరాజు, సేనాని జంపన్నలు ఆ దాడిని వీరోచితంగా ప్రతిఘటించారు. ఆ ప్రతిఘటనా దాడిలో పాల్గొన్న సమ్మక్క సారక్కలు అమరులయ్యారు. పోరాట తెగువ చూపిన ఆదివాసీ మహిళలను దేవతలను చేసి దైవత్వాన్ని ఆపాదించి పురాణ గాథగా మార్చారు. ఆదివాసీ దేవతలను హిందూ పురాణాలలోకి ప్రవేశింపచేశారు. అయితే వారు దేవతలతో సమానంగా కాదు, ఆ దేవతలకు సేవకులు గాను (గుహుడు) భక్తులుగా వాళ్ళ కరుణాకటాక్షాల చేత పునీతులైన పాపులు గాను (శబరి, వాల్మీకి, ఏకలవ్యుడు) హిందూ దేవుళ్లకు రెండవ భార్యలుగాను (హిడింబి, చెంచులక్ష్మి) అధమ స్థాయిలో కనపడతారు. ఆదివాసీలూ తమ సంస్కృతిలోకి వచ్చిన ఈ పురాణ గాథలను విశ్వసిస్తున్నారు.

"మన పూర్వీకులు ఇట్లా ఎన్నడూ బతకలేదు అంటూ వంశ చరిత్రను తెలిపే పాటను ఎత్తుకున్నాడు. ఆ పాటలో పాండవరాజు భీముడు తన అన్నదమ్ములతో కలిసి అడవిలోకి వచ్చాడు. హిడింబి అనే స్త్రీని భీముడు పెళ్లి చేసుకున్నాడు. వాళ్ళిద్దరూ అడవిని నరికారు. పంటలు పెట్టారు. పాటలు పాడారు. వాళ్లకు సంతానం కలిగింది. మొదటి సంతానం ఘటోత్కచుడు. ఆ తర్వాత మళ్లీ కొడుకు పుట్టాడు. భీముడు ఆ సంతానాన్ని హిడింబిని అడవిలో విడిచిపోయాడు. ఘటోత్కచుడు అడవిలో ఉన్న అనేకమంది రాజులతో యుద్ధం చేశాడు. రాజ్యం ఏర్పరిచాడు. అలాంటి రాజు ఘటోత్కచుడు సంతానమే గోండ్లు, అతని తమ్ముని సంతానమే కొలామ్‌లు. వాళ్ళు అడవికి రాజులు. వాళ్ళ రాజ్యంలో ఆకలితో మాడి చచ్చేవాళ్ళు ఉండరు. అందరూ కలిసి అఖాడి చేసి అడవిని నరికి వ్యవసాయం చేసేవాళ్లు. వచ్చిన పంట అంతా పంచుకునేవాళ్ళు" ('కొమురం భీము')

పెట్టుబడి ప్రవేశంతో ఆదివాసీలపై దోపిడీపీడనలు పెరిగాయి. దేశపు సకల సంపదలతో పాటు అటవీ సంపదలను బ్రిటీష్ సామ్రాజ్యవాదులు దోచుకున్నారు. పర్యావరణాన్ని ధ్వంసం చేశారు. అందుకు అడవుల్లో నివసించే ఆదివాసీలకు అడవిని నరికే హక్కు లేదంటూ, వ్యవసాయం చేసే హక్కు లేదంటూ, ఆ భూమి మీద హక్కు మాదే, పండిన పంట మాదే నంటూ రెవెన్యూ అధికారుల సహాయంతో ఆదివాసీలను దోచుకున్నారు. అడవిలో సంచరించే ఆదివాసీలను దొంగలుగా చిత్రిస్తూ అరెస్టులు చేసి జైళ్ళల్లో బంధించారు. దొంగతనం చేయమూ అన్న ఆదివాసీలపై తప్పుడు కేసులు పెట్టి చివరకి దొంగలుగా మిగిల్చారు.

"ఏం చెప్పను బాబయ్యా! ఆయాల జనం అయ్యను కొట్టి పేనాలు తోడారు. మా అయ్యతో కలుపుకొని ఆ ఏడాది ముగ్గురు మావోళ్ళు సచ్చిపోనారండి! దానిమీద మాపు పంచాయతీ జరుపుకున్నాం. పంచాయితీలో.... ఒళ్ళొంచి పని చేసుకోవాలి కానీ, ఇంక దొంగతనాలు కూడదుగాక కూడదనుకున్నాం. అందుకే బావూ! నాను దొంగతనం మానేశాను. మా వోళ్ళనీ సెయ్యనీయను....ఆ!" (– విత్తనాలు కథా సంకలనంలోని 'దొంగతనం' కథ)

"బిడ్డా! నీ పేరు రికార్డుల్లో ఎక్కిందిరా, నీవిప్పుడు అసలైన సవర వయ్యావు (– 'మకర సవర' కథ)

ఎక్కడ ఆనకట్టలు కట్టినా మునిగిపోయేది ఆదివాసీల గ్రామాలే. అడవులు పెంపకానికి, బొగ్గు, లోహ నిక్షేపాలు వెలికితీతకి, పులుల్ని రక్షించడానికి అభయారణ్యాల కోసం ఆదివాసీలే అడవిని ఖాళీ చేయాలి. ఆ ప్రాంతాల్లో బయటకు వచ్చిన ఆదివాసులు తమ సంప్రదాయ సిద్ధమైన నివాసాల నుంచీ, ఆహార సంపాదన నుంచీ తొలగించబడతారు. భూసేకరణ వివరాలేవీ తెలియదు కనుక ధన రూపేణా ఎంత నష్టపరిహారం ఇస్తే అంత తీసుకొని ప్రవాసులవుతారు. వచ్చిన పైకంతో పారిశ్రామిక ప్రాంతాల్లోని ఆకర్షణలకు ఖర్చు పెట్టేయటంతో అటు భూమి ఇటు డబ్బూ లేని వారిగా మిగిలిపోయారు. వారు భూమిలేని కూలీల వర్గంలో చేరిపోయారు. ఎటువంటి శిక్షణా, ఎటువంటి నైపుణ్యం లేక, ఏ ఉద్యోగమూ చేయలేనివారిగా మిగిలారు.

ఇక అడవుల సంహరించటం, బాక్సైట్ యురేనియం వంటి గనుల తవ్వకాల కోసం అనుమతులు ఇవ్వటంతో ఆదివాసీ ప్రాంత ప్రజలంతా అనారోగ్యాలకు, అంతుచిక్కని వ్యాధులకు గురవుతున్నారు. పర్యావరణం అంతా విషపూరితమవుతున్నా బడా స్వాముల సేవలో పాలకులు తలమునకలై ఉన్నారు.

ఆదివాసీల విస్తాపన సమస్య గురించీ, నేరస్థులుగా ముద్ర వేసి జైళ్ళల్లో బంధించబడిన ఆదివాసీల తరపున మాట్లాడినందుకే స్టాన్ స్వామిని ఉపా చట్టం కింద అరెస్టు చేసి జైల్లోనే చంపేశారు ఈనాటి పాలకులు.

వలస పాలన కాలంలో 1889 సం॥లో బొగ్గు గనులు తవ్వకాన్ని ప్రారంభించారు. అడవుల్లోకి రోడ్లూ వచ్చాయి. ఇనుము, బొగ్గు, సున్నపురాయి తదితర ఖనిజ సంపద కోసం పెట్టుబడి ప్రవేశించింది. వాటితోపాటే, పెట్టుబడుల సంరక్షణ కోసం నిర్బంధ చట్టాలూ అడవిలోకి

వచ్చాయి. బ్రిటీష్‌వారు ప్రవేశపెట్టిన విధానాలన్నింటిని స్వదేశీ రాజులు సంస్థానాల్లోనూ ప్రవేశపెట్టారు.

1793లో బ్రిటీష్ సామ్రాజ్యవాదులు శాశ్వత సెటిల్మెంట్ పేరుతో బెంగాల్లో భూమిశిస్తు అధికారాలలో, పద్ధతుల్లో మౌలికమైన మార్పులు తెచ్చారు. జాగీరుదారులు, దేశ్‌ముఖ్‌లు, పటేల్, పట్వారిలు అటవీ ప్రాంతంలో దోపిడీకి సిద్ధమయ్యారు. 1865లో అడవి రక్షణ చట్టాన్ని ఆనాటి పాలకులు తీసుకువచ్చారు. అడవిని రక్షించడం పేరుతో ఫారెస్ట్ అధికారులు అడవిలోకి వచ్చారు. దీనితో భూస్వాములకు, రాజులకు, సామ్రాజ్యవాదులకు మధ్య ఐక్యతకు బలమైన పునాది ఏర్పడింది. 1917లో గిరిజన సంక్షేమ చట్టాన్ని తీసుకువచ్చారు. దీనినే ఏజెన్సీ ప్రాంత వడ్డీ మరియు భూమి బదలాయింపు చట్టం అంటారు. గిరిజనేతర్లు జిల్లా అధికారుల అనుమతి లేకుండా భూమి కొనకూడదు. షావుకారు వడ్డీ 12 శాతం మించకూడదు అని ఈ చట్టంలో పొందుపరిచారు. 1946లో ఆదివాసీ ప్రాంతాలను షెడ్యూల్డ్ ప్రాంతాలుగా ప్రకటించారు. దీనితో ప్రభుత్వం ఎవరినైతే ఆదివాసీలుగా గుర్తిస్తుందో వారికి మాత్రమే ఈ చట్టపరిధిలో రక్షణలు ఉంటాయని ప్రకటించింది. 1959లో షెడ్యూల్డ్ ప్రాంతాల భూమి బదలాయింపు నియంత్రణ చట్టాన్ని ప్రభుత్వం జారీ చేసింది. శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాటం తర్వాత 1970లో 1/70 చట్టాన్ని తీసుకువచ్చారు. ఈ చట్టంలో షెడ్యూలు ప్రాంతాలలోని ఆదివాసుల భూమిలే కాదు, ఆదివాసీయేతర భూములను కూడా కొనకూడదని, అమ్మకూడదని నియమావళిలో వున్నది. ఆదివాసీల, ఆదివాసీయేతరుల భూముల అమ్మకం లావాదేవీలను నిషేధించారు. ఇది ఆదివాసీలకు ఎంతో ఉపయోగకరమైన, ముఖ్యమైన చట్టం. కానీ ఇప్పటికీ ఈ చట్టం అమలు కోసం ఆదివాసీలు పోరాడుతూనే ఉన్నారు.

1980లలో పర్యావరణ పరిరక్షణ చట్టాన్ని తీసుకువచ్చారు. ఈ చట్టం 40 మిలియన్ల భారతీయ ఆదివాసుల భవిష్యత్తును ధ్వంసం చేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఈ చట్టం ప్రకారం ఆదివాసీలు తాము ఆదివాసీలమేనని నిరూపించుకోవాలి. అలా నిరూపించుకోలేకపోతే వారి అడవులలో నివసించటానికి అనర్హులవుతారు. అనాదిగా అడవులను సంరక్షిస్తూ కొండపోడు చేసుకుంటూ జీవనం సాగించే ఆదివాసీలను ఈ చట్టం నేరస్థులుగా చూసింది. 1988లో జాతీయ అటవీ విధానం వచ్చింది.

1992 నాటి పంచాయతీరాజ్ చట్టానికి 73వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆదివాసీలకు, మైదాన ప్రాంతాల ప్రజలకు ఒకే రీతిన ఈ చట్టాన్ని అమలుపర్చారు. ప్రజాస్వామ్యాన్ని సామాన్య పౌరుని దగ్గరకు తీసుకువెళ్లేందుకు పంచాయతీరాజ్ విధానాన్ని ప్రవేశపెట్టడంతో రాజకీయ రంగంలో ఆదివాసీల ప్రయోజనాలు సంరక్షింపబడాలి. కానీ ఆచరణలో అది శూన్యంగా మిగిలింది. ఈ చట్టానికి సంబంధించి 1993లో ఒక తీర్మానాన్ని, 1994లో ఓ ముసాయిదాని పాలకులు వెలువరించారు. 1996లో పెసా చట్టాన్ని తీసుకువచ్చారు. ఇది పంచాయితీరాజ్ షెడ్యూల్డు ప్రాంతాల విస్తరణాధికార చట్టం. ఈ చట్టం వచ్చి 2021 డిసెంబర్ 24 నాటికి 25 ఏళ్లు నిండినప్పటికీ ఇంకా అమలు పర్చబడలేదు. 2006లో వచ్చిన అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆదివాసీలుగా నిర్ధారించబడనివారందరినీ నేరస్తులుగా చిత్రిస్తూ అడవుల నుండి తొలగిస్తామన్నారు. 2019లో సుప్రీంకోర్టు ద్వారా ఆదేశం కూడా తెచ్చారు. భూసేకరణ, పునరావాసం, నష్టపరిహార చట్టం – 2013 ప్రకారం ఆదివాసులకు ఇతర పారంపర్య అటవీ నివాసుల గ్రామసభలకు చట్టబద్ధ అధికారాలు లభించాయి. 2017లో సంతాల్ పరగణా, ఛోటా నాగపూర్ కౌలుదారీ చట్టాన్ని సవరించారు.

పెద్ద పెద్ద ప్రాజెక్టులు, వన్యప్రాణ పరిరక్షణ చట్టాలు, అభయారణ్యాలు, జాతీయ పార్కులు మొదలైన వాటన్నిటి పేరుతో ఆదివాసీలను అడవుల నుండి గెంటి వేయటానికి సామ్రాజ్యవాదులు అడుగుజాడల్లో, వాళ్ళ ఆదేశాలతో 'దేశభక్త' స్వదేశీ పాలకులు 'నూతన అటవీ నియమాలు – 2022" చట్టసవరణను ఇప్పుడు ప్రకటించారు. 2019-21 సంవత్సరాలు మధ్య కాలంలోనే గనులు, భారీ ప్రాజెక్టులు తదితర అటవీయేతరమైన సంస్థలకు 5543 చ.కి.మీ 55,300 హెక్టార్ల అడవిని కట్టబెట్టారు. ఇది చాలు వారి భవిష్యత్ ఏమిటో అర్థంకావటానికి.

నూతన అటవీ నియమాలు – 2022 చట్ట సవరణతో – అడవిని ఇతర అవసరాలకు కేటాయించాలంటే గ్రామసభ ఆమోదం పొందాలన్న నామమాత్రపు షరతులను తొలగించబోతున్నారు, పర్యావరణ ఉల్లంఘనలను తీవ్ర నేరాలుగా కాకుండా సాధారణ తప్పిదాలుగా ఎంచి జరిమానాలతో సరిపెట్టాలని సవరణలో చేర్చారు. దీనితో దోపిడీ శక్తులు మరింత విచ్చలవిడిగా అడవులను కబ్జా చేసే అవకాశాన్ని కల్పించినట్లే కదా. ప్రమాదకర విష రసాయనాలు వెలువరించిన యూనియన్ కార్బైడ్ మొదలుకొని ఎల్జీ పాలిమర్స్ వరకు జరిగిన సంఘటనలేవి ఇక క్రిమినల్ నేరాలుగా పరిగణించబడవు. మృతుల కుటుంబాలకు, బాధితులకు తమకు తోచిన పరిహారం చెల్లిస్తారు. ఆయా కంపెనీలలో యాజమాన్యాలకు కొంత జరిమానా విధించి చేతులు దులుపేసుకోవచ్చు. చేసిన తప్పులన్నీ పరిహారాలతో సరి.

ఈ చట్ట సవరణనే ఆజాదీకా అమృత మహోత్సవాల వేళ ఆదివాసీ మహిళను రాష్ట్రపతిగా ఎన్నిక చేసి మరీ మన పాలకులు పార్లమెంట్లో ప్రవేశపెట్టారు. బహుశా రైతాంగ చట్టాలను, పౌరసత్వ చట్టాలను ప్రజలతో సంబంధం లేకుండా పాలకులు వాళ్లకు వాళ్లగానే ఆమోదించుకున్నట్లే 2023 బడ్జెట్ సమావేశాలలో దీనిని కూడా ఆమోదిస్తారేమో!

ఆదివాసీలపై దాడులు కొత్తవేమీ కాదు, వారి ప్రతిఘటన అనాది నుండి ఉన్నదే. అడవిని అటవీ సంపదను దోచుకోవటానికి ప్రయత్నం చేస్తున్న కార్పొరేట్లకు, వాళ్లకు మడుగులొత్తుతున్న పాలకులకు వ్యతిరేకంగా ఆది నుండి ఆదివాసీలు పోరాటాలు చేస్తూనే ఉన్నారు. పోరాడుతున్న ఆదివాసీలను, సమాజాన్ని మభ్యపర్చటానికి రకరకాల చట్టాలు, గిరిజన సంక్షేమ పథకాలు, గిరిజన కార్పొరేషన్‌లు తెస్తున్నా వాటిని అమలు పరచుకోవటానికి కూడా పోరాడవలసి వస్తుంది. బిర్లా, టాటా, పోస్కో, రిలయన్స్, వేదాంత మొదలైన కంపెనీలకు పాలకులు భూములను అప్పగించబోయినపుడు, అందుకు అనుగుణంగా చట్ట సవరణలు చేసినప్పుడు వీరోచితంగా వాటిని త్రిప్పికొట్టిన చరిత్ర ఆదివాసీలకుంది.

"అసలు ఆదివాసులు ఓడిపోలేదు. ఎందుకంటే మైదాన ప్రాంత ప్రభుత్వాలు.... బ్రిటిష్ ఇండియా ప్రభుత్వంతో సహా దాడిచేసి వెనుతిరిగిపోయాయి, దోచుకొని పోయాయి. కానీ వాళ్లను తమ

ఏలుబడిలోకి తెచ్చుకోలేదు. 1947 తర్వాత ఇండియన్ యూనియన్ ఏర్పడి రాజ్యాంగ రచన జరిగేంతవరకు ఇదే భారతదేశ చరిత్ర. రాజ్యాంగ రచన తర్వాతనే, ఇండియన్ యూనియన్ ఏర్పడిన తర్వాతనే దేశంలోని ఆదివాసీ ప్రాంతాలు కూడా తమ స్వతంత్రాన్ని కోల్పోయాయి. బలవంతంగా ఆదివాసీ రాజ్యాలన్నింటినీ తనలో కలుపుకున్న ఇండియన్ యూనియన్ ఆనాటి నుంచి ఈనాటి వరకు ఆదివాసులకు రాజ్యాంగంలో 5వ 6వ అధికరణాలతో సహా ఇచ్చిన, ఇస్తున్న వాగ్దానాలన్నీ కూడా ఈ గణతంత్రం ఉల్లంఘించడంలో ఒక క్రమాన్ని పాటించినంతగా అమలుపరచటంలో పాటించలేదు. పెట్టుబడి అడవిలో ప్రవేశించి జోక్యం చేసుకోవడం ప్రారంభమైన తర్వాత వాళ్ళు ఎన్నడూ రాజ్యాన్ని గానీ కేంద్రాన్ని గానీ ఒక మార్కెట్‌ను గానీ అనుమతించలేదు. నిరంతరం ప్రతిఘటించారు" – బి.డి. శర్మ

మనదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా మైదాన ప్రాంత ప్రభుత్వాల అధికారాన్ని ఆదివాసులు ఎక్కడా ఆమోదించలేదు. ఓడిపోయినప్పటికీ పూర్తిగా లోబడి పోలేదు. తమపై వలస పాలన నుండి కొనసాగుతున్న దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా సమష్టిగా పోరాడుతూనే ఉన్నారు.

భూమి తదితర ఉత్పత్తి సాధనాలలో స్వంత ఆస్తి అనేది లేకపోవటం వల్ల ఆదివాసీ సమష్టితనం, వారి జీవితాలతో ముడిపడి వున్న మాటకు కట్టుబడి వుండే సంస్కృతి వారిలోని పోరాట చేవను పదునెక్కిస్తుంది. తమపై ప్రత్యక్షంగా దోపిడీ చేస్తున్న షావుకార్లు, వడ్డీ వ్యాపారస్థులను ఎదుర్కోవటంతో ప్రారంభమైన వారి తిరుగుబాట్లు ప్రతి ప్రతిఘటన నుండీ నేర్చుకుంటూ భూమిస్వామ్యం, సామ్రాజ్యవాదమే అసలైన శత్రువులుగా గుర్తిస్తూ ఎదిగాయి. తెలంగాణ (1946–51), నక్సల్బరీ (1967–71), శ్రీకాకుళ (1967–70) పోరాటాల ప్రభావంతో గోదావరి లోయ, కొండమొదలు (1969), చిట్టగాంగ్ తెరాయి ఉద్యమం (1971), దుగ్గేరు (1989) పోరాటాల ఆచరణలతో ఒక నిర్దిష్టమైన రాజకీయ తాత్త్విక పునాదిగా గల ఉద్యమాలను నిర్మించుకుంటున్నారు. భూమికోసం, భుక్తికోసం సాగుతున్న రైతాంగ పోరాటాలతో మమేకమవుతూ పీడిత ప్రజలందరి విముక్తిలోనే దోపిడీ పీడనల నుండి శాశ్వత విముక్తి లభిస్తుందనే కార్యాచరణ దిశగా అడుగులు వేస్తున్నారు.

పోగేసిన ఆశలను పట్టుకొని
పోరాట ఆశయాల ఆకాశాన్ని చుట్టుకొని
పొడిచే పొద్దులాగ
ప్రతి అడవిని ఉదయించేందుకు నెట్టుకొని

('శ్రీకాకుళం' కావ్యం)

# నాగాలాండ్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి టెమ్‌సులా ఆవ్ (Temsulo Ao) మరణం

**ఈశాన్య** భారత రచయిత్రి టెమ్‌సులా ఆవ్ తన 77వ యేట నాగాలాండ్ రాష్ట్రంలోని దిమాపూర్‌లో 2022 అక్టోబరు 9న మరణించారు. ఆమె 1945 అక్టోబర్ 25న ఆనాటి బెంగాల్ ప్రెసిడెన్సీలోని జోర్హాట్ (నేడు అస్సామ్)లో జన్మించారు.

టెమ్‌సులా ప్రాథమికస్థాయి విద్యార్థినిగా వున్నప్పుడే తల్లిదండ్రులు 9 నెలల తేడాతో మరణించారు. ఆమె అస్సాంలోని గౌహతి విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. ఇంగ్లీషు చదివారు. హైదరాబాదులోని ఇంగ్లీషు, విదేశీ భాషల యూనివర్శిటీలో ఇంగ్లీషు బోధనలో పి.జి. డిప్లొమా చేశారు. ఈశాన్య భారత హిల్ యూనివర్శిటీలో ఇంగ్లీషు నవలా రచయిత హెన్రీ జేమ్స్ సాహిత్యంపై పరిశోధన చేసి పి.హెచ్‌డి. సాధించారు. ఆ తర్వాత ఆ హిల్ యూనివర్శిటీలోనే (NEHU) ప్రొఫెసర్‌గా పనిచేసి 2010లో రిటైరయ్యారు. 2013లో నాగాలాండ్ స్టేట్ కమీషన్ ఫర్ విమెన్‌కు చైర్ పర్సన్‌గా వున్నారు.

ఆమె 7 కవితాసంపుటులూ, మూడు కథాసంపుటులూ, ఒక సాహిత్య విమర్శ గ్రంథమూ ఇంగ్లీషులో ప్రచురించారు. ఆమె రచనలు అస్సామీ, బెంగాలీ, ఫ్రెంచి, జర్మన్, హిందీ, కన్నడ భాషల్లోకి అనువాదమయ్యాయి. 2007లో పద్మశ్రీ అవార్డు, 2013లో కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి అందుకున్నారు.

1963 డిసెంబరు 1న నాగాలాండ్ ఇండియన్ యూనియన్ 16వ రాష్ట్రంగా ప్రకటించిన ముందూ, తర్వాత స్వయం పరిపాలనకై నాగజాతి వారి పోరాటంతో నాగాలాండ్ రక్తసిక్తమైంది. బ్రిటీషువారి పరిపాలనా కాలంలో అక్కడి మూలవాసుల భాషలు, ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతి పరాయీకరణ చెందాయి. ఈశాన్య భారతంలో 168 తెగలవారు, వారివారి సొంత అస్తిత్వంలో వుండేవారు. బ్రిటీషువారి వలసగా మారడంతో అనేక తెగలవారు తమ తమ అస్తిత్వాన్ని పోగొట్టుకున్నారు.

తాము పోగొట్టుకున్న దేశీయ సంస్కృతి కోసం ఒక సాంస్కృతిక పునర్వికాస ఉద్యమం కావాలని టెమ్‌సులా ఆవ్ తన రచనల ద్వారా కృషిచేశారు. అక్కడ వున్న ప్రతి తెగవారికీ మౌఖికంగా కథలు అల్లి చెప్పే సంప్రదాయం వుంది. తాము పోగొట్టుకున్న తమ సంస్కృతి గురించి ఆవ్ ఒక కవితలో "మేము వారి మెదడులను అప్పు తీసుకున్నా / వారి మర్యాదలను అనుకరించాం / వారి దేవుళ్ళను కొలిచాం / పూర్తిగా వారిగా మారిపోయాం" అన్నారు. అంతేగాక 'బైబిల్ చేతపట్టుకొని వచ్చి, మేము కొలిచే ప్రకృతి దేవుడే కాదని / వేరే స్వర్గాన్ని వాగ్దానం చేసి, మా పాటలు, ఆటలూ అనాగరికమని చెప్పిన మాటలు నమ్మి మోసపోయాం" అన్నారు. "నా భూమి ఆక్రందన వినబడుతోంది పదే పదే. మరణించినవారందరూ మేలుకోండి. జీవించివున్నవారికి చెప్పండి – ఎలా మరణించకూడదో" అని ఆమె తన నాగా జాతికి చెందిన ఆవ్ తెగవారికి తన సాహిత్యం ద్వారా స్ఫూర్తినిచ్చారు.

స్పందన

# హిజాబ్
# మహిళలు - మతము - మతతత్త్వము

- బి. సూర్యసాగర్

**ముస్లిం** మహిళలు బహిరంగ ప్రదేశాల్లో హిజాబ్ ధరించడంపై ముందుకొచ్చిన ఇటీవలి రెండు వివాదాలు మహిళలపై మతము, మతతత్త్వం నియంత్రణలను మరోమారు చర్చకు తెచ్చాయి.

మన దేశంలో కర్నాటక రాష్ట్రంలో బసవరాజు బొమ్మై ముఖ్యమంత్రిగా వున్న బిజెపి ప్రభుత్వం 2023లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ది పొందే వ్యూహంతో మతతత్త్వ పాచికలను కదుపుతున్నది. ప్రతిపక్షాలు వ్యతిరేకించినా, లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మెజారిటీ లేకపోయినా, ఆర్డినెన్సు ద్వారా మతమార్పిడి నిషేధ చట్టాన్ని 2022లో తెచ్చింది. బలవంతపు మతమార్పిడులకు మాత్రమే ఆ చట్టం ఉద్దేశించబడిందని చెబుతూ స్వచ్ఛంద మతమార్పిడిని అసాధ్యం చేసే క్లాజులను ఆ చట్టంలో పొందుపరచింది.

ఇక ఇప్పుడు ముస్లిం విద్యార్థినులు హిజాబ్ ధరించి కాలేజీలకు హాజరు కాకూడదను నిషేధానికి ఉత్తర్వులు జారీచేసింది. విద్యార్థినీ విద్యార్థులందరు కాలేజి నిర్దేశిత యూనిఫాంలోనే హాజరుకావాలని ఆదేశించింది. ఉడిపి ప్రభుత్వ యూనివర్శిటీ కాలేజికి చెందిన కాలేజి డెవలప్‌మెంట్ కౌన్సిల్‌లో సభ్యుడిగా వున్న స్థానిక బిజెపి ఎమ్మెల్యే ఉద్దేశ్యపూర్వకంగా రేకెత్తించిన సమస్యగా ఇది మీడియాలో వెల్లడయింది. రాష్ట్రంలో వివిధ పట్టణాల్లోని కాలేజీలు స్కూళ్ళకు సమస్య ప్రాకింది. తాము కాషాయ తువాళ్ళు ధరించి హాజరవుతామని హిందూ మతసంఘాలు ప్రేరేపించిన విద్యార్థులు గొడవలకు దిగారు. కొన్నిచోట్ల హింసాత్మక ఘటనలు, అల్లర్లు జరిగాయి. హిజాబ్ నిషేధాన్ని సమర్థిస్తూ సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేసిన హిందువులపై ముస్లిం మతోన్మాద గుంపులు కొన్నిచోట్ల దాడి చేశాయి.

కర్నాటక బిజెపి ప్రభుత్వం కాలేజీల్లో హిజాబ్‌ను ధరించడాన్ని నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ముస్లిం విద్యార్థినులను పరీక్షలకు హాజరు కాకుండా నిరోధించారు. బాధితులు ఆ ఉత్తర్వులు రద్దుకై కర్నాటక హైకోర్టులో అపీలు చేశారు. హైకోర్టు ప్రభుత్వ ఉత్తర్వులను సమర్థిస్తూ తీర్పునిచ్చింది. ఇస్లాం మత గ్రంథాల్లో హిజాబ్‌ను ధరించడాన్ని ఆదేశించిన ప్రస్తావనలు లేవు అని వ్యాఖ్యానించారు. దీనిపై బాధితులు సుప్రీంకోర్టుకు అప్పీలుకు వెళ్ళారు. అక్కడ ఇద్దరు న్యాయమూర్తుల బెంచి విచారణ జరిపింది. అందులో ఒకరు కర్నాటక ప్రభుత్వ ఉత్తర్వులకు అనుకూలంగాను, రెండవ జడ్జి ప్రతికూలంగానూ తీర్పులు ప్రకటించారు. అందువల్ల కేసును సుప్రీంకోర్టు విస్తృత బెంచికి అప్పజెప్పారు. ఆలోగా ముస్లిం విద్యార్థినులు పాఠాలు పరీక్షలు కోల్పోయి నిరాశాపరులు కావడం జరుగుతుంది. ఈ మొత్తం క్రమంలో జనించే మతోన్మాదం, మతతత్త్వం బిజెపికి రాజకీయంగా లాభాలను ఒనగూరుస్తుంది.

మరో పార్శ్వంలో జనాభాలో 99 శాతం ముస్లిములు గల ఇరాన్ దేశంలో మహ్సా అమిని అను 22 యేళ్ళ అమ్మాయిని హిజాబ్‌ను సంప్రదాయానికి అనుగుణంగా ధరించలేదని ఆరోపిస్తూ అరెస్టు చేసిన పాశవిక వికృత ఘటన జరిగింది. ఆమె పోలీసుల అదుపులో వుండగా 2022 సెప్టెంబర్ 22న ప్రాణాలొదిలింది. ఈ దుర్మార్గం పట్ల ఆగ్రహోదగ్రులైన మహిళలు నాటినుండి ఉధృతమైన నిరసన ప్రదర్శనలు ఎడతెగకుండా సాగిస్తున్నారు. పోలీసుల కాల్పుల్లో ఇప్పటికే 400 మంది దాకా హతులయ్యారు. 15 వేలమంది పోలీసు నిర్బంధంలో వున్నారు. ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్ సర్వాధికారి అయిన ప్రధానమంత్రి ఇబ్రహీం రైజ ఉద్యమాన్ని నిర్దయగా అణచివేయడానికే పోలీసులకు ఆదేశాలిచ్చాడు. మహిళలు వెరవకుండా ఉద్యమిస్తున్నారు. తమ జుత్తును కత్తిరించివేయడం ద్వారా, హిజాబ్‌లను తగులబెట్టడం ద్వారా తమ స్వేచ్ఛా కాంక్షను, వెల్లడిస్తున్నారు.

ఇరాన్ మహిళలు బహిరంగ ప్రదేశాల్లో హిజాబ్ ధరించడాన్ని చట్టరీత్యా తప్పనిసరి చేయడంపట్ల రెండు మూడేళ్ళుగా నిరసన తెలుపుతూనే వున్నారు. హిజాబ్ రంగు సాధారణంగా గోధుమ లేదా నలుపురంగులో వుండాలనే సంప్రదాయ ఆంక్షలున్నాయి. తల జుత్తును పూర్తిగా కప్పి వుంచుతూ కళ్ళు మాత్రమే కనపడేవిధంగా ఆచ్ఛాదన చేసుకోవాలనే ఆంక్షలూ వున్నాయి. మహిళలు హిజాబ్, బురఖాలను ధరిస్తూనే పై ఆంక్షలను పూర్తిగా పాటించకుండా తమ స్వేచ్ఛా కాంక్షను ప్రదర్శిస్తుంటారు. వారు మత విశ్వాసులే. అయితే హిజాబ్ మత సంబంధం కాదన్నదే వారి వైఖరి. హిజాబ్‌ను ఇచ్ఛాపూర్వకంగా ధరిస్తూ అది మత విశ్వాసానికి అనుగుణమైనదిగా భావించేవారూ వుంటారు. కుటుంబం విధించే కట్టుబాట్లను స్త్రీలు పాటించవలసి వుంటుంది.

ఇరాన్‌లో 2020 సంవత్సరంలో హిజాబ్ ధరించే విషయమై జరిపిన అభిప్రాయ సేకరణ కేవలం 15 శాతం జనాభా మాత్రమే హిజాబ్‌ను చట్టపరంగా అమలుపరచాలని భావించారు. అత్యధిక మెజారిటీ ప్రజలు, స్త్రీలు పురుషులు కూడా, హిజాబ్ ధరించడాన్ని తప్పనిసరి చేయకూడదని, మహిళల ఇష్టాయిష్టాలకు వదలివేయాలని అభిప్రాయపడినారు. 99 శాతం జనాభా ముస్లిములుగా వున్న దేశంలో ఈ సర్వే ఫలితాలు ఎంతో విజ్ఞానదాయకమైనవని భావించవచ్చు. అయినప్పటికి 1979లో మతతత్త్వ అయొతుల్లా ఖొమైనీ ప్రభుత్వం హిజాబ్‌ను తప్పనిసరిగా ధరించాలన్న చట్టాన్ని చేసి అమలుపరచబడింది.

ఇరాన్‌ను ఇరాన్‌షా (ఇరాన్ రాజు)గా పిలవబడిన మొహమ్మద్ రెజా పాలవి పాలనలో బ్రిటిష్, అమెరికన్ ఆయిల్ కంపెనీలు ఇరాన్ ఆయిల్ వనరులను యథేచ్ఛగా దోచుకున్నాయి. పాలనలో లౌకిక విధానాలు పాటించినప్పటికీ ఆర్థిక అంతరాల పెరుగుదల, అవినీతి, దుబారా ఖర్చు, అణచివేత విధానాలు ప్రజల్లో అసంతృప్తికి దారితీసి 1951లో జరిగిన మజ్లిస్ ఎన్నికల్లో ఇరాన్ షాను గద్దెదించి మొహమ్మద్ మొసాదిగ్ అధికారం చేపట్టి లౌకిక విధానాలనవలంబించి పాలించాడు. ఇరాన్ షా నామమాత్ర రాజుగా పరిమితమయ్యాడు. మహిళలు సాపేక్ష స్వేచ్ఛను పొందారు. ఇరాన్ ఆయిల్ వనరులపై బ్రిటిష్, అమెరికా కంపెనీల దోపిడీని అరికట్టాడు. ఫలితంగా సిఐఏ, బ్రిటన్ కుట్రలు చేసి, కిరాయి తిరుగుబాటుదారులను ఉసికొల్పి మొసాదిగ్‌ను పదవీచ్యుతున్ని చేసి గృహ నిర్బంధంలో వుంచారు. ఇరాన్‌షా తిరిగి రాజుగా పగ్గాలు చేపట్టి బ్రిటన్, అమెరికా ఆయిల్ దోపిడీకి సహకరించారు. పాశ్చాత్య జీవన శైలిని ప్రోత్సహించారు. మహిళలు సాపేక్ష స్వేచ్ఛను పొందారు. ఛాందసత్వ నియంత్రణ తగ్గింది. విదేశీ అప్పులు, అవినీతి, నిరుద్యోగం విపరీతమైనాయి. దీన్నంతా ఆసరా చేసుకొని అయొకుల్లా ఖొమైనీ నాయకత్వంలో మతతత్త్వవాదులు తిరుగుబాటు చేపట్టి 1979లో ఇరాన్ షాను గద్దెదించి ఖొమైని దేశ సర్వాధిపతిగా ప్రతిష్ఠించారు. ఇరాన్‌షా దేశం విడిచి విదేశాలకెళ్ళిపోయాడు. ఈ పరిణామాలనే ఇరానియన్ విప్లవం అంటుంటారు.

ఖొమైని ఇరాన్‌ను ఇస్లామిక్ రిపబ్లిక్‌గా ప్రకటించి మతతత్త్వ నియంతృత్వ పాలన సాగించాడు. మహిళల జీవితంపై ఛాందసవాద నియంత్రణ, ఆంక్షలు పెచ్చరిల్లినాయి. హిజాబ్ ధరించడాన్ని చట్టబద్ధం చేసి తప్పనిసరి చేశారు. ఖొమైని తరువాత 2021లో గద్దెనెక్కిన ఇబ్రహీం రైజి మతఛాందస పాలనను మరింత ఎగదోశాడు. మహిళల జీవితంపై నియంత్రణను అధికం చేశాడు. దాని ఫలితమే నేడు సాగుతున్న ఇరాన్ మహిళల నిరసనోద్యమం. అది ప్రపంచ వ్యాప్త మహిళా జనావళికి గొప్ప స్ఫూర్తినిచ్చేదిగా వుంది. మహిళలను సంకెళ్ళలో వుంచి పురుష ప్రపంచం సాధించగల ప్రగతి అంటూ ఏదీ వుండదు.

పురుషాధిపత్య, దోపిడీ వర్గాధిపత్య రాజకీయ లక్ష్యాలకు మహిళల జీవనము, వారి శరీరాలు, వారి సామాజిక వ్యక్తిగత ఇష్టాయిష్టాలు బలికావడం సమాజ పరిణామంలో వ్యక్తిగత ఆస్తి, వర్గసమాజము ఏర్పడిన నాటినుండి మొదలై కొనసాగుతున్నది. ఆ స్వార్థ సంకుచిత ప్రయాణంలో సమాజంలో వ్యాపింపచేయబడిన మూఢ, మూర్ఖ, పీడక మతవిశ్వాసాలు ప్రజాస్వామిక యుగంలో కూడా మహిళల అణచివేతకు దోపిడీ పాలకవర్గాలకు పాచికలు కావడం సహించరాని సామాజిక నేరం.

ఫ్రెంచి విప్లవం (1789) కల్పించిన స్వేచ్ఛ, సమానత్వ, సౌభ్రాతృత్వ ఆశలను, ఆశయాలను బూర్జువా వర్గం అశేష శ్రామిక జనావళికి వమ్ము చేసింది. ఫ్యూడల్ దోపిడీ, అణచివేతలు, పురుషాధిపత్యము తొలగి పోతాయని మహిళాజనం ఆశించి సమరశీల పోరాటాల్లోకి కదలివచ్చారు. చరిత్ర పొడవునా బూర్జువావర్గం ద్రోహపూరితంగా వ్యవహరించింది. ఫ్రెంచి విప్లవ ఆశయాలను ప్రజా జీవనంలో వాస్తవం చేయడానికి రష్యా, చైనా తదితర దేశాల్లో మార్క్సిస్టు–లెనినిస్టు శ్రామికవర్గ విప్లవోద్యమాలు పూనుకొని విజయవంతమయ్యే క్రమంలో అంతర్గత, బాహ్య సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ శక్తుల కుట్రలకు మధ్యంతరంగా బలైపోయాయి. అయినా ఆ విప్లవ స్ఫూర్తిని అందుకొని విజయం దిశలో సాగడం మినహా మహిళా విముక్తికి వేరు మార్గంలేదు. వందేళ్ళకు పైగా నడుస్తున్న పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద దశ మానవాళికి పెనుముప్పుగా తయారైంది. సామ్రాజ్యవాద అమెరికా కూటమి ప్రపంచవ్యాప్తంగా సకల హీన, క్షీణ, హింసాత్మక, ఉగ్రవాద పరిణామాలకు, ఘటనలకు మూల ధాతువుగా వుంది. ప్రపంచవ్యాప్తంగా అది పాల్పడుతున్న దోపిడీ దౌర్జన్యాల విధ్వంసకాండ, అన్ని దేశాల్లో ప్రతీప శక్తులకు అండదండలందిస్తూన్న వైనం ప్రజలందరికీ ప్రత్యేకించి మహిళలకు, బాలలకు ప్రాణాంతకమవుతున్నది. ఇరాక్‌పై అమెరికా కూటమి జరిపిన దురాక్రమణ యుద్ధంలో అయిదు లక్షలు పైగా బాలలు హతులైన దారుణాన్ని ప్రస్తావించినప్పుడు అమెరికా సెక్రెటరీ ఆఫ్ స్టేట్ (మన దేశంలో విదేశాంగమంత్రి హోదా)గా వుండిన మాడలీన్ ఆల్‌బ్రైట్ చేసిన వ్యాఖ్య భీతిగొల్పేదిగా వుంది. "సద్దాం వంటి దేశాధినేతను కలిగివున్నందుకు ఇరాకీలకు ఆ మాత్రం శిక్ష సరయినదే", అంటూ అమెరికా యుద్ధోన్మాద రాక్షస క్రీడను ఆమె బద్దలుగొట్టి సమర్థించింది.

మతాలు హేతు విరుద్ధమైనవి అయినప్పటికీ, సామాజిక సమానత్వం కాకపోయినా ప్రజాస్వామికత ఒక మేరకైనా నెలకొని వున్నట్లయితే మతోన్మాదానికి మతతత్త్వానికి అడ్డుకట్టగా వుండగలుగు తుంది. ఇరాన్, ఇండియా వంటి అర్ధసమాజాల్లో దోపిడీ పాలకవర్గాలు రాజ్యాధికారం కోసం పోట్లాట కొట్లాటల్లో మతోన్మాదాన్ని, మతతత్త్వాన్ని పనిగట్టుకొని పోషిస్తారు. సామ్రాజ్యవాద రాజ్యాలు దోపిడీ ప్రయోజనాల రీత్యా ఆయా దేశాల ప్రభుత్వాలను ప్రశంశకో, విమర్శకో చేస్తుంటాయి. ఇరాన్‌లో మొసాదిగ్ ప్రభుత్వాన్ని కూలదోసిన కుట్రలు, ట్రంప్ – వె ఆలింగనాలు ఆ కోవలోనివే.


హిజాబ్, బురఖా ధరించడాన్ని గురించి మనదేశంలో ఇదివరకు ఏనాడూ వివాదాలు చెలరేగలేదు. ఆ వస్త్రాలు మహిళలకు సౌకర్యవంతమైనవా కావా అను విషయాన్నటుంచి, వాటిని ముస్లిం మత సంప్రదాయాలుగా ఇతర మతాలవాళ్ళు భావించారు. మత సామరస్య జీవనానికి అవి విఘాతాలుగా పరిణమించి నిర్లజ్జగా, బుద్ధిహీనంగా, నగ్నంగా ఊరేగే స్వాములోర్లను పిలిచి అసెంబ్లీలో పీఠం వేసి వారి బుద్ధిహీన ప్రవచనాల్ని రిక్కించి వినే శాసనకర్తలు హిజాబ్ గురించి రచ్చ చేయడం వంచనాత్మక మతతత్త్వ విన్యాసం.

వలసానంతర కాలంలో జాతీయ విముక్తి పొందిన దేశాలు భూస్వామ్య అనుకూల, సామ్రాజ్యవాద అనుకూల దళారీ పరిపాలకులపాలు కావడంతో ఇండియాతో సహా మూడవ ప్రపంచ దేశాలనబడేవి అత్యంత సామాజికార్థిక, రాజకీయ, సాంస్కృతిక వెనుకబాటుతనంలో మగ్గుతున్నాయి. ఆ దేశాల ప్రజలు అదనంగా కుట్రపూరిత మతతత్త్వ రాజకీయ సుడిగుండంలోకి నెట్టబడడం దారుణ దుర్మార్గం. ఇండియా, ఇరాన్‌లలో మతతత్త్వ ప్రతీప శక్తులు పాల్పడుతున్న ఆగడాలు, వంచనలు సామాజిక శాంతికి భద్రతకు చిచ్చుపెడుతున్న నేపథ్యంలో హిజాబ్ అనుకూల, ప్రతికూల వాదవివాదాలను సవ్యంగా అర్థం చేసుకొని నూతన ప్రజాతంత్ర పోరాట ఉద్యమాల ఆవశ్యకతను గుర్తించడం తక్షణ అవసరం.

# మత విద్వేషాల నడుమ నిష్కపట స్నేహగాథ 'దొస్తోజీ' (2021)

- బాలాజీ (కోల్‌కతా)

**ముర్షిదాబాద్** జిల్లా. బెంగాల్ - బంగ్లాదేశ్ బార్డర్ దగ్గర ఓ నిరుపేదల కుగ్రామం. కూటి కోసం, పూట గడవడం కోసం అక్కడ ఎవరి జీవనపోరాటం వారిది. పక్కోడి మీద పడి ఏడ్వడానికి సమయం లేని జీవితాలు వారివి. కానీ స్వార్థపరులు సృష్టించే కొన్ని చారిత్రక సందర్భాలు ఈ తటస్థ జనసమూహాల్ని కూడా ఒక కుదుపు కుదుపుతాయి. తాత్కాలికంగానైనా అకారణ విద్వేషాలకు గురిచేస్తాయి. అలాంటి ఓ సందర్భం బాబ్రీ మసీదు విధ్వంసం. హరిశంకర్ పర్సాయీ అనే హిందీ వ్యంగ్య రచయిత చెప్పినట్టు 'ఆవారా భీడ్ కే ఖత్రే' (పోరంబోకు మూకల ప్రమాదాలు) సంఘీభావంగా సాగే సంఘజీవనానికి చిచ్చుపెడతాయి. ఆ మూకలు ఫాసిస్టు ఎజెండాలతో తయారైనవైతే మరీ ప్రమాదం. ఆ గ్రామంలో ముస్లింలు అధికం. ముస్లింలంతా చందాలు వేసుకుని తమ ఊరిలో 'చోటా బాబ్రీ మసీదు' కట్టాలను కుంటున్నారు. రాముడి పూజ బెంగాలుకు కొత్త అయినా సరే హిందువులలోని ఒక చిన్న వర్గం శివాలయం పక్కన రామాలయం కట్టాలనుకుంటున్నారు. హిందువులు తమ ఉనికిని చాటుకోవాలట! ఈ వాతావరణంలో ఆ గ్రామంలోని పక్కపక్కన ఇళ్లలోని హిందూ ముస్లిం పిల్లల స్నేహగాథ ఈ సినిమా.




**'దొస్తోజీ' కథ :**

'దొస్తోజీ' అన్నది ఆ ప్రాంతంలో వాడకంలో ఉన్న మాట. 'స్నేహితుడు' అని అర్థం. పలాష్ (ఆసిక్ షేక్), సఫీ (ఆరిఫ్ షేక్) పక్క పక్కనే వున్న మట్టి ఇళ్లలో వుంటున్న సుమారు ఎనిమిదేళ్ల వయసున్న స్నేహితులు. పలాష్ నాన్న మాధవ్ స్థానిక పూజారి. సఫీకుల్ నాన్న నేతపనివాడు. ఆ పిల్లలది ఒకే స్కూల్లో ఒకే క్లాసు. ఇంటి వద్ద ఒకే టీచర్ (అనుజోయ్ చటోపాధ్యాయ) దగ్గర ట్యూషన్ చదువుతారు. బయట వేడెక్కుతున్న ఉద్రిక్త వాతావరణం వారికి అస్సలు పట్టదు. వరి పొలాల గుండా పరుగులాటలూ, మైదానంలో ఫుట్‌బాల్ ఆటలూ, మిణుగురులను అతికించిన అట్టముక్కల వజ్ర కిరీటాలతో చీకట్లో కత్తి యుద్ధాలూ, స్కూలుకు వెళ్లి వచ్చే దారిలో ఆగడాలూ, స్కూలు ఎగ్గొట్టి జాతరలకు పోవడాలూ, బయస్కోపులు చూడడాలూ, అమితాబ్ బచ్చన్ స్టయిలును నకలు చేయడాలూ - ఇలా వారి ఆటపాటలకు అంతే లేదు. కలహించే సమూహాలుగా పెద్దవాళ్లు ఎడమొహం, పెడమొహం ఐపోయి, ఈ పిల్లకాయల్ని వేరుచేద్దామంటే వాళ్ల వల్లకావడం లేదు. రేకుముక్కతో చేసిన 'టిక్కు టిక్కు' (టుక్‌టుకీ) ఆటవస్తువుతో రహస్య సంకేతాలు ఇవ్వడంలో ఆరితేరారు ఆ కుర్రాళ్లు. ఆ రెండు ఇళ్ల మధ్య ఒక సన్నని తడిక గోడ! పెద్దవాళ్లకదిప్పుడు మతాలను వేరుచేసే ఇనుప తెర అయింది. కానీ, పిల్లకాయలకు మాత్రం అది ఆఫ్టరాల్ ఇరేజర్‌తో తుడిచిపారెయ్యాల్సిన 'విభజన రేఖ'. పెద్దవాళ్లు వద్దన్నా వినకుండా సఫీ, పలాష్‌తో కలిసి రావణవధ 'జాత్రా' (నాటకం) చూడడానికి రాంలీలా మైదానానికి వెళతాడు. ఇంటికొచ్చి తన్నులు తింటాడు. ఈద్ పండగ పూట చేతి ఖర్చు దొరికితే దాంతో పలాష్‌తో పాటు బచ్చన్ స్టయిల్ ఫోటో తీయించుకుంటాడు. పలాష్ చెల్లాయి కోసం అరిటాకులో చుట్టి సేమ్యా పాయసం పంపిస్తాడు సఫీ. కానీ సఫీకి నీళ్లు ఇవ్వాల్సి వచ్చేసరికి మాత్రం పలాష్ తల్లి వివక్ష చూపిస్తుంది. అది వివక్ష అని కూడా తెలియని ఆటపాటల అమాయక పసిహృదయాలు వారివి. పెద్దవుతున్న కొద్దీ ఈ పెద్దవాళ్ల తలపులు ఇరుకౌతున్నాయి. వాటిని చిన్నపిల్లలంత సరళత్వంతో విశాలం చేసుకోవాలి అన్నట్టు తెరపై అతి తక్కువ సంభాషణలతో ఎక్కువ సందేశాన్నిస్తుంటాడు దర్శకుడు.

ఆ పిల్లల మధ్య గొడవ రావడం, జన్మలో మాట్లాడుకోమని ఒట్టేసుకోవడం, కొద్ది రోజుల్లోనే ఆ ఒట్టు తీసి గట్టు మీద పెట్టేయడం - అన్నీ చాలా సహజ సుందరంగా చిత్రిస్తాడు దర్శకుడు. దొంగిలించిన డబ్బుతో నీలం రంగు గాలిపటం కొంటాడు సఫీ, దాన్నెగరెయ్యడానికి కావలసిన దారపు పంటికోల మాత్రం పలాష్ దగ్గర వుంటుంది. ఈ రెండూ కలిస్తేనే గాలిపటం ఎగరెయ్యడం, అది ఆకాశపు హద్దులను ముద్దాడడం జరిగేది. ఈ దృశ్యంలో కూడా సమాజం పరస్పర సహకారం కోరుతుంది అని ప్రతీకాత్మకంగా చెబుతాడు దర్శకుడు. పలాష్ పొరపాటున గాలిపటం వెన్నుబద్దను విరిచేస్తాడు. ఆ కారణంగా వారి మధ్య గొడవలూ, అలకలూ! ఇప్పుడు సఫీని మెప్పించడం పాలాష్ వంతవుతుంది. కొత్త గాలిపటానికి కావలసిన డబ్బులు మిగల్చడానికి అతడు బడి నుండి ఇంటికి నడిచి వస్తాడు. గాలిపటం చేతికొస్తుంది. వారి మధ్య పోట్లాట గాలికెగురుతుంది. వారింకా గట్టి దోస్తులౌతారు. పలాష్, సఫీ ఆటల్లో, అల్లరిలో ఒక్కలానే వున్నా, చదువుల్లో మాత్రం వారిలో తేడా వుంది. పలాష్ చదువుల్లో ఫస్ట్

అయితే సఫీ చదువు మాత్రం అంతంతమాత్రంగా వుంటుంది. కానీ ప్రాక్టికల్ నాలెడ్జి మాత్రం ఎక్కువ. కృష్ణాష్టమి పందిరి నిర్మాణం కోసం మసీదు కోసం పోగేసిన ఇసుకను దొంగిలిస్తాడు సఫీ. మిత్రులిద్దరూ కలిసి గొంగళిపురుగును సీసాలో వేసి సీతాకోకచిలుకగా మార్చాలని ప్రయత్నిస్తూ ఉంటారు. వర్షంలో ఆడుతూ చేపలు పట్టడానికి చెరువులోకి దిగుతారు. సరిగ్గా ఆ సమయంలోనే ఉరుము పడడంతో ఊహించని ప్రమాదం జరుగుతుంది. సఫీ తన ప్రియమిత్రుడ్ని కోల్పోతాడు. అది సఫీకి ఎప్పటికీ మర్చిపోలేని షాక్! కొంత తటపటాయించినా చివరికి పక్కింటి హిందూ అబ్బాయి అంత్యక్రియలో పాల్గొంటాడు సఫీ తండ్రి.

నిత్యం తుళ్లుతూ ఉండే సఫీ ఇప్పుడు ముభావంగా మారిపోతాడు. జీవితంలో ఏదో కోల్పోయిన వాడిగా కన్పిస్తాడు. పలాష్ తల్లి (జయతీ చక్రవర్తి) విషాదం పెద్దదా, సఫీ విషాదం పెద్దదా అని ప్రేక్షకులు సందేహంలో పడే పరిస్థితి! 'నీట మునిగిన మనిషి ఎందుకు చనిపోతాడు? నీటిలోని చేప ఎందుకు బ్రతికుంది?' అని తన ట్యూటర్ను ప్రశ్నిస్తాడు సఫీ. భౌతికంగా లేని పలాష్, సఫీ ఊహల నిండా అలుముకుంటాడు. పరీక్షల కోసం ప్రోజెక్టు వర్కు చేయమంటే నీటిలో ఊపిరి పీల్చుకునే యంత్రం తయారుచేస్తాడు సఫీ. ఎప్పటికైనా అటువంటి యంత్రం కనిపెట్టాలన్నది అతడి పట్టుదల. పరీక్షా ఫలితాల ద్వారా కూడా తన దోస్తును అందుకోడానికి ప్రయత్నిస్తాడు సఫీ. తన 'దొస్తోజీ'ని విశాల ప్రకృతిలో వెతుక్కునే మానసిక దశకు చేరుకుంటాడు సఫీ. ఆ విషయాన్ని సినిమాలో దర్శకుడు ఎలా చూపించాడన్నది పెద్దతెరపైనే చూడాలి.

## ఈ సినిమా నిర్మాణమే ఓ పోరాటం!

ఈ సినిమా ఇచ్చిన షాక్ నుంచి త్వరగా కోలుకోవడం కష్టం. చూసిన చాలా రోజుల పాటు దీని భారాన్ని మనసులో మోయాల్సిందే. బెంగాలీ సూపర్ స్టార్ ప్రసేన్‌జిత్ చటర్జీకి ఈ సినిమా చూసిన రాత్రి నిద్ర పట్టలేదు. ఆయన ఈ సినిమాకు సమర్పకుడిగా ముందుకు వచ్చాడు. అమితాబ్ బచ్చన్ ఈ సినిమా గురించి ట్వీట్ చేశాడు. ఈ సినిమా ఇరవై ఆరు దేశాల చిత్రోత్సవాల్లో పాల్గొని ఎనిమిది అంతర్జాతీయ అవార్డులు గెల్చుకుంది. వాటిలో యూనిసెఫ్ వారి అవార్డు, మలేషియా గోల్డెన్ గ్లోబల్ అవార్డు, లండన్ ఆర్ట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇంగ్లండ్‌లో ఉత్తమ చలనచిత్ర పురస్కారం వంటివి ఉన్నాయి.

కానీ ఇంత గొప్ప సినిమా ఒకప్పుడు డబ్బుల్లేక షూటింగ్ దశలోనే ఆగిపోయింది. "నేను 2013లో స్క్రిప్ట్ రాసుకున్నాను, నిర్మాతల కోసం మూడేళ్లుగా వెతికాను, క్రౌడ్ ఫండింగ్ కోసం విఫలయత్నాల తర్వాత మేము కొంతమంది సన్నిహితుల సహాయంతో 2017లో ప్రీ-ప్రొడక్షన్‌ని ప్రారంభించాము" అని దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. "బాల నటులతో పాటు సినిమాలో నటించిన సరిహద్దు గ్రామంలోని గ్రామస్థులు ఇదివరకెన్నడూ సినిమా కెమెరాని చూడలేదు. ఏనాడూ రైలు చూడని ఆ బాల నటులు తమ డబ్బింగ్ కోసం రైలులో ప్రయాణించి కోల్‌కతాకు వచ్చారు. షూటింగ్ ప్రారంభించే ముందు దాదాపు నూట యాభై మంది గ్రామస్థులకు ఏడాదికి పైగా శిక్షణ ఇచ్చేందుకు ప్రయత్నించాం. అది ఒక అద్భుతమైన పరస్పర అభ్యాస ప్రక్రియ. సహజ కాంతిలో ప్రకృతి దృశ్యాల్ని క్యాప్చర్ చేయడానికి మేము వివిధ రుతువుల్లో చిత్రాన్ని చిత్రీకరించాము. ఇది నిజంగా ఓ సుదీర్ఘ ప్రయాణం"- అని అదే ఇంటర్వ్యూలో చెప్పాడు దర్శకుడు. సినిమాటోగ్రఫీలో అనుభవం లేని ఓ స్టిల్ ఫొటోగ్రాఫర్ ఈ సినిమాకు డబ్బులు తీసుకోకుండా కెమేరా పని చేశాడు. ఆయన పేరు తుహీన్ బిస్వాస్. ఆయనకు బెస్ట్ సినిమాటోగ్రఫీ కోసం అంతర్జాతీయ అవార్డు వచ్చింది. ఒకచోట తప్పించి నేపథ్య సంగీతం కూడా వాడలేదు. అంతా ప్రకృతి ధ్వనులే నేపథ్యంగా వుంటాయి. దర్శకుడే సౌండ్ డిజైనర్ కూడా. కరోనాకు ముందు కాలంలో ఈ సినిమా పూర్తిచేయడం కోసం యాతన పడ్డాడు దర్శకుడు. ఈ సినిమా థియేటర్లలోకి వచ్చేసరికి ఆ పిల్లల వయసు చాలా పెరిగింది. ఈ సినిమా నిర్మాణం మొత్తం ఒక పోరాట చరిత్రే.

మళయాళం, బెంగాలీ ప్రేక్షకులు మంచి సినిమాలను విపరీతంగా ఆదరిస్తారని మరోమారు రుజువైంది. థియేటర్లలో విడుదలైన ఈ సినిమాకు విపరీతమైన జనాదరణ లభించింది. ఎక్కువ షోలు హౌస్‌ఫుల్ అవుతున్నాయి. ముర్షిదాబాద్‌లోని ఒక ప్రైవేటు విద్యాసంస్థ ఈ సినిమాలో నటించిన ముగ్గురు పిల్లలకు తమ విద్యాలయంలో ఉచితంగా చదివిస్తామని ముందుకు వచ్చింది.

## ఈ కాలపు 'పాథేర్ పాచాలీ'!

రామాయణం జాత్రా స్టేజి వెనుక రాముడూ, రావణుడూ, హనుమంతుడి పాత్రధారులు కలిసి ఒకేచోట సిగరెట్లు తాగుతుంటారు. వారిని చూసిన ఈ ఇద్దరు మిత్రులు 'మీరు శత్రువులు కదా?' అని ప్రశ్నిస్తారు. అప్పుడు వారా పిల్లలతో 'మేము నిజంగా శత్రువులం కాము, మా జీవనోపాధి కోసం స్టేజిపై శత్రువులుగా నటిస్తాం. అంతే' - అని చెబుతారు. ఈ సినిమాలో అనవసరమైన డ్రామా లేదు, 'డైలాగ్ బాజీ' లేదు. కానీ ఈ సినిమా చాలా సైలెంట్‌గా, చాలా బలంగా మతతత్త్వం మొహంపై చాచి కొట్టింది, కాదు కాదు కన్నీరు పెట్టించి మనల్ని ఆలోచించమని కోరింది. ఈ సినిమా 'పాథేర్ పాచాలీ'కి ఓ రకంగా నివాళి అర్పించిందని కొన్ని సార్లు అన్పిస్తుంది. గడ్డిపూల షాట్లూ, బయస్కోపు వాడూ, బ్రాహ్మణుడైన తండ్రీ, రోదించే తల్లీ, దుర్గలా ఓ సోదరీ, వర్షం క్రమక్రమంగా పెరుగుతున్న దృశ్యాలూ, వర్షం కారణంగా విషాదాలూ - ఇలా చాలా సంగతులు సత్యజిత్ రాయ్ క్లాసిక్‌ను గుర్తు తెప్పిస్తాయి. సత్యజిత్ రాయ్ తన మొదటి సినిమా కోసం కష్టపడినంతలా ఈ దర్శకుడూ పడ్డాడు. చాలా మంది ఈ సినిమాను ఈ కాలపు 'పాథేర్ పాచాలీ' అంటున్నారు. చాలా విద్యాలయాలు తమ పిల్లల కోసం బల్క్‌గా టిక్కెట్లు బుక్ చేసుకుంటున్నాయి.

ఒక మంచి స్క్రిప్టు ఎలా వుంటుందో చెప్పడానికి ఉదాహరణ ఈ సినిమా. సినిమా చూపిన ప్రతి దృశ్యమూ, ప్రతి సన్నివేశమూ తరువాత వచ్చే కథలో ఎక్కడోచోట లింకు కలుపుకుంటుంది. అనవసర దృశ్యాలూ, అనవసర సంభాషణలూ ఏవీ లేవు. 'మినిమలిజం' అంటే ఏమిటో ఈ సినిమా చూసి నేర్చుకోవాలి. సినిమాలో కన్పించే పిచ్చోడిలో మనకు మంటో 'టోబా టేక్ సింగ్' కనిపిస్తాడు. ఈ దర్శకుడు కూడా విభజన బాధిత పరివారం నుండి వచ్చిన వాడే.

## బాబ్రీ విధ్వంసపు నేపథ్యం ఎందుకు?

"హిందూ ముస్లిం గొడవలు గతంలోనూ ఉండేవి. కానీ బాబ్రీ విధ్వంసం, ఆ తదుపరి బాంబ్ బ్లాస్టులు భారతదేశంలో పరిస్థితిని గుణాత్మకంగా మార్చేశాయి. ఆ ప్రభావాల్ని ఇప్పటికీ చూస్తున్నాం. అందుకే ఈ నేపథ్యాన్ని ఎంచుకోవడం జరిగింది. ప్రపంచంలోని ఎన్నో

ప్రాంతాల్లో ఈ మెజారిటీ – మైనారిటీ సంఘర్షణ, మెజారిటీ రాజకీయాలూ వున్నాయి.” అంటున్నాడు దర్శకుడు.

ఈ దర్శకుడు కూడా దేశ విభజన బాధితుడే. “నేను ఢాకాలోని మా పూర్వీకుల ఇంటిని గురించిన కథలు వింటూ పెరిగాను. మా అమ్మమ్మ తన జీవితాంతం ముస్లింలపై పగతో ఉండేది. మా పూర్వీకులు కట్టుబట్టలతో, చేతికి దొరికిన కొద్దిపాటి వస్తువులతో తూర్పు పాకిస్తాన్ నుండి వలస వచ్చారు. ఈ కథలు నన్ను నిరంతరం ఆలోచింపజేశాయి. నా తల్లిదండ్రులు, నా సామాజిక అవగాహన ఫలితంగా నేను ఈ హింసను నేడు భిన్నకోణంలో చూస్తున్నాను. వివిధ సామాజిక వర్గాల మధ్య ద్వేషాన్ని రెచ్చగొట్టడంలో పెత్తందార్ల ప్రయోజనాలూ ఏమిటో, వారి పరికల్పనలు ఎలా వుంటాయో నాకు అర్థమౌతోంది” అని చెబుతున్నాడు దర్శకుడు ప్రసూన్ ఛటర్జీ. తెగిన గాలిపటం బంగ్లాదేశ్ వైపు వెళుతోంది అని ఈ సినిమాలోని పిల్లలు అనుకుంటున్నప్పుడు తన పూర్వీకుల నేల పట్ల దర్శకుడికి ఉన్న బలమైన అనురక్తి మనకు తెలుస్తుంది. ఈ సందర్భంలో మనకు విభజన విషాదాన్ని అనుభవించిన మరో దర్శకుడు రిత్విక్ ఘటక్ గుర్తొస్తాడు.

# 2022 నోబెల్ సాహిత్య బహుమతి అందుకున్న ఫ్రెంచి రచయిత్రి ఆనీ ఎర్నో (Annie Ernaux)

**1940** సెప్టెంబర్ 1న జన్మించిన ఆనీ ఎర్నో ఉపాధ్యాయినిగా, సాహిత్యం బోధించే అధ్యాపకురాలిగా, ఆ తర్వాత 23 సంవత్సరాల పాటు జాతీయ దూరవిద్యాకేంద్రంలో పనిచేసి 2000ల సం॥లో ఉద్యోగ విరమణ అనంతరం పూర్తికాలం రచయిత్రిగా స్థిరపడ్డారు. ఆమె తండ్రి ఒక చిన్న హోటల్, ఒక చిల్లరకొట్టు నడిపేవారు. ఆర్థికంగా వెసులుబాటు లేకున్నా, తల్లి ఇచ్చిన ప్రోత్సాహంతో ఆనీ తన చదువును కొనసాగించారు.

దాదాపు 20 నవలలు రాసిన ఆనీ వాస్తవ జీవితానుభవాలకు కథనాత్మక రూపమిచ్చి ‘స్వీయచరిత్రాత్మక నవలా’ (Autofiction) రచనా ప్రక్రియకు మార్గదర్శిగా నిలిచారు. ఆమె రాసిన కొన్ని పుస్తకాలు ఫ్రాన్స్‌లోని విద్యాలయాల్లో దశాబ్దాల తరబడి పాఠ్యగ్రంథాలుగా వున్నాయి. తన జీవితంలోని పరాభవాలను, అవమానాలను, ఆందోళనలను దాపరికం లేకుండా ఆమె రాశారు. తన కౌమార జీవితం, వైవాహిక జీవితం, ప్రేమ వ్యవహారం, తల్లి మరణం, రొమ్ముక్యాన్సర్ రావడం, వ్యక్తిగత అనుభవాలు, అనుభూతులు, సామూహిక వ్యక్తీకరణ మొదలగు అంశాలపై ఆమె సాహిత్య సృష్టి చేశారు.

1963లో తన 23వ యేట అవాంఛిత గర్భం ధరించిన ఆమె గర్భస్రావం చేసుకోవాలంటే ఆ దేశంలోని చట్టం అంగీకరించకపోవడాన్ని విమర్శిస్తూ, తను అనుభవించిన తీవ్ర వేదనను 1999లో ‘హాపెనింగ్’ (Happening), (ఫ్రెంచి భాషలో ‘ఇవెన్మో’) అనే 136 పేజీల నవలలో చిత్రించారు. దీని ఇంగ్లీషు అనువాదం 2000లలో విడుదలైంది. ఫ్రాన్స్‌లో గర్భస్రావాన్ని 1975 జనవరిలో చట్టబద్ధం చేశారు! అప్పటివరకు చట్టవ్యతిరేకంగా గర్భస్రావం చేసుకోడానికి తల్లులు ఫ్రాన్స్ నుండి ఇంగ్లండ్‌కు వెళ్ళేవారు. ఇంగ్లండ్‌లో గర్భస్రావం 1967లో చట్టబద్ధం చేశారు.

ఆమె నవలలన్నిటిలో వర్గ వ్యత్యాసాలు, పితృస్వామ్య అణచివేత, అసమానతలు చర్చించారు. స్త్రీల తమ శరీరాలపై తామే అధికారం కలిగి వుండాలనీ, పురుషులతో అన్నివిధాల సమానంగా జీవించాలనీ ఆమె తన నవలల్లో చిత్రించారు. జాతి, మతం, వర్గం, అసమానతలు, అణచివేతలు వున్న ఛాందస సమాజంలో మగ్గుతున్న మహిళల జీవితాలను, తన సొంత అనుభవాల ఆధారంగా ఆమె సాహిత్య కృషి కొనసాగించారు. కపటత్వంతో, పురుషాహంకారం నిండిన సమాజాన్ని ఈసడించారు.

1974లో ఆమె రాసిన తొలి నవల ‘క్లీన్డ్ ఆఫ్’ (Cleaned Off), 1983లో ప్రచురించిన ‘ఎ మాన్స్ ప్లేస్’ (పురుషుడి స్థానం)తో ఆమెకు సాహితీ లోకంలో గుర్తింపు లభించింది. 1987లో తన తల్లి కథను ‘ఎ ఉమెన్స్ స్టోరీ’ పేరుతో రాశారు. బాల్యం నుండి తల్లి అయ్యేవరకు గల తన స్వీయగాథను 2000లో ‘ది ఇయర్స్’ (The Years) పేరుతో వెలువరించారు. ఈ నవలలో రెండవ ప్రపంచయుద్ధం నుండి వర్తమానం వరకు ఫ్రెంచి సమాజాన్ని చిత్రించారు. అత్యంత సాధారణ భాషలో, పులుముడు లేకుండా స్వచ్ఛమైన వ్యక్తీకరణ చేయడం ఆమె రచనాశైలి.

తనకంటే 12 ఏళ్ళ చిన్నవాడైన, పారిస్‌లో సోవియట్ దౌత్యవేత్తగా వున్న ఉద్యోగితో 1988లో ఆమెకు బంధం ఏర్పడింది. ఆ బంధం ముగిసిన సందర్భంగా తన భావోద్వేగాలను ఆమె ‘గెటింగ్ లాస్ట్’ (Getting Lost)లో రాశారు.

రాజకీయంగా ఆమె 2018 నవంబరు 17న ఫ్రాన్స్‌లో ప్రారంభమై వారంవారం నిర్వహింపబడిన ‘యెల్లో వెస్ట్స్’ నిరసనలను సమర్థించారు. ఆర్థికన్యాయం కోసం, వ్యవస్థాగత రాజకీయ సంస్కరణల కోసం జరిగిన ఉద్యమం అది. చొక్కాపై పసుపుపచ్చని అరకోటు ఈ ప్రదర్శకులు ధరించారు. కనుక ఆ నిరసన కార్యక్రమానికి ఆ పేరు వచ్చింది. 2020 మార్చి వరకు ఈ నిరసన ప్రదర్శనలు జరిగాయి.

ఇజ్రాయెల్, పాలస్తీనా దేశాల మధ్య జరుగుతున్న యుద్ధం రెండు సమాన దేశాల మధ్య యుద్ధం అనడాన్ని ఆమె అంగీకరించలేదు. ఇజ్రాయెల్ వలసాధిపత్య రాజ్యంగా పాలస్తీనాను వలస దేశంగా గుర్తించాలన్నారు. ఇరాన్‌లో హిజాబ్‌కు సంబంధించి మహిళల పోరాటానికి ఆమె సంఘీభావాన్ని ప్రకటించారు. స్త్రీ పక్షపాతిగా ‘మీ టూ’ (Mee Too) ఉద్యమాన్ని సమర్థించారు.

నోబెల్ సాహిత్య బహుమతి ప్రవేశపెట్టిన తర్వాత ఇప్పటివరకు ఆ బహుమానాన్ని 119 మందికి ఇచ్చారు. వారిలో 16 మంది మాత్రమే స్త్రీలు. ఆనీ ఎర్నో 17వ మహిళ. ఫ్రాన్స్‌లో ఈ బహుమతి అందుకున్న ఏకైక మహిళ ఆమె.

నోబెల్ సాహిత్య బహుమతిని ప్రకటిస్తూ ఆ కమిటీ ఈమె సాహిత్యాన్ని ఈ క్రింది విధంగా ప్రశంసించింది. “రాజీలేని విధంగా, నిర్భయంగా, తేలిక భాషలో సాహిత్య సృష్టి చేశారు. అవమానాలు, పరాభవాలు, అసూయ నిండిన సమాజంలో మహిళల వేదనను ప్రశంసాపూర్వకంగా చిత్రించారు. సాహిత్య రచన కూడా ఒక రాజకీయ కార్యక్రమమే. సామాజిక అసమానతల గురించి సాహిత్యం మన కళ్ళు తెరిపిస్తుంది. కాల్పనిక ముసుగులను చించివేసే కత్తిలా ఆమె భాషను ఉపయోగించారు”.

పుస్తక పరిచయం

# అమెరికా దేశపు బొగ్గుగని కార్మికుల పోరాటాన్ని చిత్రించిన నవల : "గోల్డ్స్‌బరో"

పరిచయకర్త : జి.వి. భద్రం

రచయిత : స్టెఫాన్ హైమ్

స్టెఫాన్ హైమ్ జర్మన్ అమెరికా ఆంగ్ల రచయిత. యూదు వ్యాపార కుటుంబానికి చెందినందున హిట్లర్ పాలనలో వున్న జర్మనీ నుంచి అమెరికాకు శరణార్థిగా వెళ్ళారు. అక్కడ కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా సాగిన మెకార్థీజం నుండి తప్పించుకుని తూర్పు జర్మనీకి వెళ్ళారు. అక్కడే 1952లో ఈ నవల పూర్తి చేశారు.

కొరియన్ యుద్ధ ప్రారంభదశలో హైమ్ అమెరికన్ పౌరసత్వాన్ని వదలుకొని, చనిపోయేవరకు తూర్పు జర్మనీలో నివసించారు. 'గోల్డ్స్‌బరో' నవల పెట్టుబడిదారీ విధానాన్ని విమర్శిస్తూ, సమ్మె చేస్తున్న కార్మికుల పక్షాన వుండటం వల్ల జర్మన్ డెమొక్రటిక్ రిపబ్లిక్ ప్రభుత్వం దీనిని ఆదరించింది. కాని ఆ తర్వాత ఆ ప్రభుత్వాన్ని విమర్శించినపుడు ఆయన పట్ల వ్యతిరేకత ప్రదర్శించింది.

హైమ్ అసలుపేరు హెల్మెట్ ఫ్లీగల్. ఆయన 10.04.1913న జన్మించి 16.12.2001లో గుండెపోటుతో మరణించారు. 1931లో మిలటరీ వ్యతిరేక కవిత రాసినందుకు పట్టణంలోని జిమ్నాయిజం నుండి బహిష్కరణకు గురయ్యారు. 1933లో రీచ్‌స్టాగ్ దహన సంఘటన తర్వాత జెకోస్లేవియాకు చేరి అక్కడ తన పేరు స్టెఫాన్ హైమ్‌గా మార్చుకున్నారు. అక్కడ ఎన్నో కలం పేర్లతో జర్మన్ వార్తాపత్రికలకు వ్యాసాలు రాశారు. 1936లో చికాగో విశ్వవిద్యాలయం నుండి డిగ్రీ పూర్తిచేశారు. 1937 నుండి 1939 వరకు అమెరికా కమ్యూనిస్టుపార్టీతో సన్నిహితంగా వుండే జర్మన్ భాషలోని ఒక వారపత్రికకు ప్రధాన సంపాదకునిగా వున్నారు.

పునరైక్యం చెందిన జర్మనీలో పెట్టుబడిదారీ విధానానికి ప్రత్యామ్నాయంగా సోషలిస్టు సమాజం కావాలన్నారు. 1994 ఫెడరల్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేశారు. 1994 నవంబరులో నూతన పార్లమెంటుకు సీనియారిటీ ప్రకారం ఛైర్మన్ అయ్యారు. అక్టోబరు 1995లో పార్లమెంటు సభ్యుల వేతనాలను పెంచే రాజ్యాంగ సవరణను వ్యతిరేకిస్తూ రాజీనామా చేశారు. ఆయన ఇంగ్లీషులో 11 నవలలు, జర్మన్ భాషలో 18 నవలలు, ఇంగ్లీషులో 2 వ్యాస సంపుటాలూ రచించాడు.

**ప్రపంచ** సాహిత్యాన్ని మొత్తంగా చూసినపుడు కార్మికుల – శ్రామికుల పోరాటాలకు చెందిన నవలలు చాలా తక్కువగా వున్నాయి. అందునా కార్మికుల జీవన స్థితిగతులకూ, నెలకొన్న రాజ్యవ్యవస్థకూ గల సంబంధం, పరస్పర ప్రభావం, సమాజంలో ఏర్పడే వివిధ సంబంధాల స్వరూపం, సాగే సాంస్కృతిక ఆచరణలూ, అభిప్రాయాలకు మధ్య గల సంబంధంలాటి విషయాలను తార్కికంగా చర్చించిన నవలలు మరీ అరుదుగా వున్నాయి. యిటువంటి విషయాలను చర్చించి, వాటిని కార్మికుల పోరాటానికి అన్వయించి, శాస్త్రీయ అవగాహనతో చిత్రీకరింపబడిన అత్యుత్తమ నవలగా, ప్రపంచమంతటా మాక్సిం గోర్కీ 'అమ్మ' నవల యిప్పటికీ పరిగణింపబడుతూనే వుంది. ఇంచుమించుగా అంతే శక్తిమంతంగా, శాస్త్రీయ అవగాహనతో అమెరికా దేశంలోని బొగ్గుగని కార్మికుల పోరాటాన్ని చిత్రించిన నవల యీ 'గోల్డ్స్‌బరో!' నవల.

## ప్రత్యక్ష క్షేత్ర పరిశీలన

ఈ నవలను వ్రాయటానికి రచయిత స్టీఫెన్ హైమ్, 1950వ సంవత్సరపు వేసవి కాలంలో పెన్‌సెల్వేనియా బొగ్గు గనులలో గడిపాడు. అతడు అక్కడ బొగ్గుగని కార్మికుల సమ్మె జరగటానికి ముందు సమ్మె జరిగిన తర్వాత కూడా వుండి ఆ ప్రాంత ప్రజలను, వారి మానసిక ఆందోళనలను కళ్ళారా చూసి అర్థం చేసుకొన్నాడు. అంతేకాక అతడు గని యజమానులతోనూ, గని ఇంజనీర్లతోనూ మాట్లాడాడు. గని కార్మికులతోనూ, వారి భార్యలతోనూ, బిడ్డలతోనూ, మాట్లాడి వారి మానసిక ఆందోళనలను, అభిప్రాయాలను అర్థం చేసుకొన్నాడు. స్వయంగా భూగర్భ గనులలోకి దిగి అక్కడి పని పరిస్థితులను కళ్ళారా చూశాడు. కార్మికుల బృందాలను కలసి వారు చెప్పే జీవిత కథలను విన్నాడు. సమ్మెను గురించి వారు చెప్పిన పలురకాల అభిప్రాయాలను విన్నాడు. అనంతరం ఆయన గోల్డ్స్‌బరో అనే బొగ్గుగనుల టౌన్‌ను కల్పించి, అందులోని బొగ్గుగని కార్మికుల పోరాటం యీ 'టౌన్' పరిసర ప్రాంతాలలో జరిగినట్లు తన ఈ నవలలో చిత్రీకరించాడు. అటువంటి 'గోల్డ్స్‌బరోలు' అమెరికా దేశం అంతటా పెన్‌సిల్వేనియా, ఒహాయో, వెస్ట్ వర్జీనియా, ఇల్లినాయిస్, కెంటకీ, ఆర్కాన్‌సాస్‌లలో వున్నాయి అన్నది రచయిత నిశ్చిత అభిప్రాయం 'గోల్డ్స్‌బరో'లో చిత్రించబడిన సామాజిక పొందిక అమెరికా దేశమంతటా వుందన్నది రచయిత నిర్ధారణ. కొన్ని అంశాలలో భిన్నంగా వున్నా నాటి (1952) అమెరికా దేశం

అనేక అంశాల్లో మౌలికంగా గోల్డ్‌బరోలాగే వుందన్నది స్టెఫాన్ హైమ్ అభిప్రాయం.

నాటి రష్యాలో విప్లవం సాగుతున్న కమ్యూనిస్టు పోరాటాల నేపథ్యంలో, కార్మికులు పోరాటానికి సమాయత్తమయ్యే, పోరాటంలో పాల్గొనే అంశాలను 'అమ్మ' నవలలో మాక్సిం గోర్కీ చిత్రించాడు. స్టెఫాన్ హైమ్, తన 'గోల్డ్‌బరో' నవలలో, ప్రజాస్వామ్య వ్యవస్థ పేరిట అమెరికాలో కార్మికుల శ్రమశక్తిని, రాజ్యాంగయంత్రం తోడ్పాటుతో పాలక వర్గమైన పెట్టుబడిదారీవర్గం, చట్టబద్ధత పేరిటనే దోచుకొనే నేపథ్యంలో, బొగ్గు కార్మికులు సమ్మె పోరాటాన్ని నిర్వహించిన వైనాన్ని చిత్రించారు. మెరుగైన పనిపరిస్థితులు, వేతనాల కోసం ప్రారంభించిన కార్మికుల పోరాటం, కాలక్రమంలో వ్యవస్థను మార్చే పోరాటంగా మారుతుందని (కార్మికవర్గం చేత మలచబడుతుందని) యీ నవల ద్వారా స్టెఫాన్ హైమ్ ఎంతో ప్రతిభావంతంగా పాఠకులకు తెలియబరిచారు.

స్టెఫాన్ హైమ్ జర్మనీలో జన్మించిన యూదుడు. హిట్లర్ నాజీ మూకలు యూదుల నరమేధాన్ని ప్రారంభించటంతో, స్టెఫాన్ హైమ్ జర్మనీ నుండి అమెరికాకు పారిపోయాడు. అమెరికా పౌరసత్వాన్ని తీసుకున్నాడు. అయితే 1952లో కొరియా యుద్ధం ప్రారంభమవటంతో, అమెరికా నుండి వెళ్ళిపోయాడు. తూర్పు జర్మనీలో స్థిరపడ్డాడు. ఆయన వ్రాసిన 'గోల్డ్‌బరో' నవల మొట్టమొదటిసారి డిసెంబర్ 1953లో లీప్‌జిగ్, (జర్మనీ)లో ప్రచురితమైంది.

**అమెరికా రాజకీయ సామాజిక వ్యవస్థ–కార్మిక పోరాటాలు :**

బొగ్గుగని కార్మికులు తమ జీవన పని పరిస్థితుల మెరుగు కోసం చేపట్టిన 'సమ్మె'ను గురించిన అంశమే యీ నవల ప్రధాన ఇతివృత్తంగా వున్నా, దానిని చిత్రీకరించే క్రమంలో స్టెఫాన్ హైమ్, అమెరికాకు చెందిన రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సామాజిక వ్యవస్థకు, రాజ్యాంగ యంత్రానికి చెందిన రూపాలను, వాటి స్వభావాలను విశదీకరించారు. ప్రజలు, కార్మికులు తమ స్వానుభవంతో ఆయా విషయాల గురించి అర్థం చేసుకొన్న అభిప్రాయాల రూపంలో ఈ నవలలో వాటిని చిత్రించారు. రచయితగా, తానుగా ఏ విషయాన్నీ నిర్వచించకుండానే, పాత్రల ద్వారా వాటిని వెల్లడించే టెక్నిక్‌ను రచయిత ఎంతో ప్రతిభావంతంగా ఉపయోగించారు.

ప్రజాస్వామ్యం, మహిళల స్థితి, జాతి వివక్షత, చట్టం – న్యాయం రూపాలలో శ్రమశక్తిని నిర్దాక్షిణ్యంగా దోచుకోవటాన్ని అనుమతించే పాలకవ్యవస్థ; ప్రభుత్వానికీ – దోపిడీదారులైన పెట్టుబడిదారులకూ ఊడిగం చేసేవిధంగా చట్టబద్ధ కార్మికసంఘాలను (సుస్థాపిత కార్మిక సంఘాలు), వాటి నాయత్వాలను మలచిన వైనం; న్యాయస్థానాలు న్యాయసూక్ష్మతల పేరిట, పాలకవర్గాల పక్షాన్నే కొమ్ముకాస్తున్న వైనం; తప్పనిసరి అయినప్పుడు కూడా అన్యాయ బాధితులకు న్యాయస్థానాలలో న్యాయం అందుబాటులోకి రాకుండా చేసే వైనం; మతం – మతాధికారులు రాజ్యాంగవ్యవస్థకు, దోపిడీపాలకవర్గాలకూ, వాటి అక్రమాలు – అన్యాయాలు – దోపిడీలకే మద్దతునిస్తున్న వివరం; కమ్యూనిస్టు బూచిని చూపిస్తూ, కమ్యూనిజం అంటే ఒక భయానకమైనదిగా, మహిళలను ప్రత్యేకించి క్రైస్తవమత సన్యాసినులను రేప్ చేసేవారిగా కమ్యూనిస్టు వ్యతిరేక దుష్ప్రచారం చేస్తూ అమెరికా దేశ 'ప్రజాస్వామ్య' పాలకులు ప్రజలను అనుక్షణం వంచిస్తూ, పాలన సాగిస్తున్న వివరాలను రచయిత కళ్ళకు గట్టినట్లు పాఠకుల ముందుంచారు.

కార్మిక పోరాటాలు ఎలా ప్రారంభించాలి, ఎలా కొనసాగించాలి, ఆయా సందర్భంలో ఎటువంటి ఎత్తుగడలను చేపట్టాలి, కార్మిక వ్యతిరేకుల పట్ల, వర్గశత్రువుపట్ల ఎటువంటి ఎత్తుగడలు అనుసరించాలి, కార్మికులకూ – రాజకీయాలకు మధ్య వున్న సంబంధం ఏమిటి, కార్మికుల సమ్మె పోరాటం, తక్షణం ఓడింపబడినా, అది దోపిడీవ్యవస్థ మార్పు కోసం జరిగే పోరాటంగా ఎలా మలుపు తిరుగుతుంది, అన్న విషయాలను, కార్మికులు అనుభవపూర్వకంగా తెలుసుకొన్న విషయాలను, శాస్త్రీయ కార్మిక సిద్ధాంత అవగాహనను సూక్ష్మంగా అర్థం చేసుకొనేవిధంగా, ఎంతో నైపుణ్యంతో యీ నవలలో రచయిత వివరించారు.

ఎటువంటి రాజకీయ నినాదాలు, సైద్ధాంతిక సూత్రాల ఉత్తేజకర భాషాప్రయోగాలు లేకుండానే, కార్మికవర్గ రాజకీయాలు – అవి విజయం సాధించాల్సిన ఆవశ్యకత, అనివార్యతలను గురించి, కార్మికుల – అట్టడుగు ప్రజల అనుభవ సారాంశంగా, స్టెఫాన్ హైమ్, అత్యంత ప్రతిభావంతంగా వర్గరాజకీయాల స్వభావ స్వరూపాలను యీ నవల ద్వారా పాఠకులకు అందచేశారు. కార్మికులకు తెలిసినా, తెలియకున్నా, వారికి యిష్టం వున్నా, లేకపోయినా వారి నిత్యజీవితం రాజకీయాలలో ఏ రకంగా భాగమైందో ఆయన చక్కగా అర్థమయేట్లు వివరించారు.

**బొగ్గుగనుల కార్మికులు జీవన చిత్రణ :**

అమెరికా దేశపు బొగ్గుగనుల్లో వివిధ దేశాల ప్రజల సంతతికి చెందినవారు పనిచేస్తున్నారు. పోలిష్ దేశస్థుల సంతతి వారు, నల్లజాతి నీగ్రోలు, ఆర్మీనియన్ సంతతివారు, హంగేరియన్లు, ఉక్రేనియన్లు, ఇటాలియన్లు, చైనీయులు, స్కాట్‌లాండ్‌వారు, ఐర్లాండువారు, వేల్సుకు చెందిన వెల్ష్ సంతతివారు పనిచేస్తున్నారు.

దేశమంతటా వున్న బొగ్గు గనుల్లో పనిచేసేవారు ఎటువంటి నియామక ఒప్పందం (కాంట్రాక్టు) లేకుండా పనిచేస్తున్నారు. జీవితాంతం యీ బొగ్గుగనులను త్రవ్వుతూ వృద్ధులైపోయినా వీరికి పెన్షను లభించదు. వీరికి ఒక సముచితమయిన కాంట్రాక్టు భద్రత పెన్షను లాంటి సదుపాయాలు అన్నవి దుర్లభమైన విషయాలు. వీరిని గని యజమాన్యాలు తమకు నచ్చినపుడు పని నుండి తొలగిస్తాయి. వీరికి మరొకచోట ఉద్యోగం లభించదు. తగినంత అర్హత వయస్సు వుండనందున ఇలా తొలగించిన చాలామంది పెన్షన్ పొందటానికి అర్హులు కారు. కొందరి కార్మికులకయితే గని యజమాన్యం వారంలోని ఏడురోజులూ పని యివ్వదు. కొందరు వారానికి రెండు, మూడు రోజులే పని ఇస్తారు. గని యజమాన్యమే, చౌక రకం యిళ్ళు కట్టించి, వాయిదాల పద్ధతిపై కార్మికులకు కట్టబెడ్తుంది. ఏ కారణం చేతనైనా కార్మికులు పూర్తిగా పనిచేసి కూలి సంపాదించలేకపోతే, వాయిదాలు కట్టలేకపోతే, ఆ యింటినీ, ఫర్నిచరునీ, వాయిదాలకు అమ్మిన కంపెనీవాళ్ళే తిరిగి తీసుకుపోతారు.

గనిలో పనిచేసే కార్మికులకు, యాంత్రీకరణ వలన ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదపు కత్తి, నిరంతరం వారి తలపై వ్రేలాడుతూనే వుంటుంది. నియామక ఒప్పందాలు లేనందువలన కార్మికులకు పోరాడే హక్కు లేదు.

గని కార్మికులు – యజమాన్యాలు కట్టించి, వాయిదాల పద్ధతిపైన అమ్మిన యిండ్లలోనైనా నివసిస్తారు. లేదా మారుమూల ప్రాంతాల్లో గుడిసెల్లాటి యిళ్ళు కట్టుకొని నివసిస్తారు. పరిశుభ్రత లేని మురికివీధుల్లో అనారోగ్యాలతో బాధపడుతూ కార్మికులూ, కార్మికుల కుటుంబాలు నివసిస్తుంటాయి. మున్సిపాలిటీలు వున్నా యీ గని కార్మికుల నివాస ప్రాంతాల పరిశుభ్రత, ఆరోగ్య సదుపాయాల గురించి పట్టించుకోవు. పన్నులు మాత్రం వసూలు చేస్తాయి.

గనుల్లో పనిచేసే కార్మికులు, తరతరాలుగా గనుల్లో పనిచేస్తున్నారు. పది సంవత్సరాల వయస్సు నుండీ, గనుల త్రవ్వకపు పనిని నేర్చుకొంటూ, బొగ్గుగని కార్మికులుగా కొనసాగుతారు. వీరిలో అత్యధికులు చదువుకొన్నవారు కాదు. ఇతర ప్రాంతాలను ఎరిగున్నవారు కూడా కాదు. తరతరాలుగా వీరు, వీరి కుటుంబాలవారూ గనుల పరిసర ప్రాంతాలలోనే జీవితాలను వెళ్ళమారుస్తుంటారు.

గని కార్మికులలో ఎక్కువమంది త్రాగుడు, జూదంలాటి వ్యసనాలకు బానిసలయినవారే. పనిభారం వలన పడ్డ కష్టాన్ని, భద్రతలేని పని మూలకంగా అనుభవిస్తున్న బాధలను మరచిపోవటం కోసం గని కార్మికులు యీ త్రాగుడు వ్యసనానికి బలవుతున్నారు.

త్రాగి ఎప్పుడో అర్ధరాత్రి యింటికి వచ్చి, భార్యలతోనో, పిల్లలతోనో తగాదా పెట్టుకొని, భార్యలను కొట్టడం, వేధించటం అన్నది గని కార్మికుల కుటుంబాలలో సర్వసాధారణ విషయం. ఊరంతకీ లోకువయి, చులకనగా చూడబడే గని కార్మికుడికి, భార్య చులకన. సమాజంపై తనకున్న ద్వేషాన్నంతా భార్యపై ప్రతాపం చూపించి కసితీర్చుకొంటాడు. ప్రతి గని కార్మికుడూ ఏడెనిమిదిమంది పిల్లల్ని కంటాడు. ఈ పిల్లల్ని సక్రమంగా పెంచలేక, వారికి సరయిన తిండి పెట్టడం కోసం, వారి ఆరోగ్య సంరక్షణ కోసం, గని కార్మిక కుటుంబాల మహిళలు పడే యాతనలు వర్ణించ అసాధ్యం. గని కార్మిక కుటుంబాల మహిళలు కూడా పీడితులే, ఎనలేని బాధలను అనుభవిస్తున్నవారే!

బొగ్గు బావిలోకి దిగిన కార్మికునికి పనిభారంతోపాటు, అనుక్షణం ప్రాణప్రమాదం పొంచి వుంటుంది. ఎప్పుడు గని పైకప్పు కూలిపోతుందో, ఏ క్షణంలో విషవాయువులు చుట్టుముడతాయోననే అభద్రత నడుమ, గని కార్మికుడు ప్రాణాలను ఉగ్గబట్టుకొని పనిచేస్తూ వుండాలి. గని కప్పు కూలకుండా బలమైన స్తంబాలతో నిలబెట్టి భద్రతా ఏర్పాటు చేయటం వలన ఎక్కువ ఖర్చవుతుందనే కారణం చేత, గని యజమాన్యాలు అందుకు పూనుకోవు. తేలికపాటి, ఖర్చులేని చట్టవిరుద్ధమైన గాంబ్లింగ్ పద్ధతి అనుసరిస్తాయి. పేలుడు అనంతరం క్రిందపడి, కుదురుకున్న బొగ్గును తవ్వి, తీయించే పద్ధతి అనుసరిస్తారు. ఈ పద్ధతి వల్ల బొగ్గుపెళ్ళలు, బొగ్గు పొరతో కూడిన పైకప్పులు కూలి కార్మికులు ప్రమాదం బారినపడి మరణిస్తారు లేదా గాయపడతారు. గనుల్లో త్రవ్వి ఖాళీగా వున్న ప్రాంతాలకు నీరు ప్రవహించి, కార్మికులు ప్రమాదాల బారిన పడతారు. గనిలోకి ప్రవేశించే నీటిని బయటకు పైపుల ద్వారా తోడే ఏర్పాట్లు ఖర్చుతో కూడినవిగాబట్టి, అందుకోసం యజమాన్యాలు ఖర్చుబెట్టి, తమ లాభాలను తగ్గించుకోవు.

అమెరికా దేశంలో నీగ్రోల బానిసత్వ నిర్మూలన జరిగి, వారికి సమానత్వం యిచ్చారు అని చెపుతున్నా, నల్లజాతి నీగ్రోలపట్ల జాతివివక్షత, నల్లజాతి విద్వేషాలు సమాజంలోనూ, పాలనావ్యవస్థలోనూ అదేవిధంగా కొనసాగుతున్నాయి. కార్మికులలో సహితం యీ జాతివివక్షత జాతి విద్వేష భావాలు అదేవిధంగా నెలకొని వున్నాయి. గని కార్మికులలోనూ ఇవి వ్యక్తమయ్యాయి.

నల్లజాతి నీగ్రో కార్మికుల ప్రక్కన పనిచేయటానికి, తెల్లజాతి కార్మికులు (వారు ఏ దేశసంతతివారైనా) కొందరు అసహ్యించుకొంటారు. వ్యతిరేకిస్తారు. నల్లజాతివారి చర్చిలు సహితం, ఊరికి దూరంగా తెల్లజాతివారు కాలుబెట్టడానికి కూడా యిష్టపడని ప్రాంతాల్లో, నీగ్రోలే తమకు తాము ఏర్పాటు చేసుకొంటారు. చర్చి పూజారులు కూడా నీగ్రోలే వుండి, అష్టకష్టాలకు, అవమానాలకు గురి అవుతున్న నీగ్రోలకు మతపరమైన ఊరట కలిగిస్తూ వుంటారు. ప్రతి ఆదివారం మత సమావేశం నిర్వహించి, క్రైస్తవ ఆధ్యాత్మిక బోధనలు చేస్తారు.

అమెరికా తన సైన్యంలోకి నీగ్రోలను నియమించుకొన్నా వారిని నీచ సేవకులుగా అంటే దాసి పనిలాంటి బట్టలుతకటం, పాత్రలు తోమటం లాంటి పనులకు వినియోగించుకొంటారు. ఒకవేళ ప్రతిభ కారణంగా నీగ్రోలు మంచి సైనికులైనా, వారిని తెల్ల సైనికులు యుద్ధం చేయటానికి యిష్టపడని ప్రాంతాలకు యుద్ధం చేయించేందుకు పంపుతారు.

**కార్మికసంఘాలు :**

గని కార్మికుల కోసం చట్టబద్ధమయిన సంఘాలుంటాయి. స్థానిక యూనియన్, ఆపైన జిల్లా యూనియన్, ఆపైన వాషింగ్టన్‌లో కేంద్ర యూనియన్‌ల నిర్మాణ రూపంలో గని కార్మికుల యూనియన్ వుంది. అయితే యీ యూనియన్ నాయకత్వం ఒక పరిపాలనాధికారుల బృందం మాదిరిగా యూనియన్ కార్యకలాపాలను నిర్వహిస్తుంది. కార్మికుల అభిప్రాయాలు, ఆకాంక్షలు, ప్రయోజనాల ప్రాతిపదికగా కాక కేంద్ర యూనియన్ నాయకత్వం చెప్పినట్టూ, జిల్లా యూనియన్ చెప్పినట్టు స్థానిక యూనియన్ పనిచేయాలి. కార్మికసంఘ నాయకులకు మాత్రం యూనియన్ మంచి వేతనాలను అలవెన్సులను, సదుపాయాలను కల్పిస్తుంది. యూనియన్‌కు మంచి ఆఫీసులుంటాయి; ఆఫీసర్లూ, జీతం తీసుకునే సలహాదార్లు వుంటారు. వాషింగ్టన్‌లోని యూనియన్ నాయకత్వం నిరంతరం అధికారులతోనూ, గని యజమానులతోనూ, ప్రభుత్వంతోనూ సంప్రదింపులు జరుపుతూనో సమావేశాలలో పాల్గొనటం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తూనో వుంటుంది. యూనియన్ భారీ ఎత్తున చందాలు ప్రోగుచేస్తుంది. సమ్మె కోసం నిధి కూడా నెలనెలా కార్మికుల నుండి ప్రోగుచేసి బ్యాంకుల్లో నిలువ వేస్తుంది. కానీ సమ్మె చేయాలన్నా అందుకు కేంద్ర యూనియన్ అంగీకారం కావాలి! అందుకు అంగీకారం లేకపోతే కార్మికుల సమ్మె చట్టబద్ధం కాదు.

మరోవైపు చట్టబద్ధమైన సమ్మె జరపాలంటే, వివిధ స్థాయిల్లో ఓటింగ్ జరపాలి, యజమాన్యాలకీ, ప్రభుత్వానికీ చాలాకాలం ముందుగానే నోటీసులు యివ్వాలి. ప్రభుత్వం నుండి అనుమతి సంపాదించాలి. అప్పుడే చట్టబద్ధంగా సమ్మె చేయటం సాధ్యమవుతుంది. ఆరకంగా జరిగే సమ్మెకు, ప్రోగుచేసిన సమ్మె నిధి నుండి, సమ్మె కాలమంతటా యూనియన్ అలవెన్సు చెల్లిస్తుంది. అయితే చట్టబద్ధమైన సమ్మె అనేది చాలా అరుదుగా జరుగుతుంది. కార్మికుల అవసరంమేరకు చట్టబద్ధ

సమ్మె చేయటం దుస్సాధ్యం. చట్టప్రకారం కాక, ఆకస్మికంగా సమ్మె చేస్తే, ఆ కార్మికులకు సమ్మె నిధి నుండి అలవెన్సులు యివ్వ వీలు లేకుండా కోర్టులు ఆ నిధులపై స్టే విధిస్తాయి. యూనియన్ నాయకత్వం అటువంటి సమ్మెలను అంగీకరించదు. తక్షణం అటువంటి సమ్మెను ఆపుజేయమని తాఖీదులిస్తుంది. ఆ సమ్మె చేస్తున్న కార్మికుల అతీ, గతీ పట్టించుకోకపోగా, అటువంటి సమ్మెను ఎలా ఆపుచేయించాలా, ఏ రకంగా ఓడించాలా అనే ప్రయత్నాలను నిస్సిగ్గుగా బాహాటంగానే చేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే, యూనియన్ నాయకులు, నిరంకుశ అధికారులుగానూ, కార్మిక దొరలుగానూ వ్యవహరిస్తారు. శుష్కమైన వాగ్దానాలతో, ఆకర్షణీయమైన ఉపన్యాసాలతో కార్మికులను ఆకర్షించుకొంటూ, యజమాన్యాల – ప్రభుత్వాల మెచ్చుకోలుకూ వారి ప్రాపకం కోసం పాటుబడుతూ వుంటారు. సంఘం తన ప్రాథమిక లక్ష్యమైన కార్మికుల ప్రయోజన పరిరక్షణ అన్నదాన్ని ఉద్దేశపూర్వకంగా విస్మరించి, కొనసాగుతూ వుంటుంది.

ఇక ప్రభుత్వ, యాజమాన్య వర్గాలైతే తమ విధానాలను కార్మికులు ప్రశ్నించినా, చాలాకాలంగా పేరుకుపోయి, పరిష్కరింపబడని తమ మవులిక, ప్రాథమిక సమస్యల పరిష్కారానికి గత్యంతరం లేక చట్ట అనుమతి లేకుండా సమ్మెకు దిగినా, వారిని దేశ ద్రోహులుగానూ, నేరస్తులుగా చిత్రీకరిస్తారు. వారికి దేశ ప్రయోజనం పట్ల, ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం లేదనీ, వారు దుర్మార్గులైన, స్త్రీ హంతకులైన కమ్యూనిస్టులని నిందిస్తూ ప్రచారం చేస్తారు. వారు దేశాన్ని కమ్యూనిస్టులకు అప్పగించుతారనీ, వారు కమ్యూనిస్టు ఏజంట్లు అనీ ప్రచారం చేస్తారు. వారిని ప్రజలందరూ బహిష్కరించాలనీ, వారితో ఎటువంటి సంబంధాలు పెట్టుకోవద్దనీ ప్రచారం చేస్తారు. పోలీసులు వారిని రకరకాల వేధింపులకు గురిచేస్తారు. యజమాన్యాలు సమ్మె విచ్ఛిన్నానికి కుట్రలు పన్నుతారు. సమ్మెకు నాయకత్వం వహించేవారిపై గూండాలచేత భౌతికదాడులు చేయిస్తారు. అక్రమ అరెస్టులు చేయిస్తారు. వారిని దేశద్రోహులుగానూ, క్రూరమైన కమ్యూనిస్టులుగానూ చిత్రిస్తూ, వారిపై అనేక నిందలు ప్రచారం చేస్తూ, వారిని సమాజం నుండి వేరుచేసి, వెలివేసేటట్లు చేస్తారు.

మొత్తం వ్యవస్థను నిర్వహించే పాలకులు అందరూ కమ్యూనిస్టు భూతాన్ని – ప్రమాదాన్ని చూపించి, కార్మికుల సమ్మెను ఓడించి, కార్మికుల శ్రమశక్తిని దోపిడీ చేసుకొంటున్న యాజమాన్యాలను, వారి దోపిడీని యథేచ్ఛగా కొనసాగించేందుకు వీలు కల్పిస్తారు. న్యాయస్థానాలు కూడా పైకి ఎన్నెన్ని ధర్మపన్నాలు వల్లించినా, పాలకవ్యవస్థను కాపాడే విధంగానే వుంటాయి.

అమెరికాలో ఎక్కువమంది ప్రజలు రోమన్ కేథలిక్ శాఖకు చెందిన క్రిస్టియన్ మతంవారే!. వీరి మతాధిపతి పోప్ లేదా బిషప్‌ల ద్వారా నియమించబడ్డ మతాధికారులు లేదా పూజారులు, నిరంతరం ప్రజలకు, ఈ లోకంలో వారు చేసే 'పాపాల' గురించి హెచ్చరిస్తూ, వారు పరలోకంలో పొందే 'సుఖాల' గురించే బోధిస్తూ వుంటారు. గని కార్మికులతో సహా ప్రజలందరూ చట్టాలను పాటించాలనీ, ప్రభుత్వాన్ని, జీవనోపాధి కల్పించిన యజమానులను గౌరవించాలని బోధిస్తూ, వ్యవస్థను ప్రశ్నించినా, తమ హక్కుల కోసం పోరాడినా అది దైవ ద్రోహమనీ, కమ్యూనిస్టులను ముష్కరులంటూ నిందిస్తూ వారికి వ్యతిరేకంగా ప్రజలను ఉసికొల్పుతారు. సమ్మె చేసేవారికి ప్రజల నుండి మద్దతు అందకుండా, సమ్మెలను ఓడించే పలురకాల కుట్రలలో పాల్గొంటారు. హింస చేయరాదంటూ, తమపై జరిగే హింసను దాడులను ప్రతిఘటించే కార్మికులు హింసకు పాల్పడుతున్న వారిగా చిత్రీకరిస్తూ, సమ్మెను విచ్ఛిన్నం చేయటానికి తమకు చేతనయినంత మేరకు కృషి చేస్తూ, ప్రభుత్వాల, పాలకుల, పాలకవర్గాల, దోపిడీ పెట్టుబడిదారీ యజమాన్యాల కొమ్ముకాస్తారు. సమ్మెను విరమించాలని బోధిస్తారు.

ఆ రకంగా పాలకులు, పాలకవర్గాలు, పాలక ప్రభుత్వాలు అమెరికన్ ప్రజలను 'ప్రజాస్వామ్యం' అనబడే ఒక భ్రమలో నిరంతరం అనేక మాయోపాయాల ద్వారా, నిలబెడుతూ, 'కమ్యూనిస్టు' భూతం పట్ల అసహ్యాన్నీ, భయాన్నీ, వ్యతిరేకతనూ కట్టుకథలతో పెంచుతూ, పారిశ్రామిక కార్మికుల, గని కార్మికుల శ్రమశక్తిని చట్టబద్ధంగా దోపిడీచేస్తూ, ఆ దోపిడీ వ్యవస్థను పరిరక్షిస్తూ, పాలన కొనసాగిస్తున్న నేపథ్యంలో 1950లలో జరిగినట్లుగా యీ గని కార్మికుల సమ్మె పోరాట చరిత్రను, మన కళ్ళముందు చిత్రించారు. స్టెఫాన్ హైమ్ తన 'గోల్డ్సబరో' నవలలో.

## నవల కథాసంగ్రహం :

గోల్డ్సబరో పట్టణ పరిసర ప్రాంతాలలో బొగ్గు గనులుంటాయి. ఈ బొగ్గు గనుల్లో ప్రధాన వాటాదారు జడ్జి ప్రిట్‌షెట్. ఆ పట్టణాన్ని పాలించే పాలనాయంత్రాంగంలో మేయర్ పర్డీ, పోలీసు ప్రధానాధికారి, ఉన్నతాధికారి అయిన బోడెన్ హామర్, న్యాయమూర్తి జడ్జి ప్రిట్‌షెట్, సిటీ క్లర్కు (మున్సిపల్ కమీషనర్ లాంటి అధికారి) జియోఘన్, మున్సిపల్ కౌన్సిలర్లు పాలనాధికారులు. వీరికి సమర్థకులుగా బొగ్గుగని కార్మిక సంఘ నాయకులు, పత్రికలుంటాయి.

కార్మికులు కానీ, పౌరులు కానీ ఎవరైనా తమకు సదుపాయాలు మెరుగుపరచమని అడిగినా, సంస్కరణలు కోరినా, కార్మికులు తమ పనిభద్రత, పెన్షన్‌లను అడిగినా, యీ పాలనాయంత్రాంగం వారిపై దాడిచేసి వారిని అణచివేస్తుంది. సిటీ క్లర్కు జియోఘన్‌కు చెందిన గూండాలు వారిపై భౌతికదాడులకు పాల్పడి భయభ్రాంతులకు గురిచేస్తుంటారు.

ముఖ్యంగా గని కార్మికులకు నియామక ఒప్పందం (కాంట్రాక్టు) జరగదు. అందువలన వారికి ఏ హక్కూ వుండదు. వారికి కార్మిక సంఘమున్నప్పటికీ, దానికి కార్మికులు క్రమబద్ధంగా సభ్యత్వ చందాలు కడ్తున్నా, సమ్మె నిధికి చెల్లింపులు చేస్తున్నా, యూనియన్ నాయకత్వం అంగీకరిస్తే తప్ప, చట్టపరంగా ఆరు నెలలు ముందుగా నోటీసులు యిచ్చి సమ్మె ఓట్ల తతంగం జరిపేదాకా వారు సమ్మె చేసే వీలు వుండదు. అలా చేస్తే అది చట్టవిరుద్ధ సమ్మెగా పరిగణించబడుతుంది. సమ్మెనిధిని ప్రభుత్వం కోర్టుల ద్వారా నిలుపుదల చేసి, కార్మికులకు ఆ సదుపాయం అందకుండా చేస్తుంది.

నియామక ఒప్పందం లేకపోవటం వలన బొగ్గుగని కార్మికులు దారుణమైన పని పరిస్థితులు, దుర్భరమైన జీవన పరిస్థితులూ అనుభవిస్తూ జీవచ్ఛవాల మాదిరి బ్రతుకులీడుస్తుంటారు. వారికి వారంలో అన్ని రోజులూ పని దొరకదు. దొరికే జీతం వారు వాయిదాల పద్ధతిపై కొనుక్కొన్న వస్తువులకూ, ఫర్నిచర్‌కూ, ఇండ్లకూ వాయిదాలు

కట్టడానికే సరిపోతుంటుంది. ఒకరకంగా చెప్పాలంటే యీ వాయిదాలు కట్టడానికే వారు బొగ్గుగని కార్మికులుగా పనిచేస్తున్నట్లూ, పనికి కట్టుబానిసలు అయినట్లూ అన్పిస్తుంది. గని కార్మికులు చదువుకొన్నవారు కాదు. చిన్నతనం నుండే యీ పనిలో ప్రవేశించినవారు. దారుణ జీవన, పని పరిస్థితుల వలన కృంగిపోయిన బొగ్గుగని కార్మికులు త్రాగుడు లాంటి వ్యసనాలకు అలవాటుపడి, మొరటు మనుష్యులుగా తయారవుతారు. తమకు గల కోపాన్నంతటినీ భార్యాబిడ్డలమీద చూపిస్తూ వారికి కంటకంగా తయారవుతారు.

గని యాజమాన్యం తన యిష్టానుసారం వీరిని పని నుండి తొలగిస్తుంటుంది. అందువలన వీరికి మరొక ఉద్యోగం దొరకదు. తగినంత సర్వీసు కాలం లేక వీరు పెన్షన్ పొందేందుకు కూడా అర్హులు కారు. వీరి జీవితాలు గాల్లో దీపాలు మాదిరిగా వుంటాయి. యజమాన్యం కొత్త యంత్రం ప్రవేశపెట్టినప్పుడల్లా కొందరు సీనియర్ కార్మికులను పని నుండి తొలగిస్తుంది. జూనియర్లయితే యంత్రాల సాంకేతికతను బాగా అర్థం చేసుకొని, బాగా ఉత్పత్తిని చేస్తారన్నది యజమాన్యం చూపించే కారణంగా వుంటుంది.

## సమ్మెకు కారణం :

ఇటువంటి నేపథ్యంలో ఒకరోజున గని యజమాన్యం, ఆ గని మొదలుపెట్టిన నాటి నుండీ పనిచేస్తున్న సీనియర్ కార్మికులైన జామిసన్ అనే నీగ్రో కార్మికుడినీ, బైలిక్ అనే పోలిష్ జాతి కార్మికుడ్నీ పనిలో నుండి తీసివేస్తుంది. వీరి తోటి కార్మికులైన అమెరికన్ జాతి కార్మికుడు కెన్నడీ, యువ కార్మికుడు పీటర్ వెబ్, తాలిషాన్ మొదలైన కార్మికులు తమ స్థానిక యూనియన్ నాయకుడైన, సంఘాధ్యక్షుడైన మెర్కాడాంటేతో తొలగించిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకొనేటట్లుగా చేయమని కోరుతారు. అందుకు అతడు, 'కొత్త యంత్రాన్ని ప్రవేశపెట్టినప్పుడల్లా, యిలా కొందరు కార్మికులను తొలగించటం మామూలే కదా! అందువల్ల యీ విషయంలో యూనియన్ ఏం చేయలేదు" అని చెప్పాడు. దీనితో ఆగ్రహం చెందిన కార్మికులు వెంటనే తాము విధులను బహిష్కరిస్తున్నట్టు ప్రకటించి ఆకస్మిక సమ్మెకు దిగుతారు. విధిలేక వారితోపాటే సంఘ నాయకుడూ సమ్మెలో చేరతాడు. సాయంత్రం సమ్మె జరగటానికి కార్మికుల ఓటు తీసుకొందామని నిర్ణయిస్తాడు.

కార్మికులు చేస్తున్న యీ ఆకస్మిక సమ్మె, యూనియన్ ధిక్కరణగా భావించిన జిల్లా యూనియన్ ప్రతినిధి లాన్స్‌డేల్ (అతడు ఒకప్పుడు స్థానిక యూనియన్ అధ్యక్షుడు), తెలివితేటలతో యీ సమ్మెను ఆపాలని, మెర్కాడాంటేకు చెప్పి, సమ్మెపై ఓటింగ్‌కు ఒకరోజు పాటు వాయిదా వేస్తే, ఆవేశం తగ్గిన కార్మికులు సమ్మెను "వద్దంటూ" ఓటు వేస్తారని చెప్పి, సమ్మెపై ఓటు వేయటాన్ని ఒకరోజు వాయిదా వేయిస్తాడు. యీ కార్మిక సంఘ నాయకులు, తమ అనుయాయులను ఒప్పించి సమ్మెకు వ్యతిరేకంగా ఓటు వేయటానికి సంసిద్ధం చేస్తారు. మర్నాడు జరిపిన సంఘ సమావేశంలో, కార్మిక సంఘ నాయకులు సమ్మె ఏ రకంగా చట్టవిరుద్ధమైనదో చెప్పిన వివరణలు విన్నాక, సమ్మె చేయటానికి వ్యతిరేకంగా మెజార్టీ నాయకులు ఓటు వేస్తారు. దాంతో సమ్మె ఆపివేయబడుతుంది. కార్మికులు యథాప్రకారం విధులకు హాజరవుతారు.

★ ★ ★

సమ్మె ఆగిపోయినా, కార్మికులలో వున్న అసంతృప్తినీ, తమ హక్కుల కోసం పోరాడాలి అని వుండేవారి పట్టుదల పెరుగుతూండటాన్ని గమనించిన పాలనాయంత్రాంగంలో ముఖ్యుడైన సిటీ క్లర్కు జియోఘన్ ఒకవైపు గని కార్మికులను సమ్మెలోకి దిగకుండా, కార్మికసంఘ నాయకుల ద్వారా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తూనే, మరోవైపు ఒకవేళ సమ్మె జరిగుతే, బొగ్గు సరఫరాను చేపట్టి లాభం సంపాదించటం కోసం పథకాన్ని సిద్ధం చేసుకొని, అమలులో పెడతాడు. భూగర్భగనులు ఉత్పత్తి లేకుండా ఆగిపోయినా, భూమిపై పొరల నుండి లభించే పైపొరలలో వున్న నాసిరకం బొగ్గును త్రవ్వి, బొగ్గు సరఫరా చేయటమన్నది, యీ పథకం యొక్క లక్ష్యం. దీన్నే స్ట్రిప్ మైనింగ్ అంటారు. స్ట్రిప్ మైనింగ్ ద్వారా బొగ్గును త్రవ్వి, సరఫరా చేయటానికి వీలున్న ప్రదేశాలన్నింటినీ, తన అనుయాయుల ద్వారా తన స్వాధీనంలోకి తెచ్చుకొంటాడు.

## సమ్మె ప్రారంభం :

ఇంతలో సబీనా బొగ్గుగనిలోని ఐదు వేలమంది కార్మికులు నియామక ఒప్పందం కోసం సమ్మెలోకి దిగినట్లు తెల్పుతూ, తమ సమ్మెకు సహకరించాల్సిందిగా కోరుతూ దేశంలోని అన్ని బొగ్గు గనులకూ తమ ప్రతినిధులను పంపుతారు. అదేవిధంగా ఫ్రిట్‌షెట్ గనుల కార్మికుల వద్దకు గోల్డుబరోలోని బొగ్గుగని కార్మికుల వద్దకు కూడా ప్రతినిధులు వస్తారు. సబీనాలోని స్థానిక యూనియన్ చేసిన యీ నిర్ణయాన్ని జిల్లా, కేంద్ర యూనియన్ నాయకత్వాలు వ్యతిరేకించలేవు. అందువలన వారి సమ్మెపైనే దేశమంతటి బొగ్గు గనుల్లోని కార్మికుల పనిపరిస్థితుల నిర్ణయం ఆధారపడి వుంది. ఈ విషయాన్ని ఎరిగున్న కెన్నడీ, పీటర్ వెబ్ లాంటి కార్మికులు తామూ సమ్మెలోకి దిగుతున్నట్లు ప్రకటించటంతో, గోల్డుబరోలోని బొగ్గుగనిలో కూడా సమ్మె మొదలై, అక్కడి బొగ్గు ఉత్పత్తి కూడా నిలిచిపోతుంది.

గోల్డుబరోలోని సమ్మెను ఆపివేయాల్సిందిగా కేంద్ర కార్మిక సంఘం టెలిగ్రాం ద్వారా ఆదేశించినా జిల్లా, స్థానిక యూనియన్ నాయకులకు ఆవిధంగా సమ్మెను ఆపటం కుదరలేదు. కాకపోతే యిది యూనియన్ పిలుపిచ్చిన సమ్మెకాదు కాబట్టి, సమ్మె నిధి నుంచి అందాల్సిన సమ్మె సహాయ సదుపాయం (వారానికోసారి అందే ఆర్థిక సహాయం) వీరికి అందదు. సమ్మె చేస్తున్న కార్మికులే తమ ఏర్పాట్లు తాము చేసుకోవాలి!.

కార్మికులందరినీ ప్రతిరోజూ ఏదో ఒక కార్యక్రమంలో యిముడ్చుకొని పని చేయించకపోతే వారు సమ్మెను తేలికగా తీసుకొని జారిపోతారు. అందువలన కెనడీ నాయకత్వంలో కార్యక్రమాలను నిర్వహించటానికి కార్మికులు తీర్మానించుకొంటారు. తమ కార్యక్రమాలను నిర్వహించటానికి, యితర బొగ్గు గనుల్లో సమ్మె చేస్తున్న కార్మికులతో సంప్రదింపులు జరపటానికి వీలుగా ఒక కార్యాలయం ఏర్పాటు చేసుకొంటారు. అనుభవం గల కార్మికులైన బైలిక్, జామిసన్ తదితరులుతోపాటు యితరులు సమస్యలను ఎప్పటికప్పుడు చర్చించి సమష్టి నిర్ణయాలు తీసుకొంటుంటారు.

ఈ క్రమంలో ఒకరోజున పీటర్ వెబ్ లారీల్లో బొగ్గును పిట్స్‌బర్గ్ వేపు తరలించుకుపోవటాన్ని చూసి, వెంటనే కెన్నడీ తదితరులకు

తెలియజేస్తాడు. ఆ బొగ్గు స్ట్రిప్ మైన్స్ నుండి రవాణా అవుతున్నట్లు వారు అర్థం చేసుకొంటారు. దేశమంతటా సమ్మె జరిపి బొగ్గు ఉత్పత్తి నిలిపివేసిన సమయంలో బొగ్గును త్రవ్వి, సరఫరా చేస్తే, సమ్మెను వమ్ము చేస్తున్నట్టుగా, అది సమ్మె విచ్ఛిన్న కార్యకలాపంగా వారు గుర్తించి వెంటనే ఆ రవాణాను ఆపివేయాలని నిర్ణయిస్తారు. ఆ ప్రకారం కెనడీ నాయకత్వాన కొందరు కార్మికులు ఒక దళంగా వెళ్ళి రవాణా జరుపుతున్న బొగ్గు లారీలను ఆపి, లారీల నుండి బొగ్గును నేలపైకి దింపివేస్తారు. చుట్టుప్రక్కల వున్న ప్రజలను పిలిచి, ఎవరికి కావల్సినంత బొగ్గును వారు యిళ్ళకు తీసుకుపోవచ్చునని చెప్పి, క్రింద పారపోసిన బొగ్గును వారికి యిస్తారు.

అయితే యిలా రవాణాను ఎవరు ఆపుతున్నదీ పోలీసులు గుర్తుపట్ట వీలులేకుండా, యితర బొగ్గు గని కార్మికులతోనూ దళాలు ఏర్పరచి, ఒక ప్రాంతపు దళాలు మరో ప్రాంతంలో సాగే బొగ్గు రవాణాను ఆపివేసే ఏర్పాటు చేసి, ఆ రకంగా బొగ్గు రవాణా కాకుండా అడ్డుకొంటుంటారు.

ఇలాంటి సందర్భంలో ఒకసారి దళంపై బొగ్గు లారీలలో వున్న గూండాలు తుపాకీ కాల్పులు జరపటంతో, దళ సభ్యుడైన జామిసన్ భుజానికి తూటా తగిలి గాయపడతాడు. అప్పటి నుండి కార్మికుల దళాలు కూడా తమకు అందుబాటులో వున్న ఆయుధాలు – తుపాకీలు, షార్ట్‌గన్‌లు, బేస్‌బాల్ బ్యాట్లు లాంటివి తమతో తీసుకుపోతూ ఆత్మరక్షణ చేసుకొంటుంటారు.

## సమ్మె చేస్తున్న కార్మికుల కుటుంబాలకు సహాయ చర్యలు:

సమ్మె చాలా రోజులు సాగటంతో, గని కార్మికుల యిళ్ళలో ఆహార పదార్థాలు నిండుకొన్నాయి. తిరిగి వాటిని కొనుగోలు చేసుకోలేక, గని కార్మికుల కుటుంబాలలోని స్త్రీలూ, పిల్లలూ ఓట్స్ గంజి తాగుతూ కాలం గడుపుతుంటారు.

కార్యకలాపాలు నిర్వహించటానికి అవసరమైన డబ్బులేక ఏం చేయాలో అర్థంకాని పరిస్థితుల్లో తమకు ఎటూ యూనియనూ ధనవంతులూ, పాలక యంత్రానికి చెందినవాళ్ళూ సహాయం చేయరు కనుక, సాధారణ ప్రజల నుండే సమ్మెకు సహాయంగా చందాలను ప్రోగు చేయాలని నిర్ణయిస్తారు. తదనుగుణంగా కార్మికుల నుండే ప్రతినిధులను ఎన్నుకొని, గని కార్మికుల సహాయ కమిటీని ఏర్పాటు చేసుకొంటారు. జామిసన్‌ను ఆ కమిటీకి అధ్యక్షుడిగా ఎన్నుకొంటారు.

సహాయ కమిటీ సభ్యులు పట్టణంలో చందాలు ప్రోగుచేయటానికి ప్రయత్నం చేస్తున్నప్పుడు, వారిని పోలీసులు అడ్డుకొంటారు. వ్యాపారస్తులు, ధనవంతులు వారికి చందాలు యివ్వటానికి నిరాకరిస్తారు. అయినా సాధారణ పౌరులు సమ్మె చేస్తున్న కార్మికుల సహాయ కమిటీకి తమకు తోచిన మొత్తాలను యిస్తారు.

ఈ స్వల్ప మొత్తాలు కార్యకలాపాల నిర్వహణకే సరిపోవటల్లేదు, యిక ఆహారం లేని కార్మికుల కుటుంబాలకు ఏం చేయాలన్న విషయాన్ని సహాయ కమిటీ చర్చించి, తమ ప్రతినిధులను యితర ప్రాంతాలకు పంపి చందాలు ప్రోగు చేయాలని నిర్ణయం చేస్తుంది. బైలెక్‌ను అతడి అల్లుడు, ఉదారవాది, కార్మికులకు సహాయకారిగా వున్న హేల్‌ను యితర ప్రాంతాలకు తమ కమిటీ తరపున ప్రతినిధులుగా వెళ్ళి సహాయాన్ని సేకరించమని పంపుతారు.

బైలెక్, హేల్‌లు ఫిలడెల్ఫియా వెళతారు. అక్కడ వారు ముందుగా వివిధ యూనియన్లను, ఫెడరేషన్లను కలిసి వారి సహాయం అర్థించాలను కొంటారు. ఆ ప్రకారం పెద్దపెద్ద కార్మిక సంఘాల అమెరికన్ లేబరు ఫెడరేషన్ల ఆఫీసులకు వెళతారు. అక్కడి కార్మికసంఘ నేతలూ, అధికారులూ, గని కార్మికులు నిర్వహించేది చట్టవిరుద్ధ సమ్మె కాబట్టి, తాము అటువంటి చట్టవ్యతిరేక సమ్మె చేసే కార్మికులకు సహాయం చేయబోమని నిర్ద్వంద్వంగా చెప్పారు. ఇది చూసి నిరాశ చెందిన బైలెక్, హేల్‌లు యిప్పుడు ఏం చెయ్యాలా అని ఆలోచిస్తూ వుండగా, వారికి ఆనాటి దినపత్రికలో ఒక వార్త కనబడుతుంది. సమ్మె చేస్తున్న గని కార్మికుల సహాయార్థం ఏర్పడిన పౌరుల కమిటీ ఫలానా చోట మీటింగ్ జరుపుతోందన్నది ఆ వార్త సారాంశం. ఆ వార్త వారిద్దరికీ ఆశ్చర్యం కలిగించినా, ఏం జరుగుతుందో చూద్దామని ఆ మీటింగ్ దగ్గరికి వెళతారు. ఆ మీటింగ్‌లో ప్రధాన వక్తగా ఫిలడెల్ఫియా టీచర్ల స్థానిక యూనియన్ ఉపాధ్యక్షురాలు, సామాజిక కార్యకర్తా, టీచరు అయిన కుమారి లిడియా బియాస్లే మాట్లాడుతూ "గని కార్మికులు తమ జీవన, పని పరిస్థితుల మెరుగు కోసం జరుపుతున్న సమ్మె ప్రజాస్వామికమైనదని, ఈ సమ్మె అమెరికాదేశపు ప్రజాస్వామ్యాన్ని మరింతగా పరిపుష్టి చేస్తుందని, అందువలన ప్రజాస్వామ్యవాదులుగా మనం, ఈ గని కార్మికులకు ఇతోధికంగా సహాయం చేయాల"ని పిలుపునిస్తుంది. అనంతరం వారు సహాయాన్ని ఏ రకంగా ప్రోగు చేయాలా అనే విషయం పథకం వేయటానికి సంసిద్ధం అవుతుండగా, బైలిక్, హేల్‌లు తాము గోల్డుబరో ప్రాంతపు బొగ్గుగని కార్మికులమనీ, తమ అనుభవాలు కూడా చెప్తామనటంతో, సభ నిర్వాహకులు అంగీకరిస్తారు.

బైలెక్ మాట్లాడుతూ, తాను చిన్నప్పటి నుండి తన అనుభవంలో ఒకటి గమనించాననీ, తాము నియామక ఒప్పందం కోసం పోరాడుతూ వుంటే, సమ్మెను విచ్ఛిన్నం చేయటానికి పాలనాయంత్రం రకరకాలుగా దాడి జరుపుతోందనీ, పోటీ కార్మికుల చేత తమపై కాల్పులు జరిపిస్తోందనీ, న్యాయస్థానాలు – పోలీసులు తమను అడ్డుకొంటున్నాయని, రాజ్యపాలనాయంత్రం మాఫియా ముఠాలతోనూ, గూండాలతోనూ రాజకీయవేత్తలతోనూ కూడి వుందనీ, తమపై దాడులు జరుపుతోందనీ, బడా యూనియన్ నాయకులు తమకు వెన్నుపోటు పొడుస్తున్నారని, మీడియా ద్వారా తమకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారనీ, ఆఖరికి అదే పాలనాయంత్రం వైట్‌హౌస్ (అధ్యక్ష భవనం)లోకి కూడా ప్రవేశించినట్లు తనకు అర్థం అవుతోందనీ, అయితే యీ సమ్మె పోరాటం కార్మికులలో మరింత ఐక్యతను పట్టుదలను, పోరాట పటిమను పెంచుతోందని చెప్తూ, తమ పోరాటానికి సహాయ సహకారాలు అందించాల్సిందిగా సభను కోరతారు. అప్పటికప్పుడే అక్కడకు వచ్చినవారు పది డాలర్ల బిల్లులను, చెక్‌లను తమ విరాళంగా పౌర సహాయ కమిటీకి అందిస్తారు. సమ్మె చేస్తున్న కార్మికులకు ఆహారం, బట్టలు, మందులు తదితర అత్యవసర వస్తువులను సేకరించి, బైలెక్, హేల్‌ల ద్వారా సహాయాన్ని పంపడానికి పథకం తయారుచేస్తారు. కుమారి లిడియా బీస్‌లే వారిద్దరికీ హోటల్ బస ఏర్పాటు చేస్తుంది. తర్వాత తాను వారిని కలిసి, తానొక కమ్యూనిస్టుపార్టీ సభ్యురాలననీ, గని కార్మికుల్లో కూడా కొందరు కమ్యూనిస్టు పార్టీ సభ్యులున్నారనీ

తెలియచేస్తూ తమకు కార్మికుల స్థితిగతుల గురించి బాగా తెలుసునని, వాటిని మెరుగుపరచి మార్చటానికే తాము కృషి చేస్తున్నామని వారిద్దరికీ వివరిస్తుంది.

★ ★ ★

మరోవైపున బొగ్గును రైలులో తరలించటానికి ఏర్పాట్లు జరిగాయనీ, పీటర్ జంక్షన్ (రైలు) నుండి, ఒక రైలు నిండా బొగ్గు తరలింపబోతోందని కెనడీ తదితరులకు వార్త అందుతుంది. తక్షణమే ఆ రవాణాను భగ్నం చేయటం కోసం కెనడీ దళం పీటర్ జంక్షన్ రైల్వే ప్రాంతానికి చేరుకుంటుంది. నిండుగా బొగ్గుతో నింపిన పెట్టెలతో రవాణాకు రైలు సిద్ధంగా వుంటుంది. ఇక యింజను వచ్చి, ఆ పెట్టెలను లాక్కుపోవటమే మిగిలి వుంది. ఇంజన్ వచ్చేలోగా, ఆ రైలుపెట్టెల నుండి బొగ్గును క్రిందికి పంపే మెకానిజాన్ని ఉపయోగించి కార్మికులు పెట్టెల్లోని బొగ్గును దింపేస్తారు. ఇక తిరిగి పెట్టెలను బొగ్గుతో నింపి, తీసుకుపోవటం అసాధ్యం చేసి కార్మికదళం సభ్యులు వెళ్ళిపోతారు.

★ ★ ★

## సమ్మెకు సానుకూల స్పందన :

సమ్మె కారణంగా తిండిలేక మలమలా మాడిపోతూ, వడలిపోతూ తన చర్చికి వచ్చే కార్మిక కుటుంబాల స్త్రీలనూ, పిల్లలనూ చూసి ఎంతో బాధపడుతుంటాడు చర్చి ఫాదర్ బోలెస్లావ్. తాను కూడా గని కార్మికుల కుటుంబం నుండి వచ్చినవాడే! తన తండ్రి సోదరులు బొగ్గు గని కార్మికులుగా పనిచేసినవారే! అందువల్లనే బిషప్ తనకు ఆ పేద కార్మికుల చర్చిలో పూజారిగా చెయ్యమన్నందుకు ఒప్పుకొని తన యవ్వన కాలం నుండీ అక్కడే పనిచేస్తుంటాడు. పేద కార్మికులు కుటుంబాల వారికి మతపరమైన ఊరట కల్గించుతుంటాడు ఫాదర్. అతడికి గని కార్మికులు జరిపే సమ్మె పోరాటం న్యాయమైనదిగానూ, ధర్మబద్ధంగానూ అన్పిస్తుంది. కానీ అదే పట్టణంలో వున్న మరో రెండు యితర చర్చిల పూజార్లు, అతడిని గని కార్మికుల సమ్మెను సమర్ధించకూడదని ఒత్తిడి పెడతారు. అది కమ్యూనిస్టులు ప్రేరేపించిన సమ్మె అనీ, మతానికి వ్యతిరేకమయిందనీ, అందువల్లనే వారు బొగ్గు లారీలను పడేస్తూ హింసను ప్రేరేపిస్తున్నారనీ, వారు శాంతి భద్రతలను, వ్యక్తిగత ఆస్తినీ లక్ష్యపెట్టక పోవటం అన్నది చర్చిని ప్రమాదంలోకి నెట్టడమేనని, తామూ కార్మికుల కోసమే పనిచేస్తున్నామని, అందువల్లనే తాము కేథలిక్ కార్మిక సంఘాలలో పనిచేస్తూ, కార్మికులు ప్రక్కదారి పట్టి, కమ్యూనిస్టుల బారి పడకుండా కాపాడుతున్నామనీ అతడికి బోధిస్తారు. మరోవైపు సిటీ క్లర్కు జియోఘన్ వచ్చి, ఫాదర్ బోలెస్లావ్‌ను అతడి మత సేవల గురించి పొగడి, చూడబోతే సమ్మె యింకా కొంతకాలం కొనసాగబోతున్నట్లు కనబడుతోందనీ, గని కార్మిక కుటుంబాల స్త్రీలూ పిల్లలూ తిండిలేక మలమలా మాడిపోతుంటే తనకు బాధగా వుందనీ, కాని సమ్మె చేసే బొగ్గు గని కార్మికులు బొగ్గు రవాణా లారీలను ఆపి, బొగ్గును క్రిందికి పారబోయటం, జనాలను తుపాకులతో కాల్చటం అన్నది తనకు నచ్చదనీ, అటువంటి పనులు కమ్యూనిస్టులు చేస్తారని, అందువలన ఆ సమ్మెను విరమింపచేయటానికి ఫాదర్ బోలెస్లావ్ సహాయపడాలనీ, ఎందుకంటే ఎక్కడైతే శాంతిభద్రతలుండవో అక్కడ మతం వుండదనీ, తరువాతి దశ రక్తసిక్తమయిన బోల్షివిజం అనీ స్పెయిన్‌లో జరిగిన మాదిరి చర్చిలను తగులబెట్టారనీ, మత కన్యలను (నన్స్) రేప్ చేస్తారనీ, ఇప్పుడు రష్యా, పోలెండ్ తదితర దేశాల్లో జరిగిన మాదిరి, మనదేశంలో కూడా ఘోరాలు జరిగిపోతాయి కనుక ఫాదర్ ఆ ఘోరాలన్నీ జరగకుండా సమ్మెను విరమింపజేయటానికి సహాయపడితే, తాను గని కార్మికుల కుటుంబాలకు భారీ ఎత్తున సహాయం అందజేస్తాననీ చెప్పి వెళ్ళిపోతాడు.

ఇతర చర్చిల ఫాదర్‌లు చెప్పిన విషయాలూ, సిటీ క్లర్కు చెప్పిన విషయాలు, కార్మికుల సమ్మెలను గురించి ఆలోచించిన ఫాదర్ బోలెస్లావ్‌కు, కార్మికులు తనను "ఇతరులను చంపటం కోసం యుద్ధానికి వెళ్ళే సైనికులను ఆశీర్వదించే నువ్వు, మతాన్ని విశ్వసిస్తూ, యిహలోకంలో కేవలం తమ పిల్లలకూ, తమకూ తిండి కోసం పోరాడే మమ్ముల్ని దీవించలేవా?" అని నిలదీస్తున్నట్లన్పిస్తుంది, తాము యిప్పుడు సమ్మెలో ఎలా విజయం సాధించాలో బోధించమని ప్రార్థిస్తున్నట్లు అన్పిస్తుంది. తమను ఆశీర్వదించమన్నట్టు అన్పించింది. కార్మికుల సమ్మెను సమర్ధించటమే ధర్మమనిపిస్తుంది అతడికి. అందుకే ఆ మర్నాడు తాను చర్చి వేదిక నుండి చేసిన ధర్మ బోధనలో, కార్మికులను "మీరు మీ పోరాటం సాగించండి! కానీ అప్రమత్తంగా వుండండి. శత్రువుల ఎటువంటి కవ్వింపులకూ, రెచ్చగొట్టడాలకూ లోనవకండి!" అని బోధిస్తాడు. అలా బోధించటమే క్రైస్తవ మతధర్మమని అతడు మనస్ఫూర్తిగా భావిస్తాడు.

★ ★ ★

## సమ్మె విచ్ఛిన్నానికి కుట్రలు :

స్థానిక పోలీసులూ, ఎఫ్.బి.ఐ. అధికారులూ ఎంతగా విచారించినా బొగ్గు రైలు నుండి బొగ్గును క్రిందకు పారబోసిందెవరో తెలియదు. సిటీ క్లర్కు జియోఘన్ మాత్రం యిది కెన్నడీ ఆధ్వర్యంలో జరిగిన పనే అని బలంగా అనుమానపడుతుంటాడు. జిల్లా యూనియన్ నాయకుడు లేన్స్‌డేల్‌తో కలసి కెన్నడీ తదితరులను కేసులలో యిరికించే పథకం వేస్తాడు. ఆ ప్రకారం లేన్స్‌డేల్ స్థానిక యూనియన్ నాయకుడు మెర్కాడాంటేను, కెన్నడీలను పిలిపించి, బొగ్గు రవాణా జరగకుండా ఆపడం మంచిపనేనని, అందువలన యిప్పుడు పీటర్ జంక్షన్ రైల్వే వద్ద గల బొగ్గు నిల్వ కేంద్రంపై దాడిచేసి, ఆ కేంద్రంలోకి అందరినీ బంధించి, ఆ కేంద్రాన్ని ధ్వంసం చేస్తే సమస్య లేకుండా పోతుందనీ, అందుకు యూనియన్ ప్రోత్సాహం యిస్తుందనీ తానూ యూనియన్ నాయకుడిగా, ఆ దాడిలో పాల్గొంటానని చెప్తాడు. ఈ రకంగా సమ్మెను అంగీకరించని జిల్లా యూనియన్ నాయకుడు సమ్మెలోని కార్మికులను రెచ్చగొట్టి కేసులో యిరికించుతున్నట్లు, కెన్నడీ అర్థం చేసుకొంటాడు. కానీ యీ చర్యలో పాల్గొనకపోతే, కార్మికులంతా లాన్స్‌డేల్‌ను వీరుడిగా గుర్తించి, అతడివైపుకు మారిపోతారని, అందువలన తానూ ఆ చర్యలో పాల్గొనాలనీ, అదే సందర్భంలో, కార్మికులు రెచ్చిపోయి, అనవసరపు హింసకు పాల్పడకుండా నివారించాలని కెన్నడీ నిర్ణయించాడు. ఆ ప్రకారం లాన్స్‌డేల్ నాయకత్వంలో ఒక దళం, మెర్కాడాంటే నాయకత్వంలో ఒక దళం, కెన్నడీ నాయకత్వంలో ఒక దళం ఏర్పడతాయి. పీటర్ వెబ్‌ను లాన్స్‌డేల్ తన దళంలో తనకు సహాయకుడిగా తీసుకొంటాయి. అనుకొన్న ప్రకారం ఆ కేంద్రం వద్దకు చేరుకొని, ముందుకు సాగుతూండగా,

ఆ బొగ్గు నిల్వ కేంద్రం నుండి హఠాత్తుగా కాల్పులు మొదలవుతాయి. ఒక తూటా లాన్స్‌డేల్ కాలును రాసుకొంటూ పోవటంతో, అతడికి చిన్న గాయమై, అతడు క్రింద పడతాడు. అతడిని రక్షించటానికి ముందుకొచ్చిన పీటర్ వెబ్‌కు తూటా తగిలి క్రిందపడి చనిపోతాడు. కాల్పుల వలన అంతా గందరగోళమవుతుంది. ఇదంతా గమనిస్తున్న యితర కార్మికులు పీటర్ వెబ్ మృతదేహాన్ని ఒక ప్రక్కకు తీసుకెళ్ళి చాటుగా వుంచుతారు. కాల్పులను తప్పించుకొంటూ అక్కడి నుండి కార్మికులందరూ పారిపోతారు. ఆ కారణంగా, కావాలనే పీటర్ వెబ్‌ను ఈ ఘటనలో కాల్పులకు గురయేటట్టు, అతడి చావుకు లేన్స్‌డేల్ కారకుడయ్యాడని కెన్నడీ అర్థం చేసుకొంటాడు.

పీటర్ వెబ్ ప్రమాదవశాత్తూ చనిపోయాడనీ, అయినా అతడి శవాన్ని అనాథ ప్రేతంగా వదలిపెట్టక, తాను అంతిమ సంస్కారాలు జరిపించే ఏర్పాట్లు చేస్తానని చెబ్తూ వెబ్ మృతదేహాన్ని తన స్వంత బగ్గీబండిపై అంత్యక్రియలు నిర్వహించే ఒక ప్రవేటు ప్రార్థనా హాల్‌కు చేర్చాడు సిటీ క్లర్కు జియోఘన్. బొగ్గు గని కార్మికులు అక్కడికి వచ్చి మృతదేహానికి నివాళి చెప్తారు. అనుభవం గల కార్మికులు అతడి మరణానికి కారుకులెవ్వరో అర్థం చేసుకొంటారు. మర్నాడు పీటర్ వెబ్ అంతిమయాత్ర జరిపి, ఖననం చేయటానికి సిటీ క్లర్కు జియోఘన్ ఏర్పాటు చేస్తాడు.

ఇంతలో బైలెక్, హేల్‌లు, కార్మికులకు సహాయపు సరుకులు నిండిన ఒక లారీతో, తమ పట్టణానికి రాబోతున్నారని తెలుస్తుంది. అందువలన కెన్నడీ, జామిసన్ తదితరులు వారిని కలుసుకొని, ఆ సరుకులను భద్రపరచటం కోసం అక్కడికి వెళతారు. లారీ నిండా వున్న ఆహార పదార్థాలను, బట్టలను, మందులను యితర సరుకులను పోలిన్ హాలులోని బేసిమెంటు గదిలోకి చేర్చి, గదికి తాళం వేసి, వాటిని ఆ మర్నాడు కార్మిక కుటుంబాల వారికి పంచి పెట్టేందుకు ఏర్పాట్లు చేసుకొంటారు. ఈ సహాయంగా వచ్చిన పదార్థాలను చూసి సంతోషంగా వుండాల్సిందిపోయి, కార్మికులు విచారకరంగా వుండటాన్ని గమనించిన బైలెక్, హేల్‌లు విషయం ఏమిటని విచారించి, పీటర్ వెబ్ అకారణంగా తుపాకీ గుండుకు బలయి మరణించిన విషయం తెల్సుకుంటారు.

అన్నప్రకారం పీటర్ వెబ్ అంతిమయాత్ర ప్రారంభమవుతుంది. అది నిరసన ప్రదర్శనగా మారుతుందన్న భయంతో, గోరీలదొడ్డిదాకా రోడ్డు పొడుగునా పోలీసులను పెట్టారు. జియోఘన్ రౌడీలు కూడా రోడ్డు అంతా తిరుగుతుంటారు. పోలీసు ప్రధానాధికారి బోడెన్ హేమర్ స్వయంగా ఒక రేడియో కారులో, శవ వాహనానికి వెనుకగా కొంత దూరంలో ఆ వాహనాన్ని వెంబడిస్తుంటాడు. శవవాహనాన్ని అతివేగంగా నడుపుతుండటం వలన గని కార్మికులు గుంపులు, గుంపులుగా అడ్డదార్లో గోరీల దొడ్డికి చేరుకొంటారు. ఫాదర్ బోలెస్లావ్, పీటర్‌వెబ్ మృతదేహానికి సంస్కారం జరిపించి ఖననం చేయిస్తాడు. ఆ సందర్భంగా మాట్లాడిన జామిసన్, పోరాటంలో వున్న పీటర్ వెబ్‌ను చంపించిందెవరో, చంపిందెవరో తొందరలో వెల్లడి అవుతుందని ప్రకటిస్తాడు.

ఇంతలో పొలోనియల్ హాల్ వాచ్‌మెన్ అక్కడకు పరుగు పరుగున వచ్చి, కార్మికులకు పంచాల్సిన సరుకులు దాచిన గది తలుపు తాళాలు పగులకొట్టి దొంగతనం జరిగిందని కెన్నడీ తదితరులకు తెలియజేస్తాడు. అప్పుడు కెన్నడీ, జామిసన్, బైలెక్, మోర్కండేట్ తదితరులు అక్కడికి పరుగెత్తి, చూస్తారు. కాకపోతే సామానులేవీ దొంగిలింపబడలేదని గుర్తిస్తారు. బహుశా వాచ్‌మేన్, అలికిడి విని దొంగలు, దొంగతనం చేయకుండా పారిపోయి వుంటారనే నిర్ధారణకు వాళ్ళు వస్తారు.

## కమ్యూనిస్టులపై దుష్ప్రచారం :

మెర్కండేట్ ఆ సరుకులు ఎవరిచ్చారని అడుగుతూనే, ఆ సరుకుల మధ్య తిరుగుతూ, ఒక అట్టపెట్టెలోంచి ఒక కరపత్రాన్ని బయటికి తీస్తూ, దాన్ని చూపిస్తూ యిదేమిటని ప్రశ్నించి, దానిలోని సారాంశాన్ని తానే బిగ్గరగా యిలా చదివాడు : "మీరు యీ ఆహారాన్ని తినేటప్పుడు యిది కమ్యూనిస్టు పార్టీ యిచ్చిందని గుర్తుపెట్టుకోండి. కమ్యూనిస్టు పార్టీ మాత్రమే కార్మికుల ఏకైక మిత్రుడు. మీ యూనియన్‌ను నడుపుతున్న నకిలీలను వదిలించుకోండి. గూండాలను, సమ్మె విచ్ఛిన్నకులను చంపండి. వాల్‌స్ట్రీట్‌ను, ప్రభుత్వాన్నీ పేల్చివేయండి! కమ్యూనిస్టు పార్టీలో జేరండి!".

ఇది విన్న కెన్నడీకి, సమ్మె చేసిన కార్మికుల కుటుంబాలవారినీ పిల్లలనూ తిండి లేకపోయినా ఎవరూ పట్టించుకోని సందర్భంలో ఒకవేళ కమ్యూనిస్టులే యీ ఆహార పదార్థాలనూ, యితర వస్తువులను పంపించి వుంటే, వారికే మరింత అధికారం, శక్తి రావాలనుకొంటాడు. అయితే యీ కరపత్రాన్ని కమ్యూనిస్టులు పంపలేదనీ, రాత్రి దొంగతనం జరిపినవాళ్ళే యిటువంటి కరపత్రాలను, సామానుల పెట్టెలో పెట్టి, తమను యిరికించారనీ అర్థం చేసుకొంటాడు.

ఇంతలో, భవనం బయట కార్మికుల కుటుంబాలవారు సరుకుల పంపిణీ తీసుకోవటానికి బారులు తీరి వుంటారు. మరోవైపు జిల్లా నాయకుడు లేన్స్‌డేల్, పోలీసు ఉన్నతాధికారి బోడెన్ హైమర్‌లు అక్కడకు చేరుకొంటారు. లేన్స్‌డేల్ ఒక కరపత్రాన్ని అందుకొని, బయటకు వచ్చి, ఈ సరుకులు కమ్యూనిస్టులు పంపారనీ, అందుకు ప్రతిఫలంగా మిమ్ములను కమ్యూనిస్టు పార్టీలో చేరమంటున్నారనీ, వాళ్ళు మిమ్ములను మీ దేశానికి ద్రోహం చేయమంటున్నారనీ, మీ చర్చికీ దేముడికీ కూడా ద్రోహం చేయమంటున్నారని, అందువలన మీరు యీ సరుకులు తీసుకొని, మీ దేశాన్ని కాదనుకొని, అమెరికన్లు కాకుండా పోదలచ్చు కొన్నారా? అని క్యూలో వున్నవాళ్ళను ప్రశ్నిస్తాడు. అతడి ప్రశ్నను విన్న క్యూలోని కార్మికుల కుటుంబాలవారు, "లేదు అలా చేయం – మాకు యీ సరుకులు వద్దు" అంటూ అరుస్తూ, సరుకులు తీసుకోకుండా వెనక్కి తిరిగి వెళ్ళిపోతారు అందరూ.

మర్నాటి స్థానిక దినపత్రికలో హేల్, కెన్నడీలను బైలెన్ కమ్యూనిస్టు కుట్రదారులుగా వర్ణిస్తూ, కమ్యూనిస్టులు ఆహార పదార్థాలు పంపి సమ్మె చేస్తున్న కార్మికులకు, వారి కుటుంబాలలో తమ గురించి ప్రచారం చేసుకొంటున్నారనీ, సమ్మె చేస్తున్న గని కార్మికుల నాయకులకు వ్యతిరేకంగా అబద్ధపు ప్రచారం జరుగుతుంది. ఇదే వార్త దేశమంతటా పత్రికలు, రేడియో ద్వారా ప్రచారం చేయబడుతుంది.

★ ★ ★

## దుష్ప్రచారానికి లోనుగాని కార్మికులు :

తిండిలేక మలమలా మాడుతున్న పిల్లలకు నోటిదాకా వచ్చిన కూడు చెడగొట్టినందుకు, గని కార్మికుల కుటుంబాల స్త్రీలు ఎంతో

బాధపడతారు. బైలెక్ భార్య మార్థా, కెన్నడీ కూతురు మికీ, హేల్ భార్య రోబోమేరీలు. యిది కావాలనే తమకు ఆహారం అందకుండా, సమ్మెదారులను అపఖ్యాతిపాలు చేసేందుకు పాలనాయంత్రం పన్నిన కుట్ర. వారే ఈ మోసపూరిత కరపత్రాలను, సరుకుల్లో పెట్టి, వాళ్ళే వాటిని బయటకు వేసి, తమను అభాసుపాలు చేసి, కార్మిక కుటుంబాలకు ఆహారం, సరుకులు అందకుండా చేశారని అర్థం చేసుకొంటారు. తమకు ఆహారం అందకుండా, పాలనాయంత్రం చేసిన ఈ కుట్రను త్రిప్పికొట్టి, ఆకలితో బాధపడుతున్న కుటుంబాలవారికి ఆహారపదార్థాలు అందజేయాలని వారు నిర్ణయించుకొంటారు. వెంటనే వారు కార్మిక కుటుంబాల మహిళలనందరినీ సమావేశపరచి, అందులో జరిగిన కుట్రను వివరించి, ఒకవేళ నిజంగా కమ్యూనిస్టులే ఆహార పదార్థాలను సహాయంగా పంపినా, అవి తీసుకోవటానికి మనం ఎందుకు అభ్యంతరం చెప్పాలి! అని వారిని ఒప్పించి, నచ్చజెప్పి తిరిగి వారందరినీ ఫిలోనియా హాల్ వద్దకు తీసుకువెళ్ళి, సమ్మెలో వున్న గని కార్మికులకు సహాయంగా ఫిలడెల్ఫియా పౌరుల కమిటీ పంపిన సరుకులన్నింటినీ వారికి పంచుతారు.

తమపై అబద్ధపు ప్రచారాలు, తప్పుడు రాతలు రాస్తున్న పత్రికలవారిపై కోర్టు ద్వారా చర్య తీసుకోవాలని హేల్ తదితరులు ఆలోచిస్తారు. వారి లాయరు ట్రెలాల్నీ, యీ విషయంలో కోర్టులు ద్వారా తమకు న్యాయం లభించటం దుర్లభమనీ, పెద్ద ఖర్చుతో కూడుకొన్నదనీ, దేశంలోని పత్రికలు అన్నీ ఒక బలమైన శక్తిగా వుండి 'తిమ్మిని బమ్మిని'గా చేయగల తమ శక్తితో కేసును ఓడిస్తారనీ వారికి పాలనాయంత్రపు మద్దతు పూర్తిగా వుంది కనుక, మనం ఓడిపోతామని, అలా చేయకుండా వారిని వారిస్తాడు.

★ ★ ★

జడ్జి ఫ్రిట్ షెట్ తన యింటికి సిటీ క్లర్కు జియోగౌఘన్‌నూ, జిల్లా యూనియన్ అధికారి లేన్స్‌డేల్‌నూ పిలిపించుకొంటాడు. సమ్మె ముగియబోతోందనీ, వాషింగ్టన్‌లో యూనియన్, యజమానుల ప్రతినిధుల మధ్య చర్చలు జరిగి, ముగియబోతున్నాయనీ, గని యజమానుల సంఘం, యూనియన్‌తో నియామక ఒప్పందంపై సంతకం చేయబోతోందనీ, వారికి తెలియజేస్తాడు. వాళ్ళు చేసిన సమ్మె విచ్ఛిన్న ప్రయత్నాలు, పన్నాగాలు విఫలమవటమేగాక, కార్మికులందరినీ, తమకు వ్యతిరేకంగా వుండేటట్టు చేశాయనీ వారికి తెలియజేసి వారి వలన భవిష్యత్తులో చాలా ప్రమాదం ముంచుకొస్తుందని వారిని హెచ్చరిస్తాడు. లేన్స్‌డేల్ సిటీ క్లర్కు జియోగౌహన్‌లు "వాళ్ళకు యూనియన్ పట్లా, దేశంపట్లా, వారు పనిచేసే యజమానిపట్లా విధేయతాలేదని, వారు ప్రమాదకారులనీ హేల్, బైలెక్, కెన్నడీలకొక గట్టి గుణపాఠం చెప్తామని" జడ్జికి చెప్తారు. గతంలో మాదిరి విఫలమయేవిధంగా కాక, యీసారి పకడ్బందీగా వాళ్ళని యిరికించమని జడ్జి వాళ్ళను హెచ్చరించి పంపిస్తాడు.

★ ★ ★

స్థానిక యూనియన్ బొగ్గు గని కార్మికులనందరినీ, సమావేశానికి పిలుస్తుంది. వారికి కేంద్ర యూనియన్ నుండి వచ్చిన టెలిగ్రాం చూపిస్తూ తాము విజయం సాధించామని, యిది యూనియన్ చారిత్రాత్మక విజయమని లేన్స్‌డేల్ ఉపన్యసించి, రేపటి నుండి అందరూ పనిలోకి వెళ్ళాలనీ పిలుపునిస్తాడు. కెన్నడీ లేచి మరి బైలెక్, జామిసన్‌ల సంగతేమిటి? అని ప్రశ్నిస్తారు. వాళ్ళ సంగతి దేముడెరుగు, అసలు నిన్ను కూడా పనిలోకి తీసుకొంటారన్నది అనుమానమే! మీరంతా కమ్యూనిస్టులే! అని లేన్స్‌డేల్ బదులు చెప్తాడు. మిగిలిన కార్మికులు తిరిగి పనిలోకి చేరేందుకు ఆతృతలో వుండి, యీ అంశాన్ని పట్టించుకోరు.

పరిస్థితిని అర్థం చేసుకొన్న బైలెక్, జామిసన్, కెన్నడీలు తమ సమ్మె పాక్షిక విజయాన్ని మాత్రమే సాధించిందనీ, యింకా తాము పూర్తి విజయం కోసం పోరాడుతూనే వుండాలనీ అర్థం చేసుకొంటారు. సమ్మె ముగిసింది. కాని సంతోషం మాత్రం వారిలో ఉండదు.

★ ★ ★

కమ్యూనిస్టులుగా ముద్రవేయబడిన కెన్నడీ, బైలెక్, హేల్‌లు కనబడితే తన్నులు తినేవారిగా, మలుస్తారు. వారిపై గూండాలూ, పోలీసులు యధేచ్ఛగా భౌతికదాడులు చేస్తుంటారు. అటువంటి ఒక సందర్భంలో కెన్నడీ, బైలెక్ హేల్‌లు తిరగబడటంతో వారిని చితకతన్ని పోలీసులు అరెస్టు చేసి జైలులో పెడతారు. తమ విధి నిర్వహణకు ఆటంకం కలిగించినట్టు వారిపై నేరారోపణ చేస్తారు. వారు దుష్టులైన కమ్యూనిస్టులనీ వారిని గట్టిగా శిక్షించాలనీ కోర్టును కోరతారు. వారిని చితకబాదిన గూండాలకు, పోలీస్ స్టేషన్‌లోనే ఒక్కొక్కరికి ఇరవై డాలర్ల పూచీకత్తుపై జామీనులు యిస్తారు. వీరికి బెయిల్ యివ్వ నిరాకరించి కోర్టులో హాజరుపరుస్తారు. వీరి తరపు లాయర్ అతి కష్టం మీద జడ్జి ఫ్రిట్ షెట్‌ను బెయిలు యిచ్చేందుకు ఒప్పించితే, ఆయన అందుకు ఒప్పుకొని, ఒక్కొక్కరు వెయ్యి డాలర్ల పూచీకత్తుగా యివ్వాలని షరతు పెడతారు. ఆ రకంగా వారు బెయిల్ పొందటమన్నదే ఆచరణలో అసాధ్యం చేసాడు. అప్పుడు వారి తరపు లాయరు, యిది అన్యాయమనీ, యీ అన్యాయం గురించి బయటి ప్రపంచానికి వెల్లడిస్తాననీ వాదించటంతో, జడ్జి ఫ్రిట్‌షెట్ తగ్గి, వారు తక్కువ పూచీకత్తుపై బెయిల్ పొందేందుకు అనుమతించి బెయిల్ యిస్తాడు.

★ ★ ★

## అవును! ఇదంతా మనదే!

అయితే యీ కేసు నెగ్గటం అసాధ్యమనీ, వారికి తప్పనిసరిగా కఠినమైన జైలుశిక్ష పడుతుందనీ, అందువలన వారు ఏదో ఒక రకంగా రాజీపడటం మంచిదనీ, వాళ్ళకు లాయర్ సలహా యిస్తాడు.

మరోవైపు జడ్జి ఆలోచించగా వాళ్ళకు కఠినమైన శిక్ష విధించటం వలన వాళ్ళు కార్మికులలో, సామాన్య ప్రజలలో వ్యవస్థ అణచివేతకు బలయిన వీరులుగా పేరుపొందుతారనీ, అందువలన వారికి శిక్ష పడకుండా కేసును ఉపసంహరించేట్టు చేసినందువల్ల భవిష్యత్తులో ప్రజలకూ – పాలనాయంత్రానికి మధ్య పౌర యుద్ధం జరగకుండా నివారించవచ్చుననీ అన్పిస్తుంది. ఆయన 'ముద్దాయిల' తరపున లాయరుతోనూ, పాలనాయంత్రంతోనూ పలుమార్లు చర్చించి, ఆఖరుకు కేసు ఎత్తివేసేటట్లు యిరువర్గాల మధ్య రాజీ కుదుర్చుతాడు. వారిపై కేసు ఎత్తివేయబడుతుంది.

ఈ కాలమంతటా జామిసన్, యుద్ధంలో చనిపోయిన తన కుమారుడు చదవటం కోసం తన లైబ్రరీలో దాచుకొన్న పుస్తకాలను చదవటం మొదలుపెడతాడు. అవి శాస్త్రీయ సోషలిజంకు సంబంధించిన పుస్తకాలు. శ్రమదోపిడీ, అదనపు విలువ, దోపిడీ పెట్టుబడిదారీ వ్యవస్థ, బూటకపు ప్రజాస్వామ్యం, కార్మికవర్గం, కార్మికవర్గ రాజ్యాధికారాన్ని

గురించి మార్క్స్, లెనిన్‌లు వివరించిన పుస్తకాలు. జీవితమంతా ఒక బోధకుడిగా, నీగ్రోల చర్చిలో, పూజారిగా వ్యవహరించి, నీగ్రో కార్మికులకు, కుటుంబాలవారికీ క్రైస్తవ మత ధర్మబోధన చేస్తూ వున్న జామిసన్‌కు, బైబిలులోని బోధనలుకన్నా తాను చదువుతున్న పుస్తకాలలోని వివరాలే తమ జీవితాలకు నిజమైన విముక్తిని కలుగజేస్తాయని అనిపిస్తుంది.

మరోవైపు తాను జీవితమంతా బొగ్గును గనిలో త్రవ్వుతూ, పెత్తందారులు చెప్పినట్లు పనిచేయటానికి యిష్టపడకుండా, అంతకన్నా పెద్ద దుర్మార్గులు తాను ఎప్పుడు పనిచేయాలో ఎక్కడ ఒక సముచితమైన చక్కని యిల్లు కట్టుకొని నివాసముండాలో, ఎప్పుడు తానూ, తన కుటుంబసభ్యులు తినాలో, ఎప్పుడు తానూ తన సహోదర కార్మికులు విశ్రాంతి తీసుకోవాలో అని నిర్ణయించటాన్ని అంగీకరించకపోయినందుకే తనను కమ్యూనిస్టుగా ముద్రవేస్తే నిజంగానే బహుశా తాను కమ్యూనిస్టునని, అందులో నేరమేమీ లేదని కెన్నడీ భవిస్తాడు. ప్రారంభించిన పోరాటాన్ని కొనసాగించాలని నిర్ణయిస్తాడు.

వచ్చే యూనియన్ ఎన్నికలలో కెన్నడీ స్థానిక అధ్యక్షుడిగా పోటీ చెయ్యాలని బైలెక్, జామిసన్‌లు నిర్ణయిస్తారు.

ఈ విషయం తెల్సిన జిల్లా యూనియన్ నాయకుడు కంగారు పడుతూంటే సిటీ క్లర్కు "మరేం పర్వాలేదు, మీరు ఓడిపోయి అతడు నెగ్గినా ఏం కాదు. నువ్వు జిల్లా యూనియన్ నాయకుడిగానే వుంటావు. మన పాలనా యంత్రం, పత్రికలు, రేడియో, కేథలిక్ చర్చి, ఎఫ్.బి.ఐ, న్యాయస్థానాలు, యీ పట్టణంలో వున్న ప్రతి పోలీసూ మనకు అండగానే వుంటారు. భయపడకు" అంటూ ధైర్యం చెప్తాడు.

కానీ లేన్స్‌డేల్ "ఒకవేళ కెన్నడీ నెగ్గటం వలన నేను బయటికి వెళ్ళిపోవాల్సి వస్తే, ఆ పరిస్థితులు మీకూ ప్రమాదకరంగానే పరిణామం చెందుతాయి అని" జియో ఘన్ హెచ్చరిస్తాడు.

పని నుండి యింటికి వచ్చి యింటి గుమ్మం నుండి గోల్డ్బుబరోలోని బొగ్గుగని ప్రాంతపు లోయనంతటినీ పరకాయించి చూస్తూ, "ఇదంతా మనదే! ఒక్కసారి కనుక మనం మనస్సు పెట్టి నిర్ణయం చేసుకొంటే నిజంగా యిదంతా మనదే అవుతుంది. ఇది మనలను తనను మన కోసమే, మన బిడ్డల కోసమే తీసుకోమంటోంది!" అనే విషయాన్ని తన కుమార్తెకు చెప్తాడు.

ఏదో ఒక రోజున దీన్నంతటినీ మనం తీసుకొంటాం! అనే దృఢవిశ్వాసాన్ని అతడు ప్రకటిస్తాడు.

★ ★ ★

వాస్తవానికి సంగ్రహరూపంలోని ఈ కథ, స్టెఫాన్ హైమ్, 'గోల్డ్బు బరో' నవలలో చిత్రీకరించిన అనేక వివరాలను, కార్మికుల పోరాటాలలో వున్న బహుపార్శ్వాలను ప్రజాస్వామ్యం పేరిట అమెరికాలో సాగుతున్న పెట్టుబడిదారీవిధానం యొక్క పలు దోపిడీ, అణచివేత రూపాలనూ, స్వానుభవపూర్వకంగా కార్మికులు వ్యవస్థ యొక్క వర్గస్వరూపాన్ని అర్థం చేసుకున్న వివరాలను పాఠకులకు రేఖామాత్రంగానే వివరిస్తుంది. నవలను చదివితే కథాంశానికున్న విస్తృతి తెలుస్తుంది. శాస్త్రీయ కార్మికవర్గ దృక్పథాన్ని సులభంగా అర్థం చేసుకోవటానికి యీ నవల ఎంతగానో తోడ్పడుతుంది.

## చైతన్యవాహిని

**30-10-22న** బండి గోపాలరెడ్డి (బంగోరె) వర్ధంతి సందర్భంగా అనకాపల్లి జిల్లా చోడవరంలో జనసాహితి సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి జనసాహితి జిల్లా కార్యవర్గ సభ్యులు రవిశంకర్ సమన్వయకర్తగా వ్యవహరించారు. జనసాహితి జిల్లా కార్యదర్శి నూకాచారి బంగోరె జీవితాన్ని, సాహిత్య కృషిని, పరిచయం చేశారు. జనసాహితి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఓ.వి.వి.యస్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రజల జీవితాలను సుసంపన్నం చేసే భాషా సాహిత్యాలు కాలగర్భంలో కలిసిపోరాదని, అలా కాలగర్భంలో కలిసిపోయే వాటిని భాషా సాహిత్య పరిశోధకులు ఎంతటి శ్రమకైనా ఓర్చి వెలికి తీసి ప్రజలకు అందించాలని బంగోరె తన జీవితాన్ని ఉదాహరణగా ఆచరించి చూపారని అన్నారు. గౌరీశంకర్, వాసు, వెంకట్రావు, లక్ష్మీకుమారి, సూర్యప్రకాశ్, దేవి ప్రసాద్, అప్పలనాయుడు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**9-11-22** బుధవారం సాయంత్రం చిత్తజల్లు వరహాలరావు (సివి) వర్ధంతి సందర్భంగా జనసాహితి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జనసాహితి జిల్లా కార్యదర్శి నూకాచారి సివి రాసిన "పారిస్ కమ్యూన్"ను, రవిశంకర్ "సత్యకామ జాబాలి"ను సూర్యప్రకాష్ "విషాదభారతం"ను లక్ష్మీకుమారి "స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ"ను పరిచయం చేశారు. వెంకట్రావు మాస్టారు "రచయితలు సామాజిక బాధ్యత "అనే అంశంపై సివి రాసిన వ్యాసాన్ని సభికులకు పరిచయం చేశారు. గౌరీశంకర్ ఈ సమావేశాన్ని సమన్వయం చేయగా, సివి సాహిత్య జీవితాన్ని స్మరించుకుంటూ రామకృష్ణ మాట్లాడారు.

"లోకపు సిరిసంపదలకు మనకూ హక్కుందిరా!
లోకపు సౌందర్యానికి మనకూ హక్కుందిరా!!"
**- అనిసెట్టి**

"పస్తులుండి పండించే రైతన్నా రావోయి
పంట తల్లి నీదేనోయి త్యాగమంతా నీదేనోయి!!"
**- అనిసెట్టి**

## జాతీయ అక్షరయోధులు



# అయ్యప్ప పణికర్

**( 1930 - 2006)**

**9**


**సింగంపల్లి అశోక్‌కుమార్**


# అయ్యప్ప పణికర్

పణికర్ కవితీ్వకరణ 'వీడియో చావు'
మానవ సంబంధ పరిమళాల పూవు
ఆర్థిక సంబంధ పుండుగా మారుతున్న
ప్రపంచీకరణ విషసంస్కృతికి చాకిరేవు

**ప్రియమైన ఓటరులారా రండి రారండి / మీకై మీరు ఒకప్పుడనుభవించిన / ఒకనాటి మీ అధికారాన్ని/ మాకు బదిలీ చెయ్యమని కోరుతున్నాం/ అందుకే మీ ఓట్లను కోరేది/మీ ఓట్లు మాకు ఇచ్చారంటే / ఇక్కడ ప్రజాస్వామ్యం వర్ధిల్లగలదు' అంటూ ఎన్నికల నేతల డొల్లతనాన్ని వ్యంగ్య పరుస్తున్న అయ్యప్పపణికర్ మళయాళ కవి, పండితుడు, విద్యావేత్త, సాహిత్యవిమర్శకులు.**

ప్రాథమికవిద్యల అనంతరం మలబార్ క్రిష్టియన్ కాలేజీలో ఇంటర్మీడియేట్, త్రివేంద్రం యూనివర్సిటీ కాలేజీనుండి డిగ్రీ, త్రివాన్కూర్ యూనివర్సిటీలో ఆనర్స్, అమెరికాలోని ఇండియానా యూనివర్శిటీ నుండి డాక్టరేట్ తీసుకున్నారు. తరువాత హార్వర్డ్ యూనివర్సిటీలో పోస్ట్‌డాక్టోరల్ పరిశోధనచేశారు. 1974లో కేరళ యూనివర్శిటీలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషులో ఇంగ్లీషు రీడరుగా 1980 వరకు ఆ పదవిలో ఉండి ఆర్ట్స్ ఫాకల్టీ డీన్‌గా 1990లో రిటైరయ్యారు

కేంద్ర సాహిత్య అకాడమీ రూపొందించిన 'భారతీయ సాహిత్య ఎన్‌సైక్లోపీడియా'కు ఆయన ప్రధాన సంపాదకులు. పద్మశ్రీ, కేరళ సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమీ, కేరళకు చెందిన ప్రతిష్ఠాత్మక 'సరస్వతి సమ్మాన్', వలయార్, వల్లథోల్ మొదలగు అవార్డులు అందుకున్నారు

ప్రసిద్ధ కమ్యూనిస్టు నాయకుడు నంబూద్రిపాద్ నిర్వహించిన అధ్యయన శిబిరంలో ధ్వనించిన గతితార్కిక భౌతికవాద సిద్ధాంతం ఆయనలో ప్రతిధ్వనించింది. 1950లో ఆయన కవిత్వం రాయడం ప్రారంభించి మళయాళ కవిత్వాన్ని విప్లవీకరించారు. 'కురుక్షేత్రం' (1960) వంటి పణికర్ రచనలు మళయాళ కవిత్వానికి ఒక మేలుమలుపు. ఆయన వివిధ కవితారూపాలతో ప్రయోగాలు చేశారు. సంస్కృత ఛందస్సుతో కూడిన ఛందోబద్ధ పద్య బానిసత్వం నుండి కవిత్వాన్ని విముక్తి చేశారు.

ఆయన రాసిన 'కృతికల్, చింత' వంటి వ్యాసాలు ఆయన తరం నాటక రచయితలపై అత్యంత ప్రభావాన్ని చూపాయి. ఆయన కవిత 'వీడియో చావు'లో ఈనాటి ప్రపంచీకరణ మానవ సంబంధాలను, ఆర్థికసంబంధాలుగా ఎలా దిగజారుస్తోందో అత్యంత ప్రతిభావంతంగా చిత్రించారు. 20 గ్రంథాలకు సంపాదకత్వం, 8 అనువాదాలు, 12 కవితాసంపుటాలు వెలువరించారు

'మాకు తెలియకుండా మాచే కొత్త ప్రయోగాలు చేయించడంలోనూ, పాశ్చాత్య సాహిత్యాన్ని అనువాదం చేయించడంలోనూ, నూతన రీతిలో కవిత్వాన్ని రాయడంలోనూ, మాకు నాయకత్వం వహించడంలో ఆయన చేసిన కృషి చారిత్రాత్మకమైనది. ఈనాటి సరికొత్త మళయాళకవి కూడా ఆయనకు ఎంతో కొంత రుణపడి వుంటారు' అంటూ ప్రముఖ మళయాళీ సాహితీవేత్త కె.సచ్చిదానందన్ చేత ప్రశంసింపబడిన అయ్యప్ప పణికర్ 1930 సెప్టెంబర్ 12న కుట్టనాడులోని కావాలంలో జన్మించారు. 2006 ఆగస్టు, 23న తిరువనంతపురంలో మరణించారు.

వ్యాసం

# పర్యావరణ పరిరక్షణ : పిల్లి మెడలో గంట

- ఓ.వి.వి.యస్.

**ఈజిప్టులోని** షర్మ్–ఎల్–షేక్ నగరంలో ఇటీవల నవంబర్ 6 నుండి రెండు వారాలపాటు ఐక్యరాజ్యసమితి సంస్థ ఐన యునైటెడ్ నేషన్స్ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ క్లయిమేట్ ఛేంజ్ (UNFCCC) పర్యావరణ సదస్సును నిర్వహించింది. అభివృద్ధి చెందిన, చెందుతూన్న 134 దేశాలు ఈ సదస్సులో పాల్గొన్నాయి. భూతాపాన్ని తగ్గించి తీరాలని తీర్మానించుకుంటూ, అందుకు కారణమౌతున్న కర్బన ఉద్గారాల ఉత్పన్నానికి బాధ్యత మీదంటే మీదని వేళ్ళు చూపుకుంటూ, నష్టపరిహారాలా?!.... ఎవరిస్తారు?!.. ఎవరికి.. ఎంత?!.. అంటూ తర్జనభర్జనలు పడి, అనుకున్నదానికంటే ఒకరోజు అదనంగా పొడిగించి మరీ..... కొండను తవ్వి ఎలుకను పట్టిన చందంగా సదస్సు ముగిసింది. గ్లోబలీకరణగా సాగుతూ గత ముప్పై యేళ్ళుగా ధనిక దేశాల ధనార్జనకు పర్యావరణరీత్యా బలైపోతున్న బడుగు దేశాల నష్టపరిహారం విషయమై (Loss and Damage), ఘనత వహించిన అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాల పెద్దలు ఒక మెట్టు దిగి ధన సహాయం (ఫండ్) ఏర్పాటు చేస్తామన్నదొక్కటే సానుకూల అంశంగా ప్రస్తుతానికి కనిపిస్తున్నది.

సంపన్న దేశాలు, వాటిని నియంత్రించే బహుళజాతి సంస్థలు తమ లాభాలు మేటలు వేసేందుకు భూగోళమంతటా, గనుల త్రవ్వకాలు – అడవుల నరికివేత, శిలాజ యింధనాల మితిమీరిన ఉత్పత్తి, వినియోగమూ వంటి విధానాలను యధేచ్ఛగా చేపడుతున్నాయి. దీని ఫలితంగా ఒకవైపు మానవశ్రమ దోపిడీ కావడమే కాదు, తీవ్రమైన పర్యావరణ సమస్యలూ ఉత్పన్నమౌతున్నాయి. ఇటీవల జూన్ నెల 2022లో పాకిస్థాన్‌లో వచ్చిన అసాధారణ వరదల కారణంగా 1800 మంది మరణించారు. 21 లక్షలమంది నిరాశ్రయులయ్యారు. 2020లో దక్షిణాసియా అంతటా కూడా ఇదే విధంగా ఋతువులు తప్పిన వరదలు సంభవించాయి. హిందూ మహాసముద్రం ఉపరితల జలాలు అత్యధికంగా వేడెక్కడం దీనికి ప్రధాన కారణమని పర్యావరణ పరిశోధకులు చెబుతున్నారు. నిజం చెప్పాలంటే గ్లోబల్ గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలలో పాకిస్థాన్ వాటా కేవలం 1% మాత్రమే. సెప్టెంబర్ 2022 నాటికి ఈ వరదల అనంతర పునర్ నిర్మాణానికి 30 బిలియన్ డాలర్ల అంతర్జాతీయ సహాయానికి పాకిస్థాన్ జోలెపట్టి నిలుచున్నది. 2019 నాటికే యూరోపియన్ యూనియన్ కర్బన ఉద్గారాలు 3.3 బిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకున్నాయి. ఇందుకు ప్రధాన కారణం శిలాజ యింధనాలను ఆయా దేశాలు విచ్చలవిడిగా వినియోగించడమే. దీని ఫలితంగా హీట్‌వేవ్ ట్రెండ్ పెరిగి గతంలో ఎన్నడూ చవిచూడని విధంగా ఐరోపాను వేడిగాలులు ముంచెత్తాయి. 9 లాటిన్ అమెరికన్ దేశాలలో, 50 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో వ్యాపించియున్న, అమెజాన్ అడవులు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. భూగోళపు ఊపిరితిత్తులుగా పేర్కొనే ఈ అమెజాన్ అడవులు ప్రపంచం పీల్చుకునే ఆక్సిజన్‌ను 21% యిస్తున్నాయి. అలాగే ప్రపంచం విడుదల చేసిన 25% కార్బన్‌డయాక్సైడ్‌ను పీల్చుకుంటున్నాయి. బంగారపు గనుల కార్యకలాపాలు, గొడ్డుమాంసపు ఉత్పత్తి, సోయాబీన్ ఉత్పత్తి తదితర కారణాల రీత్యా అమెజాన్ అడవులు వేగంగా తరిగిపోతున్నాయి. ఒక స్వచ్ఛంద సంస్థ అంచనా ప్రకారం అమెజాన్ అడవులలో ముఖ్యంగా బ్రెజిల్‌లో సెకనుకు 18 చెట్లు నరికివేయబడుతున్నాయి. ఈ పాపంలో పెద్దవాటా బ్రెజిల్‌కు నిన్నటివరకు అధ్యక్షుడైన బోల్సొనారాదే అంటూ మీడియా కోడై కూస్తున్నది. కానీ ఆయన ఇదంతా అమెరికన్ సామ్రాజ్యవాద ప్రయోజనాలకోసమే చేసినట్టు ప్రపంచానికి తెలుసు.


ఇటీవల విడుదలైన ఆక్స్‌ఫాం నివేదిక కర్బన ఉద్గారాల విడుదల విషయంలో ప్రపంచ బిలియనీర్ల పాపాన్ని కళ్ళకు కట్టించింది. ఆర్థిక అసమానతలకు, పర్యావరణ విధ్వంసానికీ గల సంబంధాన్ని ఇది ప్రజల ముందు ఆవిష్కరించింది. అమెజాన్ సంస్థ వ్యవస్థాపకుడైన జెఫ్ బెజోస్ కేవలం పదకొండు నిమిషాలపాటు జాయ్ రైడ్ పేరిట చేసిన అంతరిక్ష ప్రయాణం, సాధారణ ఐరోపా వాసి తన జీవితకాలంలో వెలువరించే కర్బన ఉద్గారంకన్నా చాలా ఎక్కువని తెలిపింది. ఫ్రాన్సు దేశపు బిలియనీర్లు కేవలం 4 గంటలపాటు చేసే స్వంత విమాన ప్రయాణాల వలన విడుదలౌతున్న కర్బన ఉద్గారాలు ఆ దేశపు సామాన్యుడు ఒక సంవత్సరకాలంపాటు చేసే కారు ప్రయాణాలు వగైరాల వలన ఉత్పన్నమయ్యే కర్బన ఉద్గారాలకన్న ఎంతో ఎక్కువట. ధనికులు, పేదల మధ్య ఆర్థిక అసమానత స్థాయిని అనుసరించి కర్బన ఉద్గారాలు వ్యత్యాసం ఉన్నట్టే ధనిక దేశం, పేద దేశాల మధ్య కూడా ఈ కర్బన ఉద్గారాల విడుదలల వ్యత్యాసం ఉంటుందని తెలిపింది. అమెరికాకు ఆదాయాన్ని బట్టి అడుగునున్న 50% జనాభా సంవత్సరానికి 10 టన్నుల కర్బన ఉద్గారాలను, మధ్య 40% జనాభా 22 టన్నులు కర్బన ఉద్గారాలను విడుదల చేస్తుండగా, అత్యంత సంపన్నులైన పై 10% జనాభా దారుణంగా 75 టన్నుల కర్బన ఉద్గారాలను ప్రపంచం మీదికి ఊదేస్తున్నారని తెలిపింది. కాగా అభివృద్ధి చెందుతూ 'ఉన్న' భారతదేశంలో అల్పాదాయ 50% జనాభా అంతా కలిపి కేవలం 1 టన్ను కర్బన ఉద్గారాలను, మధ్యస్థ ఆదాయం 40% జనాభా 2 టన్నులు కర్బన ఉద్గారాలనే విడుదల చేస్తుండగా,

అంబానీ, అదానీ సోదరులైన పై 10% ఆదాయవర్గాలవారు 9 టన్నుల కర్బన ఉద్గారాలను విడుదల చేస్తున్నారు. ప్రజారవాణా వ్యవస్థ పటిష్టంగా ఉన్నచోట కర్బన ఉద్గారాలు తక్కువని, ప్రయివేటు రవాణా వ్యవస్థ వలన కర్బన ఉద్గారాలు ఎక్కువనీ తెల్పింది. భారతదేశంలో నూటికి 26 మంది మాత్రమే స్వంత కార్లు కలిగినవారు ఉండగా, అమెరికాలో ఇది 84%. ఈ ప్రయివేటు ఆధిక్య రవాణా వ్యవస్థ చిత్తం వచ్చినట్టు కర్బన ఉద్గారాలను వెలువరించడం మామూలే. ధనికుల, ధనికదేశాల ఈ బాధ్యతారహిత విధానాలన్నీ 2030 నాటికి మానవాళి మనుగడకు ప్రమాదరహితమైన స్థాయికి కర్బన ఉద్గారాలను నియంత్రించాలన్న ఆశయానికి తూట్లు పొడుస్తున్నాయి. తద్వారా భూతాపం పెరుగుదల రేటును 1.5$^{o}$c వద్దనే నిలవరించాలనే మానవాళి ఆకాంక్షను కూడా తుంగలోకి తొక్కుతున్నాయి.

సైన్సు వలన ఈరోజున
సామాన్యుని బ్రతుకు కూడా
సౌందర్యమయం కాగల
సదుపాయం లభించింది.... అంటూ ఏనాడో మహాకవి శ్రీశ్రీ చెప్పాడు.

కానీ ఆ సదుపాయం ఈనాటికి కూడా పేదలకు ధనస్వామ్యం అనుమతించిన మేరకు మాత్రమే అందుబాటులోకి వస్తున్నది. ఆ సదుపాయాన్ని అందించడంలో ధనికులకు పెద్దపీట వేస్తూ, సామాన్యులకు మొండిచేయి చూపిస్తూ క్రూర పరిహాసం చేస్తున్నది. ఈ పరిహాసం మితిమీరి పుడమితల్లితో సైతం ఆటలాడుతూ, పర్యవసానాలకు పేదల బ్రతుకులను ఎరవేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది నిరుపేదలు, నిర్భాగ్యుల జీవించే హక్కును కాలరాచివేస్తున్నది. నాటి భోపాల్ గ్యాసు లీకేజి నుండి, నిన్నటి విశాఖ స్టైరీన్ లీకేజీ సంఘటన వరకు ఈ క్రమానికి మనదేశం కూడా మినహాయింపు కాదు. గనుల త్రవ్వకాలు, శిలాజ యింధనాల వెలికితీత, మార్కెట్ల కోసం సామ్రాజ్యవాద దేశాల మధ్య పోటీ, లాభాల కోసం మితిమీరిన వెంపర్లాటలలో తమకు ఏ ప్రమేయమూ లేకుండానే సామాన్యులు సమిధలైపోతున్నారు. పర్యావరణమూ విధ్వంసమౌతున్నది. ఆ సామ్రాజ్యవాద శక్తుల కుతంత్రాలకు మన పాలకులు జోహుకుం అంటూ నిస్సిగ్గుగా సాగిల పడుతున్నారు. ఈ విషయాలపట్ల ప్రజలను చైతన్యవంతులను చేయటం నేటి అవసరం.

# ప్రజాసాహిత్యాభిమాని ఎం.వి. భద్రం మరణం



**జనసాహితి** సంస్థకి, ప్రజాసాహితి పత్రికకు ఆప్తులు, సంస్థ ఏర్పడినప్పటినుండి చివరికంటా అనుబంధంతో వున్న ఎం.వి. భద్రం 21-11-2022న తమ 90 ఏళ్ల వయసులో హైదరాబాద్‌లో మరణించారు. ఆయన రేపల్లె దగ్గర భట్టిప్రోలు - చల్లపల్లిల నడుమ కృష్ణానది లంకలలో ఒకటైన తడికలపూడి గ్రామంలో జూలై 1, 1932న జన్మించారు.

వారు మంచి చదువరి. ఆయన మచిలీపట్నంలో ఉన్న కాలంలో విద్యార్థి యువజనులలో మార్క్సిస్టు భావజాల వ్యాప్తిలో కృషి సల్పారు. అక్కడే ప్రముఖ కవి చిత్తజల్లు వరహాలరావు (సి.వి.)తో వారికి పరిచయం ఏర్పడింది. వారి అన్నయ్య సుబ్బారావు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో గెరిల్లా దళాలలో పోరాట విరమణ దాకా పనిచేశారు. తర్వాత అస్సాం బొగ్గుగని కార్మికులను సంఘటితపరిచారు. వారి చెల్లెలు ఉదయలక్ష్మికి, తనకు ఆప్తమిత్రుడైన ప్రముఖ లాయరు కంఠంనేని రవీంద్రరావుతో ఆదర్శ వివాహం చేశారు.

అభ్యుదయ భావాలు గల భద్రం హైదరాబాదులో ప్రోగ్రెసివ్ ప్రెస్ స్థాపించటానికి ముందు మద్రాసులో 'చందమామ' పత్రికలోనూ, 'యువ' మాసపత్రిక మార్కెటింగ్ శాఖలోనూ పనిచేశారు. అప్పుడు వారికి కొడవటిగంటి కుటుంబరావుతో సన్నిహిత సంబంధాలు ఉండేవి.

'యువ' ప్రచురణ హైదరాబాదు చేరడంతో భద్రం కూడా అక్కడకు మారారు. ఆ రోజులలో త్రిపురనేని గోపీచంద్‌తో ఆయనకు సాన్నిహిత్యం ఉండేది. 'యువ' పత్రికలో ఏదో వివాదం సంభవించిన కారణంగా తానే స్వయంగా ప్రోగ్రెసివ్ ప్రెస్ ప్రారంభించారు.

విశాఖపట్నంలో కుటుంబ సమస్యలతో చిక్కుకొనివున్న రంగనాయకమ్మకు హైదరాబాదులోని తమ ఇంట్లో కొన్నాళ్ళు ఆశ్రయమిచ్చి చాలా సహాయపడ్డారు. ఆమె గౌరవ సంపాదకులుగా చలసాని ప్రసాదరావు తోడ్పాటుతో 1970ల ప్రారంభంలో 'వసుధ' అనే ఉత్తమ సాహిత్య సామాజిక మాసపత్రికను ప్రచురించారు.

హైదరాబాదు సమీపంలోని దిండిగల్ గ్రామం దగ్గర 'సేవాశ్రమం' అనే ఆదర్శ వృద్ధాశ్రమం స్థాపించి తన ఆరోగ్యం సహకరించి నంతకాలం దానిని నిర్వహించారు. ఆయన మార్క్సిజం ప్రాపంచిక దృక్పథంగా జీవించినవారు. చివరికంటా వామపక్ష ఉద్యమాలకు, సాహిత్యానికి తమ తోడ్పాటును అందించిన ముమ్మనేని వీరభద్రం మరణానికి జనసాహితి సంతాపం తెలియచేస్తున్నది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తోంది.




**జాషువా కావ్యాలకు హిందీ అనువాదాలు :**

డా॥ కోనేరు హేమలత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఎం.ఏ. బిఇడి చదివారు. భీష్మ సాహ్నీ కథలపై డాక్టరేట్ చేశారు. విజయవాడ సిద్ధార్థ మహిళా కళాశాలలో హిందీ అధ్యాపకులుగా పనిచేసి రిటైరయ్యారు. విశ్రాంత జీవితంలో తెలుగు సాహిత్యాన్ని హిందీ లోకానికి అందించాలనే లక్ష్యంతో 2017 నుండి ఈనాటివరకు జాషువా రాసిన ఫిరదౌసి' (2017); 'గబ్బిలం' (చమ్‌గాదడ్ 2019); 'కొత్తలోకం' (నయీదునియా 2020); 'క్రీస్తు చరిత్ర' (2021); 'ముంతాజ్ మహల్' (2022)ను హిందీలోకి అనువదించారు. వీటికంటే ముందు చలం 'బ్రాహ్మణీకం'ను 'నయానీడ్' అనే పేరుతో అనువదించారు. అబ్బూరి ఛాయాదేవి కథ 'సుఖాంతం' హిందీలో అందించారు. తనికెళ్ళ భరణి 'పరికిణీ' కవితలను, రాహుల్ సాంకృత్యాయన్ సాహసిక యాత్రలో కొన్ని భాగాలను హిందీలోకి తర్జుమా చేశారు. వివిధ హిందీ పత్రికలలో తెలుగు సాహిత్యంపై వ్యాసాలు రాశారు. హిందీ–తెలుగు; తెలుగు–హిందీ శబ్దకోశం తయారుచేశారు.

అన్ని పుస్తకాలు 1/8 డెమ్మీలో వున్నాయి. 'ఫిరదౌసి' 104 పుటలు – వెల : రూ. 150/–; 'గబ్బిలం' 116 పుటలు – వెల : రూ. 100/–; కొత్తలోకం ('నయి దునియా') 112 పుటలు – వెల : రూ. 130/–; 'క్రీస్తు చరిత్ర' 110 పుటలు – వెల : రూ. 180/–; 'ముంతాజ్ మహల్' 58 పుటలు – వెల : రూ. 95/–

చిరునామా : కె. హేమలత, 4–103 వాటర్‌టాంక్ రోడ్, నిడమానూరు, విజయవాడ – 521104. ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 94401 59229.

**మద్యమా? మానవ మనుగడా? (మద్యపాన వ్యతిరేక కరపత్రాల సంకలనం) : సంపాదకత్వం, సంకలనం : గౌరవ్, సతీశ్**

మద్యపాన వ్యతిరేక ప్రచార సమితి పిఠాపురంవారు ప్రచురించిన 14 కరపత్రాల సంకలనం. 1/8 డెమ్మీలో 40 పుటల పుస్తకం. వెల : అమూల్యం. ప్రథమముద్రణ : అక్టోబర్ 2, 2022. ప్రాప్తిస్థానం : సహృదయ మిత్రమండలి, 14–1–11, వంగలవారి వీధి, పిఠాపురం, కాకినాడజిల్లా – 533450. ఫోన్ : 96525 52556.

**కొంటె బొమ్మల బ్రహ్మలు (166 తెలుగు కార్టూనిస్టుల సెల్ఫీలు) : సంపాదకులు : కళాసాగర్, యల్లపు**

చిత్రకారుడు కళాసాగర్ 12 ఏళ్ళ నుండీ 64kalalu.com అనే ఎలక్ట్రానిక్ పత్రికను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఆ సంచికల్లో ఎందరో సమకాలీన కార్టూనిస్టులు తమ గురించి రాసుకున్నవీ, మరికొందరి గురించి ఇతరులు రాసినవీ కలిపి ఈ పుస్తకం ప్రచురించారు.

తలిశెట్టి రామారావు మొదటి కార్టూను 'భారతి' పత్రికలో 1927 పుష్యమాస సంచికలో ప్రచురితమైంది. కనుక ఇంకో నాలుగేళ్ళకు తెలుగు కార్టూన్ శతజయంతి జరిపే సన్నాహంలో భాగంగా ఈ పుస్తకం వెలువడిందని భావించవచ్చు. యండమూరి వీరేంద్రనాథ్, జయదేవ్, కళాసాగర్‌లు ముందుమాటలు రాశారు. ఆ తర్వాత కార్టూనిస్టుల ప్రపంచంలో పడిపోతాం.

కార్టూన్ చిత్రం చూసిన వెంటనే నవ్వు రావాలి. కాని ఈనాడు దానిపైన సంభాషణలో, వ్యాఖ్యలో రాస్తేనే నవ్వు వస్తుంది. నిజానికి కార్టూన్‌కు వ్యాఖ్య వుండకూడదు. వుంటే దానిని 'వాక్టూన్' అనాలిగాని 'కార్టూన్' అనగూడదు. ఇపుడు కార్టూన్ల పేరుతో వస్తున్నవన్నీ 'వాక్టూనులే!' 1940, 50లలో వ్యాఖ్యానరహిత కార్టూన్లు వచ్చేవి. ఇప్పుడు బొమ్మ లేకుండా, ఆ వ్యాఖ్య చదివినా చాలు నవ్వుకోడానికి పనికి వస్తుంది.

సరే, ఈ పుస్తకంలో కార్టూనిస్టులు తమను తామే పరిచయం చేసుకున్నారు. ఆ పరిచయంలో భాగంగా వారి కార్టూను కూడా ముద్రించారు. కొన్ని పరిచయాలు కళాసాగర్, సుధామ చేశారు.

గతంలో రాజకీయ నాయకులపై కార్టూన్లు నిర్భయంగా వేసేవారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. రాజకీయ నాయకులను విమర్శిస్తూ రాసినా, చిత్రాలు వేసినా గతంలో వాటిని పట్టించుకునేవారు కాదు. ఇప్పుడైతే అటువంటి చిత్రాలు వేసేవారిని 'రాజద్రోహ' నేరస్థులుగా అరెస్టు చేస్తున్నారు. ఫలితంగా పొలిటికల్ కార్టూన్లు వేయడానికి వెనుకాడుతున్నారు.

పుస్తకం చివర్లో జయదేవ్ తెలుగు కార్టూనిస్టుల సంతకాలు గురించి వివరిస్తూ మొదట్లో వ.పా.గారి రెండు సున్నాల మధ్య ఒక నిలువుగీత సంతకాన్ని విశ్లేషించారు. బాపు – సంతకం పలు రూపాంతరాలు చెంది ఆఖరికి రెండు గీతల ముక్కగా మిగిలిన వాస్తవాన్ని వివరించారు.

తెలుగులో ఇప్పటివరకు వెలువడిన 100 కార్టూన్ల పుస్తకాల జాబితా కళాసాగర్ పొందుపరిచారు. వీటిలో పిహెచ్‌డి కోసం సమర్పించిన పరిశోధనాపత్రం, మూడు స్వీయచరిత్రలూ వున్నాయి.

డా॥ జయదేవ్ తన వ్యాసం 'కార్టూన్ కళాతారలు'లో అన్నట్లు 'ఈ పుస్తకం నేటి కార్టూనిస్టులకి ఒక డైరీ. భావితరం కార్టూనిస్టులకి ఒక డైరక్టరీ!'

1/8 డెమ్మీలో 448 పుటల ఈ పుస్తకం వెల : రూ. 350/– ప్రథమముద్రణ : సెప్టెంబర్ 2021. ప్రతులకు : కళాసాగర్, విజయవాడ. సెల్ : 98852 89995. e-mail : artistkalasagar@gmail.com; www.64kalalu.com

**TEEVEE : Neo Realist Artist : ALBUM :**

1961 నుండీ రాజకీయ కార్టూనిస్టుగా కృషి ప్రారంభించిన తిప్పాని వెంకట్రావు (టీ.వీ). సామాజిక బాధ్యత గల చిత్రకారునిగా చిత్రించిన 213 చిత్రాల ఇంగ్లీషు ఆల్బమ్ ఇది. ఆంధ్రప్రదేశ్ సృజనాత్మక, సాంస్కృతిక సమితి ప్రచురించింది. బుద్ధప్రసాద్, విజయభాస్కర్, శివనాగిరెడ్డిగార్లు టీ.వీ.ని పరిచయం చేస్తూ వ్యాసాలు రాశారు.

దళసరి ఆర్ట్‌పేపర్‌పై టీ.వీ. చిత్రించిన రంగుల చిత్రాలు, తెలుపు–నలుపు చిత్రాలు, ఎగ్జిబిషన్ చిత్రాలు మొదలైనవాటిని ఈ ఆల్బమ్‌లో అందంగా అమర్చారు. చిత్రకారులు, చిత్రకళాభిమానులు తప్పక ఇంటిలో వుంచుకోవాల్సిన ఆల్బమ్ ఇది.

ఎ4 పరిమాణంలో అడ్డంగా ముద్రించిన 68 పుటల ఈ పుస్తకం వెల : రూ. 200/– ప్రథమముద్రణ : ఆగస్టు 2018. ప్రతులకు : టి. వెంకట్రావు, 32–13–53/97, దాసరి రమణనగర్, సున్నపుబట్టీల సెంటర్, మొగల్రాజపురం, విజయవాడ–520010. ఆంధ్రప్రదేశ్. ఫోన్ : 92463 61993.

(ఇంకా వున్నాయి)

కవిత

# వెంటాడే అశ్రువొక్కటి

– మహెజబీన్

న్యాయం కోసం చేసిన సుదీర్ఘ పోరాటంలో
అన్యాయానికి బలి అయిన బిల్కీస్ బానో
నువ్వు గుర్తొచ్చినప్పుడల్లా
తల్లి పేగు తల్లడిల్లిపోతుంది

2002 విషాదాన్ని మోసుకొచ్చింది
మతోన్మాదం నిన్ను సమిధను చేసిన కాలం అది
అత్యాచారం సామూహికమై దహించినప్పుడు
నీ వయసు 21
బంగారు కలల నీ కాలం చెదిరి పోయింది
melancholy ఆవరించింది

నీ కళ్ళ ముందు చంపబడ్డ నీ కుటుంబం
రోజంతా కొనసాగిన హింస
గుర్తుంది అందరికి
నీ 5 నెలల గర్భం చేసిన ఆక్రందన
వినిపిస్తూనే వుంది ఇప్పటికి

2002ని మరిచిపోలేదు ఎవరు
మైనారిటీల మీద అదొక ప్రయోగశాల
ఆ గాయాల ఆనవాళ్ళు
సుప్తచేతనలో నిలిచేవున్నాయి
నువ్వు, నేను second citizens అని
గుర్తుచేసిన కాలం అది
ఆ కాల మింకా సాగుతూనే వుంది
ఏంచేయను చెప్పు?

75 అమృతాలు నాకేమి ఇవ్వకుండానే
వెళ్లిపోయాయి
అయినా నేనేమి అనుకోలేదు
ఎందుకంటే -
15 ఆగష్టు నాకెంతో ప్రియమైనది
అయితే -
అత్యాచార నేరస్తుల జీవిత ఖైదు క్షమార్హమై,
వాళ్ళు విముక్తమైన రోజుగా
ఈ సారి 15 ఆగష్టు 2022 గుర్తుండిపోతుంది

వెంటాడే అశ్రువొక్కటి
నిప్పుకణిక అయి
కంట్లో గుచ్చుకుంటూనే ఉంది ✤

దీర్ఘ కవిత

# రంగు వెలసిన చిత్రం

– శీలా సుభద్రాదేవి

(గత సంచిక తరువాయి...)

కొత్తరంగుల తురాయివి
నెత్తిన మొలిపించుకుని
వాహనాలన్నీ కొత్తపెళ్ళికొడుకుల్లై కులుకుతున్నాయి
వాహనచోదకులూ పదాతి దళాలు
జండాధారులై
కళ్ళనిండా కాంతులు వెలిగించుకుని
రంగులపతాకాలనీడల్లో సేదతీరుతున్నారు
అయిదేళ్ళకోసారికాకుండా
ప్రతి ఏడాది పండగకోసం కలలు కంటూ
ఆలోచనలనిండా ఆశలపందిళ్ళు వేస్తూ
ఆలుబిడ్డల కళ్ళల్లో మతాబులు పూయిస్తున్నారు
రోజంతా గొంతులు ఎలుగు రాసిపోయేలా
రోడ్లనిండా జయజయధ్వానాల్ని
పూలజల్లులుగా కురిపించి
సూర్యుడితోపాటు రోడ్లని కొలుస్తున్నారు
పగలంతా రాజకీయ ఆవేశాలతో రగిలి రగిలి
వేడెక్కిపోయిన గుండెల్ని చల్లబరిచేటందుకై
చేతిలో పడిన పైసల్ని
మత్తుదుకాణాల్లో కుదువపెట్టి
కళ్ళల్లో దీపాల్ని వెలిగించుకుని కాచుకున్న భార్యాబిడ్డలకు
ఎప్పటిలాగే జోగుతూవచ్చి మొండిచెయ్యి విసిరేస్తున్నారు
ఎన్నికలపండగలో నిరంతరదృశ్యం ఇదే ఇదే!

కొందరు భూతదయామయులు తెల్లారేసరికి
జొన్నలో సూకలో చేతిసంచిలో నింపుకొని
పావురాలకు దాణా పెట్టేందుకు బయలెల్లినట్లు
భుజాలకు మేనిఫెస్టోల సంచిని వేలాడేసి
వందిమాగధుల సహితులై వీధివీధీ తిరిగి
వాగ్దానాల దాణాల్ని దారిపొడవునా చల్లుతూ
మేతకోసం వెతికే అవసరం లేక
ఎగరటం మర్చిపోయి
అంతస్తుల కిటికీల సందులోనో
ఆలయగోపురాల గూళ్ళల్లోనో తప్ప
పచ్చని చెట్లకొమ్మల గుబురుల్లో
వెచ్చని గూడు కట్టుకోవటం చాతకాక
జోగుతోన్న పావురాలైన జనాల్ని
ఇంకా ఇంకా
ఎదగడం చేతకాని వాళ్ళని చేసి
అవసరంలేని రాయితీలతో
మాటలమంత్రజలం చల్లుతున్నారు

రోజురోజుకూ బలం పుంజుకుంటూ
అనుయాయుల నీరాజనాలతో పరవశులౌతూ
ఆత్మస్తుతి,పరనిందలతో నిర్భీతిగా నిర్లజ్జగా
రెట్టించిన ఉత్సాహంతో కందిరీగలరొదలా
ఆవరణంతా శబ్దకాలుష్యంతో నింపుతున్నారు

ఎక్కిన పీఠం కదలకూడదనో
ఎక్కాల్సిన సింహాసనం అందుకోడానికో
ఏదైతేనేం
రెచ్చిపోతున్న పదవీ కాంక్షతో
ఊరిస్తున్న ఎన్నికలతో
వాతావరణమంతా పొగలాగ కమ్మి
ఆకాశమంతా ఎగురుతోన్న వాగ్దానాలే వాగ్దానాలు!
అవి ఆహ్లాదపరిచే సీతాకోకచిలుకలో
కుట్టిచంపే కందిరీగలో
అర్థంకాని అయోమయంలో కూడా
జనసమూహం గుండెల్లో కలతేకలలు!! (ఇంకా వుంది) ✤

PRAJA SAAHITI December 2022 (TELUGU) Rs. 25/- RNI No.APTEL/1977/00571 Postal Regd. No. Vj/030/2021-2023

No. of Pages : 36 Date of Publication : 28th of Last Month Posting : 1st or 2nd of Every Month



మానవులందరం సమానంగా జీవించే హక్కుకై పోరాడుదాం!!

ప్రజాసాహితి 30-7-6, అనపర్తివారి వీధి, అన్నదాన సమాజం రోడ్డు, దుర్గాఅగ్రహారం, విజయవాడ - 520002.

Editor : P.S. NAGARAJU, Edited, Printed and Published by K. RAVI BABU at Vanaja Press, Vijayawada - 520 002 for Co-operative Press, Vijayawada

A PUBLICATION OF JANASAAHITHI